www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 10-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 335 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి ఉ.7:27 తదుపరి నవమి, నక్షత్రం: విశాఖ ఉ.7:55 తదుపరి అనూరాధ వర్జ్యం: మ.12:24-2:12, దుర్ముహూర్తం: ఉ.9:04-9:50, రా.10:19-11:08, అమృతఘడియలు: రా.11:11-12:59, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:47, సూర్యాస్తమయం: 6:11 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీశైలంలో శివదీక్షాధారుల ఆందోళన


సోమవారం ధ్వజస్తంభం వద్ద గేట్ల పైకి ఎక్కుతున్న శివదీక్షాధారులు

అనూహ్యంగా రద్దీ
జ్యోతిర్ముడి స్వాములకు ఉచిత స్పర్శ దర్శనం
కొందరు మళ్లీమళ్లీ రావడంతో తోపులాట
సహనం కోల్పోయిన శివదీక్షాధారులు 3
బారికేడ్లు తోసి, తాళాలు పగులగొట్టి విధ్వంసం

దేశంలో క్యాన్సర్ కేర్ సెంటర్లలో పనిచేసేవి
34 శాతం మాత్రమే!

వాటిలోనూ అత్యధికం తెలంగాణ, బిహార్, కర్ణాటకల్లోనే.. 2

పీఎఫ్ సొమ్ము విత్‌డ్రాకు ప్రత్యేకంగా యాప్
ఏప్రిల్‌లో ఆవిష్కరణకు సన్నాహాలు

జూన్ తర్వాత
ఎల్‌నినో?
'నైరుతి'పై ప్రతికూల ప్రభావం!
స్కైమెట్ తాజా అంచనా 3
వచ్చే నెలలో మరింత స్పష్టత!

వాహనాల కొనుగోలుకు పాన్ తప్పనిసరి!
రూ.5 లక్షలకన్నా ఖరీదైన వాటికి వర్తింపు
ఆదాయ పన్ను నిబంధనల్లో మార్పులతో ముసాయిదా 2
ఖాతాలో ఒక ఏడాదిలో రూ.10 లక్షలకు మించి జమ చేస్తేనే పాన్
కేటగిరీ-1 మెట్రో నగరాల జాబితాలోకి హైదరాబాద్, బెంగళూరు, పుణె
మార్చిలో కొత్త నిబంధనలు.. ఏప్రిల్ 1 నుంచి 'కొత్త ఐటీ చట్టం' అమలు


2
సైబర్ నేరాల ద్వారా
54 వేల కోట్ల దోపిడీ
ఇది చిన్న రాష్ట్రాల బడ్జెట్ కన్నా ఎక్కువ
నివారణకు నిబంధనలు రూపొందించండి
కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం



మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, సీఎస్ విజయానంద్, మంత్రులు లోకేశ్, అనిత, అచ్చెన్న తదితరులు

కుల చిచ్చుకు కుట్రలు!

వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దు: చంద్రబాబు

రాజకీయ నిరసనలపై ప్రత్యేక నిఘా పెట్టండి
పోలీసు శాఖకు ముఖ్యమంత్రి ఆదేశం
శాంతిభద్రతల పరిరక్షణలో టెక్నాలజీకి పెద్దపీట
వ్యక్తిత్వ హననానికి పాల్పడితే కఠిన చర్యలు
మైనర్లకు 'సోషల్ మీడియా' కట్టడి
నియంత్రణ చట్టం తీసుకొస్తున్నాం
రోడ్డు ప్రమాదాలు తగ్గాల్సిందే
గంజాయి సాగే కాదు.. వినియోగమూ తగ్గాలి
15 రోజులకోసారి అవగాహన ర్యాలీలు
ఇక ప్రతి నెలా సమీక్షిస్తా: ముఖ్యమంత్రి


ఢిల్లీ ఎయిర్‌పోర్టులో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

> సమాజంలో అశాంతి రేకెత్తించేందుకు ఎవరు ప్రయత్నించినా ఉపేక్షించే ప్రసక్తే లేదు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది.
> \- సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు.. రాజకీయ నిరసనలు పెరిగాయి.. విచ్చలవిడితనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దు..' అని పోలీసులకు సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ప్రత్యేక సీఎస్‌లు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులతో ముఖాముఖి సమావేశం జరిగింది. ఇందులో ఎస్పీలు, నగరాల పోలీసు కమిషనర్లు వర్చువల్‌గా

మిగతా 18వ పేజీలో...

టాప్‌లో విజయవాడ పశ్చిమ
హిందూపురం-5, పిఠాపురం-10 15
టాప్-13లోనూ లేని కుప్పం, మంగళగిరి
చిట్టచివరి స్థానంలో గుంటూరు పశ్చిమ
ప్రగతి నివేదిక విడుదల చేసిన చంద్రబాబు
నియోజకవర్గాల స్థితిగతులపై ర్యాంకింగ్స్

నేడు షాతో బాబు భేటీ
కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్, చౌహాన్, వైష్ణవ్‌లతోనూ..
ఏపీ ప్రాజెక్టులు, నిధులపై చర్చలు!
ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి 18
విమానాశ్రయ లాంజ్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన సచిన్

నీటి ఎద్దడి రావొద్దు

వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోండి
హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలొస్తే కలెక్టర్లు, మంత్రులదే బాధ్యత
అంగన్‌వాడీల్లో పోషకాహారం
సంజీవని ద్వారా జూలై నాటికి 66 లక్షల మందికి హెల్త్ స్క్రీనింగ్
5 లక్షల మంది హాస్టల్ విద్యార్థులకూ
12వ తరగతి వరకు 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ రూపొందించాలి
టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్
మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఆయన వివిధ అంశాలపై ప్రభుత్వ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పాలసీల అమలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతోందో ప్రత్యక్షంగా చూడాలని సూచించారు. పైస్థాయిలో ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా క్షేత్రస్థాయిలో పాలసీలు అమలుకానప్పుడు ఫలితం ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ వర్గాల ప్రజలతో

మిగతా 18వ పేజీలో..

కేంద్ర నిధులు మురిగిపోతే అధికారులదే బాధ్యత

> 19 నెలల్లో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలనూ గాడిన పెట్టాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. సంక్షేమ పథకాలు అవసరమా అనే చర్చను లేవనెత్తుతున్నారు. కానీ అసమానతలు తగ్గించేందుకు, జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి అవి అవసరమే.
> \- చంద్రబాబు

18

వాటిని తక్షణమే ఖర్చుచేయాలి: ముఖ్యమంత్రి
వ్యాపారులను వేధించొద్దు
పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలి
దేవదాయ శాఖ పనితీరుపై అసంతృప్తి
ఆన్‌లైన్‌పై శాఖలన్నిటికీ మార్చి 31 డెడ్‌లైన్
అన్ని వర్గాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి
సంక్షేమంతోనే అసమానతలు తగ్గుతాయి
సమష్టి కృషితో లాభాల బాటలో విశాఖ స్టీల్
మంత్రులు, కార్యదర్శుల భేటీలో చంద్రబాబు

నదుల అనుసంధానంతో రాష్ట్రానికి పుష్కలంగా జలాలు: సీఎం



పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన

స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసం!

నేడు నోటీసు ఇవ్వనున్న ప్రతిపక్షాలు
ఇప్పటికే 103 మంది ఎంపీల సంతకాలు
రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో చర్చ!
స్పీకర్‌తో రాహుల్, పలువురు నేతల భేటీ
మాట్లాడేందుకు అనుమతించాలన్న రాహుల్, నిరసనకు కారణాల ప్రస్తావన
అధికార పక్షంతో మాట్లాడి చెబుతానన్న స్పీకర్ ఓం బిర్లా 2

మాపై ఇంత తీవ్ర ఆరోపణా!
అధికార పార్టీ ఒత్తిడితోనే మీ ప్రకటన
స్పీకర్‌కు కాంగ్రెస్ మహిళా ఎంపీల లేఖ
లోక్‌సభకు వచ్చే ధైర్యం ప్రధాని మోదీకి లేదు: కాంగ్రెస్ నేత ప్రియాంక

ఎస్ఐఆర్‌లో ఆటంకాలకు
అనుమతించం
రాష్ట్రాలూ దీన్ని దృష్టిలో ఉంచుకోవాలి: సుప్రీం
బెంగాల్‌లో ఎస్ఐఆర్‌పై విచారణ 2

బేరసారాలన్నీ ఢిల్లీలోనే!

'కల్తీ నెయ్యి'లో రోజుకో కొత్త కోణం

వైవీ పీఏ చిన్నప్పన్నను అక్కడే కలిసిన ప్రీమియర్ డెయిరీ ఎండీ గుప్తా
కిలోకు రూ.7 కమీషన్ ఇచ్చేలా డీల్
పామిల్ జైన్‌తోనూ ఢిల్లీలోనే భేటీ
కిలోకు రూ.25 ఇవ్వాలని డిమాండ్
దీనిపై జైన్ ఫిర్యాదు చేసినా వైవీ మౌనం
గుప్తాను కలిసిన 'ఎంపీ నివాస్' ఎవరిది
ఎవరి అండతో చిన్నప్పన్న జోక్యం?
ఆ దిశగా దృష్టి సారించని 'సిట్'

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)
టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా అయిన వ్యవహారంలో దేశ రాజధాని ఢిల్లీ అడ్డాగా... అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న బేరసారాలు సాగించారని సీబీఐ సిట్ గుర్తించింది. ప్రీమియర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ జగ్‌మోహన్ గుప్తా ఢిల్లీ ఎంపీ నివాస్‌లోని ఒకరి ఫ్లాట్‌లో చిన్నప్పన్నను కలిశారు. టీటీడీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇప్పిస్తే తనకు కమీషన్ ఇవ్వాలని అక్కడే చిన్నప్పన్న బేరసారాలు సాగించారు. ఒప్పందం కుదిరాక కమీషన్‌కు సంబంధించిన నగదు సైతం చిన్నప్పన్నకు ఢిల్లీలోనే ముట్టింది. అంతకుముందు భోలేబాబా డెయిరీ

మిగతా 17వ పేజీలో...



చుక్క చుక్కలో కల్తీ!
వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వచావ్డా కల్తీ లీలలు
పత్రాలు, కాల్ రికార్డ్‌లతో అడ్డంగా దొరికారు

కల్తీ నెయ్యి ఘోర అపచారం
ఇలాంటి వాటికి ఆస్కారమివ్వకండి 17
చంద్రబాబుకు శ్రీవారి ఆలయ పెద్దజీయర్ లేఖ

'లడ్డూ జిహాద్' జరిగిందేమో!
కల్తీపై అప్పటి పాలకవర్గం క్షమాపణ చెప్పాలి
ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద


2
3.25 లక్షల కోట్లతో..
రఫేల్ మెగా డీల్!
వాయుసేనకు 114 ఎఫ్4 ఫైటర్ జెట్లు
96 విమానాలు భారత్‌లోనే తయారు
2030 నుంచి సరఫరా ప్రారంభం
ఫ్రాన్స్‌తో ఒప్పందానికి భారత్ సిద్ధం

అసెంబ్లీకి ఒక్కరోజు వైసీపీ
18
రేపు గవర్నర్ ప్రసంగానికి హాజరు

జైలులో ఉన్నది పది నెలలేగా



రూ.732 కోట్లకు ఆ శిక్ష సరిపోతుందనుకుంటున్నారా?

ఆ డబ్బు మీ ఖాతాల్లో కనిపించకపోవచ్చు
కుంభకోణంలో మీ పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది
మీదే కీలకపాత్ర అని దర్యాప్తు నివేదికలో ఉంది
మీ నియంత్రణలోనే నిధులు మళ్లించిన షెల్ సంస్థ
మీరు ప్రధాన కుట్రదారు.. ఇతరులతో పోల్చలేం
మిగిలిన వారికి బెయిల్ ఇచ్చామని మీకు ఇవ్వలేం
మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
రాజ్ కసిరెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ
తదుపరి విచారణ ఎల్లుండికి వాయిదా




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డికి(ఏ1) సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు

మిగతా 17వ పేజీలో...

యూరప్‌లో 'ఎప్‌స్టీన్' ప్రకంపనలు

పలు దేశాల్లో మంత్రులు, ఉన్నత స్థాయి అధికారుల రాజీనామా


కీర్ స్టార్మర్


ఎప్‌స్టీన్


మెక్ స్వీనీ

అమెరికాలో బ్రిటన్ మాజీ రాయబారి మాండెల్సన్‌కు ఎప్‌స్టీన్‌తో లింకులు
బ్రిటన్ ప్రధానికి ఇబ్బందులు
స్టార్మర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మెక్ స్వీనీ రాజీనామా
పదవి వీడే ఆలోచన లేదన్న ప్రధాని స్టార్మర్

లండన్/పారిస్/ఓస్లో, ఫిబ్రవరి 9: ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రకంపనలు అమెరికాను దాటి పలు యూరప్ దేశాల రాజకీయ, దౌత్య వర్గాలతోపాటు యూకే రాజకుటుంబంపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి! బ్రిటన్‌లో సాక్షాత్తూ ప్రధాన మంత్రి పీఠమే కదులుతుండగా.. నార్వే, స్వీడన్, స్లొవేకియా, ఫ్రాన్స్ వంటి దాదాపు 10 దేశాల్లో ఈ ఫైల్స్ కారణంగా పలువురు మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఇక అమెరికాలో బ్రిటన్ మాజీ రాయబారి పీటర్ మాండెల్సన్‌కు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు బట్టబయలైన నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాండెల్సన్ గురించి తెలిసి కూడా 2024లో ఆయన్ను బ్రిటన్ అత్యున్నత దౌత్య పదవిలో నియమించడాన్ని రాజకీయ నాయకులు తప్పుపడుతున్నారు. మాండెల్సన్‌కు, ఎప్‌స్టీన్‌తో ఉన్న స్నేహం గురించి ఈమెయిల్స్ ద్వారా వెల్లడవడంతో గత సెప్టెంబరులో స్టార్మర్ ఆయన్ను పదవి నుంచి తప్పించారు. 15 ఏళ్ల క్రితం మాండెల్సన్ బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన కీలకమైన సమాచారాన్ని ఎప్‌స్టీన్‌కు చేరవేశారన్న ఆరోపణలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే, ఈ అంశంపై తీవ్ర దుమారం చెలరేగడంతో

మిగతా 2వ పేజీలో...

సైబర్ నేరాలతో రూ.54 వేల కోట్ల దోపిడీ!



▸ నివారణకు రూల్స్ రూపొందించండి

▸ కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తమ్మీద రూ.54వేల కోట్ల మేర చోరీ జరిగిందని, ఇది దారి దోపిడీ యేనని వ్యాఖ్యానించింది. వీటిని నివారించేందుకు రిజర్వు బ్యాంకు, టెలికాం శాఖలతో సంప్రదించి విధివిధానాలు, నిబంధనలను రూపొందించాలని సోమవారం కేంద్ర హోం శాఖను ఆదేశించింది. విధివిధానాలతో పాటు, వాటిని అమలు చేసేందుకు కుదుర్చుకునే అవగాహన ఒప్పందాన్ని 4 వారాల్లో సమర్పించాలని ఆదేశించింది. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంవల్లగానీ, కుమ్మక్కువల్లగానీ ఈ నేరాలు జరుగుతున్నట్టు కేసును విచారించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. సైబర్ నేరం జరిగినప్పుడు వెంటనే హెచ్చరించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) సేవలను ఎందుకు ఉపయోగించుకోకూడదని ప్రశ్నించింది. భారీగా నగదు విత్ డ్రా అయిన సందర్భాల్లో వినియోగదారులను హెచ్చరించాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందని తెలిపింది. సైబర్ నేరగాళ్లకు బ్యాంకులు రుణాలు ఇస్తుండడాన్ని తప్పుపట్టింది. డిజిటల్ అరెస్టులపై దర్యాప్తు చేసేందుకు సీబీఐకి అనుమతి ఇవ్వాలని గుజరాత్, ఢిల్లీ ప్రభుత్వాలను ఆదేశించింది.

హెయిర్ స్టైల్ చెడగొడితే 2 కోట్ల పరిహారమా!

▸ 25 లక్షలు చాలంటూ ఏడేళ్ల నాటి కేసులో సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఎంత పెద్ద మోడల్ అయినా హెయిర్ స్టయిల్ విలువ రూ.2 కోట్లు ఉంటుందా! హెయిర్ కటింగ్ చేసినవారు దానిని చెడగొట్టారంటూ అంత పెద్దమొత్తంలో నష్టపరిహారం కోరవచ్చా! ఆష్నారాయ్ అనే మోడల్ రూ.2 కోట్ల పరిహారం కోరారు. ఏడేళ్ల క్రితం నాటి ఈ కేసులో జాతీయ వినియోగదారుల వివాద పరిష్కారాల కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) కూడా అంతమొత్తం చెల్లించాల్సిందేనంటూ ఆమెకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే సుప్రీంకోర్టు తాజాగా ఈ తీర్పును తప్పుబడుతూ పరిహారాన్ని రూ.25 లక్షలకు కుదించింది. 2018లో ఆష్నారాయ్.. ఢిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌లో ఉన్న సెలూన్‌కు వెళ్లి హెయిర్ కటింగ్ చేసుకున్నారు. అయితే, ఆ సెలూన్ వారు నిర్లక్ష్యంగా చేసిన పనివల్ల తన లుక్ పూర్తిగా మారిపోయి, గ్లామర్ చెడిపోయిందని కోర్టును ఆశ్రయించారు.

ఎస్ఐఆర్‌లో ఆటంకాలను అనుమతించం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో అడ్డంకులు సృష్టించడానికి అనుమతించబోమని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ దీనిని దృష్టిలో ఉంచుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. ఆ రాష్ట్రంలో 'సర్' దరఖాస్తుల పరిశీలన, తుది వివరాల తయారీకి గడువును న్యాయస్థానం వారం రోజులు పొడిగించింది.

కారుణ్య నియామకాలు హక్కు కాదు: సీఐసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కారుణ్య నియామకాలకు సంబంధించి కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) కీలక వ్యాఖ్యలు చేసింది. "కారుణ్య నియామకాలు హక్కు కాదు" అని స్పష్టం చేసింది. మరణించిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం అందించే తోడ్పాటు మాత్రమేనని, దరఖాస్తుదారులు తమ హక్కుగా కారుణ్య నియామకాన్ని కోరలేరని పేర్కొంది. కారుణ్య నియామకాల్లో పారదర్శకత లేకపోవడం వల్ల ఈ వ్యవహారానికి సంబంధించి సమాచార చట్టం(ఆర్టీఐ) కింద ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. లఖ్‌నవూలోని సెంట్రల్ జీఎస్టీ, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ విభాగాల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి వచ్చిన ఆర్టీఐ దరఖాస్తులపై కమిషన్ ఈ మేరకు స్పందించింది.

ప్రియుడి సెల్‌కు తల్లి, పెద్దమ్మ ప్రైవేట్ ఫొటోలు

▸ కుమార్తె చర్యతో తల్లిదండ్రుల గగ్గోలు..పోలీసులకు ఫిర్యాదు

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమ మోజులో పడి ఒక కూతురు తన కన్నతల్లి, పెద్దమ్మ ప్రైవేటు ఫొటోలను మొబైల్‌లో ప్రియుడికి పంపింది. ఇది తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. బెంగళూరుకు చెందిన ఓ యువతి(23)కి ఆన్‌లైన్ తరగతుల కోసం తల్లిదండ్రులు ఓ స్మార్ట్‌ఫోన్ కొనిచ్చారు. ఇటీవల కూతురు ఓ యువకుడితో సన్నిహితంగా ఉన్నట్టు తల్లి గమనించింది. తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తి ఎవరని ప్రశ్నిస్తే....కూతురు దాటవేసే ప్రయత్నం చేసింది. దీంతో ఆ వ్యక్తి ఎవరో తెలుసుకునేందుకు ఫోన్ అన్‌లాక్ చేసి ఇవ్వాలని తల్లి కోరగా ససేమిరా అంది. తండ్రి విషయం తెలుసుకుని, కూతురును మందలించి, ఫోన్ లాక్ ఓపెన్ చేసి చూసేసరికి దారుణ దృశ్యాలు కనిపించాయి. తల్లి, పెద్దమ్మల ప్రైవేటు ఫొటోలను వాట్సాప్‌లో తన ప్రియుడికి కూతురు పంపినట్టు చూసిన తల్లిదండ్రులు హతాశులయ్యారు. యువతి, ఆమె ప్రియుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి తర్వాత విమానాలు రద్దు చేయం: ఇండిగో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విమాన డ్యూటీ కాల పరిమితి (ఎఫ్‌డీటీఎల్) నిబంధనల అమలుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్రానికి ప్రైవేటు విమానయాన సంస్థ ఇండిగో తెలిపినట్లు సమాచారం. 'ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను అమలు చేయడానికి ఇండిగోకు ఈ నెల 10 వరకు కేంద్రం గడువు పొడిగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండిగోతో అనుసరించాల్సిన వ్యూహంపై డీజీసీఏతో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు చర్చించారు. తమ వద్ద తగిన సంఖ్యలో పైలట్లు ఉన్నారని డీజీసీఏకు చెప్పిన ఇండిగో..ఈ నెల 10 తర్వాత విమానాలను రద్దు చేయబోమని తెలిపినట్లు సమాచారం.

సీషెల్స్‌కు భారత్ రూ.1500కోట్ల ప్యాకేజీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మకంగా కీలక దేశమైన సీషెల్స్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీతో సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ మధ్య సోమవారం జరిగిన విస్తృత చర్చల అనంతరం, సీషెల్స్ అభివృద్ధికి భారత్ రూ.1500 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. అంతేకాకుండా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఏడు ఒప్పందాలపై ఇరు దేశాల నేతలు సంతకాలు చేశారు.

ఏపీలోని రక్షణ ప్రాజెక్టులకు సహకరించండి

▸ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు టీడీపీ ఎంపీల వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్, రక్షణ తయారీ రంగాలకు సంబంధించిన కీలక ప్రాజెక్టులపై చొరవచూపి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందించారు. దొనకొండలో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, నెల్లూరులో ఉత్కర్ష అల్యూమినియం ధాతు నిగమ్ లిమిటెడ్ (యుఏడీఎన్ఎల్), అల్యూమినియం అలాయ్ ప్లాంట్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలని, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, విశాఖ సమీపంలో నౌకాదళ పరికరాలు, ఆయుధాల పరీక్షా కేంద్రం వంటివి చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు, రాష్ట్రంలో గుర్తించిన తయారీ హబ్‌లను కలుపుతూ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, స్వదేశీ రక్షణ ఉత్పత్తిని ప్రోత్సహించడం, రాష్ట్రంలో ఏరోస్పేస్ రక్షణ తయారీ హబ్‌ల అభివృద్ధి, ఐఐటీ తిరుపతిలో డీఆర్‌డీవో ఇండస్ట్రీ-అకడమిక్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ స్థాపన, సాధారణ ఆయుధ నిల్వ విధానం రూపకల్పనలో చొరవ చూపాలని కోరారు.



రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన టీడీపీ ఎంపీలు లావు, మాగుంట

స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం!

నేడు నోటీసు ఇవ్వనున్న ప్రతిపక్షాలు.. ఇప్పటికే 103 మంది ఎంపీల సంతకాలు

▸ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో చర్చ!




సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో సమావేశమైన విపక్ష పార్టీల ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పూర్తిగా అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ తమ గొంతు నొక్కుతున్నారని ఆరోపిస్తూ ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. ఇందుకు మంగళవారం నోటీసు ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో టీఎంసీ, వామపక్షాలు, డీఎంకే, సమాజ్‌వాది పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్పీ), ఆర్ఎస్పీ తదితర పార్టీల నేతలు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే 103 మంది ఎంపీలు ఈ తీర్మానంపై సంతకాలు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ తీర్మానం ప్రవేశపెట్టి, చర్చకు అనుమతించేందుకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలని, ఒక వేళ తీర్మానం నిబంధనలకు అనుగుణంగా ఉంటే మార్చి 9 తర్వాత జరిగే రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో చర్చ జరుగుతుందని పార్లమెంటరీ వర్గాలు తెలిపాయి. 8 మంది ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకూ బహిష్కరించడం, మహిళా ఎంపీల గురించి ప్రస్తావించడం, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనీయకపోవడంతో పాటు అదే సమయంలో కాంగ్రెస్‌కు, గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా రచించిన పుస్తకాలను ఉటంకిస్తూ మాట్లాడేందుకు బీజేపీ సభ్యుడు నిశికాంత దుబేను అనుమతించడం గురించి ఈ తీర్మానంలో ప్రస్తావించాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. నిబంధనల ప్రకారం నోటీసు అందిన 14 రోజుల తర్వాత స్పీకర్ ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు తేదీని నిర్ణయిస్తారు. సభకు హాజరైన సభ్యుల్లో మెజారిటీ సభ్యులు తీర్మానాన్ని ఆమోదిస్తే స్పీకర్ రాజీనామా చేయవలసి ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులు ఉండగా, ఇండియా కూటమికి 234 మంది సభ్యుల బలం ఉంది. చైనాతో ఘర్షణ సమయంలో దేశ రాజకీయ నాయకత్వం తమకు దిశా నిర్దేశం చేయలేదని భారత ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణె తన పుస్తకంలో చేసిన వ్యాఖ్యలను ఉటంకించేందుకు స్పీకర్ ఓం బిర్లా రాహుల్ గాంధీని అనుమతించకపోవడంతో అధికార పార్టీకి, ప్రతిపక్షాలకు మధ్య గత 8 రోజులుగా ఘర్షణ జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా, లోక్‌సభ సోమవారం కూడా గందరగోళం నడుమ వాయిదా పడిన తర్వాత రాహుల్ గాంధీ, మరికొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు స్పీకర్‌ను కలిశారు. కొద్ది నిమిషాల పాటు కొనసాగిన ఈ సమావేశంలో పార్లమెంటులో తాను లేవనెత్తాలనుకుంటున్న అంశాలను రాహుల్.. స్పీకర్‌కు తెలిపినట్లు సమాచారం. సభలో తనను మాట్లాడేందుకు అనుమతిస్తే చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారని తెలిసింది. ఈ విషయంపై అధికార పక్షంతో మాట్లాడిన తర్వాత మళ్లీ ప్రతిపక్ష నాయకులను కలుస్తానని స్పీకర్ చెప్పినట్లు సమాచారం. కాగా, వాణిజ్య మంత్రి గోయెల్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ తెలిపారు. పార్లమెంటు సమావేశాలు కొనసాగుతుండగా.. గోయల్ భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వివరాలను సభలో కాకుండా ఓ మీడియా ఇంటర్వ్యూలో వెల్లడించారని శివ పేర్కొన్నారు. ఇది సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు.

సామాజిక మాధ్యమాల్లో నరవాణే పుస్తకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం.నరవాణే రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం సామాజిక మాధ్యమాల్లో దర్శనమివ్వడంతో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పుస్తకం ప్రచురణకు సంబంధిత అధికారుల నుంచి ఇంకా అనుమతులు రాలేదని ఆ కారణంగా కేసు పెట్టినట్టు సోమవారం అధికారులు తెలిపారు.



పీఎం కేర్స్‌పై ప్రశ్నలొద్దు

లోక్‌సభ సచివాలయానికి పీఎంవో సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పీఎం కేర్స్ ఫండ్, జాతీయ రక్షణనిధి (ఎన్‌డీఎఫ్), ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి(పీఎంఎన్ఆర్ఎఫ్)లకు సంబంధించి పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు.. ఆయా అంశాలను ప్రస్తావించేందుకు లోక్‌సభ నిబంధనల ప్రకారం అనుమతి లేదని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) లోక్‌సభ సచివాలయానికి స్పష్టం చేసింది. భారత సంచిత నిధి నుంచి వీటికి కేటాయింపుల్లేవని.. అవి పూర్తిగా ప్రజల స్వచ్ఛంద విరాళాలతో ఏర్పాటయ్యాయని.. పబ్లిక్ చారిటీ ట్రస్టుగా రిజిస్టరయ్యాయని.. వాటి డీడ్‌లు సైతం రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదయ్యాయని తెలిపింది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం.. భారత ప్రభుత్వంతో సంబంధం లేని అంశాలపై సభలో ప్రశ్నలను అనుమతించే అవకాశం లేదంటూ గత నెల 30న లోక్‌సభ సచివాలయానికి పీఎంవో సమాచారమిచ్చినట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక తాజాగా తెలియజేసింది. కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో 2020 మార్చి 27న ప్రధానమంత్రి సిటిజెన్ అసిస్టెన్స్-రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిచ్యుయేషన్ ఫండ్ (పీఎం కేర్స్ ఫండ్) ఏర్పాటైంది. కొవిడ్-19లాంటి అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమైతే బాధితులకు సాయం చేయడానికి వీలుగా ఏర్పాటుచేశారు. 2023 మార్చి వరకు ఈ ఫండ్‌కు చేరిన విరాళాలు రూ.6,283.7 కోట్లు అని అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించారు.

మాపై ఇంత తీవ్ర ఆరోపణా!

▸ ప్రధాని మోదీపై మహిళా ఎంపీలు దాడి చేస్తారన్న స్పీకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: తమ నుంచి ప్రధాని మోదీ భద్రతకు ముప్పు పొంచి ఉన్నట్లు నిర్దిష్ట సమాచారం అందిందని.. అందుకే గత గురువారం లోక్‌సభకు రావద్దని ఆయనకు తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా చేసిన ప్రకటనపై కాంగ్రెస్ మహిళా ఎంపీలు మండిపడ్డారు. తమపై ఇంత తీవ్ర ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభకు రాని ప్రధానిని సమర్థించే క్రమంలో ఆయన అధికార పార్టీ ఒత్తిళ్లకు లోనయ్యారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయనకు లేఖ రాశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని జవాబు ఇవ్వకుండానే గత గురువారం లోక్‌సభ అసాధారణ రీతిలో తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. బుధవారం(4న) సాయంత్రమే ఆయన ప్రసంగించాల్సి ఉండగా.. గందరగోళం కొనసాగడం.. ప్రతిపక్షానికి చెందిన కొందరు మహిళా ఎంపీలు మోదీ రాకముందే ఆయన సీటు వద్ద మోహరించారు. ప్యానెల్ స్పీకర్, మంత్రులు, బీజేపీ ఎంపీలు ఎన్ని సార్లు విజ్ఞప్తిచేసినా వారు వెనక్కి రాలేదు. దాంతో ప్రధాని ప్రసంగం గురువారాని(5వ తేదీ)కి వాయిదాపడింది. కానీ విపక్షాలు, అధికార పార్టీ సభ్యుల పరస్పర నినాదాలతో ఆయన ప్రసంగం లేకుండానే ధన్యవాద తీర్మానాన్ని మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటిస్తూ.. మహిళా విపక్ష ఎంపీలపై పై వ్యాఖ్యలు చేశారు. దీనిపై వారు సోమవారం వారు లేఖ రాశారు. దానిపై సంతకం చేసిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. 'ప్రధానిపై చెయ్యెత్తడం గానీ, మరేదైనా గానీ చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదు. 11 మంది మహిళా ఎంపీలున్నారు. స్పీకర్ ఇలాంటి ప్రకటన చేసి ఉండాల్సింది కాదు. ఆ రోజున సభకు వచ్చే ధైర్యం మోదీకి లేదు. అందుకే ఆయన తరఫున స్పీకర్‌తో అలా వివరణ ఇప్పించారు. ఇది తప్పు' అని అన్నారు.



సభాపతి ఆందోళన సమంజసమే

తమ మహిళా ఎంపీల నుంచి ప్రధానికి ఎలాంటి ముప్పూ లేదన్న ప్రతిపక్షాల వాదనను లోక్‌సభ వర్గాలు తోసిపుచ్చాయి. ఆ మహిళా ఎంపీలు మోదీ కుర్చీ వద్దకు దుందుడుకుగా దూసుకొచ్చారని.. ఆయన భద్రతకు సంబంధించి స్పీకర్ ఓం బిర్లా ఆందోళన చెందడం సమంజసమేనని స్పష్టంచేశాయి. అవాంఛనీయ ఘటనలేమీ జరగకుండా.. సభ గౌరవాన్ని, పవిత్రతను కాపాడేందుకు.. కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూసేందుకే ప్రధానిని సభకు రావొద్దని ఆయన సలహా ఇచ్చారని తెలిపాయి.

వాహనాల కొనుగోలుకు పాన్ తప్పనిసరి!

రూ.5 లక్షల కంటే ఖరీదైన వాటికి వర్తింపు

▸ ఐటీ నిబంధనల్లో మార్పులతో ముసాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఇకపై రూ.5 లక్షల కన్నా ఖరీదైన వాహనాలను కొన్నప్పుడు పాన్‌ను వెల్లడించాల్సి ఉంటుంది. అది బైకు, స్కూటరు వంటి ద్విచక్ర వాహనమైనా వర్తిస్తుంది. ప్రస్తుతం ఎంత ఖరీదు బైకు కొనుగోలు చేసినా పాన్‌ను వెల్లడించాల్సిన అవసరం లేదు. కార్లు వంటి ఇతర వాహనాలకు మాత్రం ధరతో సంబంధం లేకుండా పాన్ తప్పనిసరి. ఆదాయం పన్ను కొత్త నిబంధనలతో ఈ పరిస్థితి మారనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 'ఆదాయం పన్ను నిబంధనలు, 1962'లలో సవరణలు చేస్తూ కేంద్రం ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'ఆదాయం పన్ను చట్టం, 2025' తీసుకురానుంది. దీనిపై తుది కసరత్తులో భాగంగా ఆదాయం పన్ను ముసాయిదా నిబంధనల్లో పలు సవరణలు జరిపారు. వీటిని మార్చి తొలి వారంలో నోటిఫై చేసే అవకాశం ఉంది. దీంతో, పాన్ వెల్లడించాల్సిన లావాదేవీల పరిమితి గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం బ్యాంకు ఖాతాలో ఒకసారి రూ.50 వేలకన్నా ఎక్కువ మొత్తం జమ చేస్తే.. జమ చేసే వ్యక్తి తన పాన్‌ను తెలియజేయటం తప్పనిసరి. ఇక మీదట ఒక వ్యక్తి ఖాతా లేదా పలు ఖాతాల నుంచి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు, అంతకుమించి జమ చేసినప్పుడు లేదా విత్‌డ్రా చేసుకున్నప్పుడు మాత్రమే పాన్‌ను తెలియజేయాల్సి ఉంటుంది. అలాగే ప్రస్తుతం హోటళ్లు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ సెంటర్లలో ఏదైనా కార్యక్రమం నిర్వహించినప్పుడు.. బిల్లు రూ.50 వేలు, అంతకంటే ఎక్కువ ఉంటే పాన్ తప్పనిసరి. ఇకపై బిల్లు రూ.లక్ష దాటితేనే పాన్ తెలియజేయాల్సి ఉంటుంది. స్థిరాస్తి కొనుగోలు, అమ్మకం, బదిలీల్లో ప్రస్తుతం ఉన్న రూ.10 లక్షల పరిమితి ఇక మీదట రూ.20లక్షలకు పెరగనుంది. ముసాయిదా నిబంధనల ప్రకారం..హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్‌లను కూడా ఇకపై క్యాటగిరీ 1 మెట్రోపాలిటిన్ నగరాలుగా పరిగణిస్తారు. తద్వారా ఈ నగరాల్లో నివసించే ఉద్యోగులు హెచ్ఆర్ఏ అలవెన్సు పెరుగుతుంది.

పీఎఫ్ సొమ్ము విత్‌డ్రాకు ప్రత్యేకంగా యాప్

▸ ఏప్రిల్‌లో ఆవిష్కరణకు సన్నాహాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భవిష్య నిధి (పీఎఫ్) సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు ఈపీఎఫ్ఓ సంస్థ ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందిస్తోంది. దీని సాయంతో ఉద్యోగులు యూపీఐ విధానం ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలోకి సొమ్ము జమ చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ఈ నూతన యాప్‌ను ఏప్రిల్ నెలలో ఘనంగా ఆవిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే యూఏఎన్, ఉమాంగ్ యాప్‌ల ద్వారా పీఎఫ్ ఖాతా వివరాలను తెలుసుకునే అవకాశం ఉండగా వాటికి అదనంగా ఈ ప్రత్యేక యాప్ కూడా ఉండనుంది. యాప్ ద్వారా దరఖాస్తు చేస్తే కేవలం మూడు రోజుల్లోనే సొమ్ము బ్యాంకు ఖాతాలో జమయ్యే అవకాశం ఉంది. అయితే గరిష్ఠంగా రూ.5 లక్షలు వరకు మాత్రమే తీసుకునే అవకాశం ఉంది.

3.25 లక్షల కోట్లతో రఫేల్ మెగా డీల్!



▸ ఫ్రాన్స్‌తో ఒప్పందానికి భారత్ సిద్ధం

▸ మెక్రాన్ పర్యటనలో సంతకాలకు ఛాన్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రఫేల్ యుద్ధ విమానాల కోసం రూ.3.25 లక్షల కోట్లు ఖర్చు చేయడానికి మనదేశం సిద్ధమవుతోంది. 114 ఎఫ్4 యుద్ధ విమానాల కొనుగోలుకు భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. దీనికి డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఆమోదం తెలపనుంది. ఈ ఒప్పందం పూర్తయితే యుద్ధ విమానాల కోసం మన దేశం చేసుకున్న అతి పెద్ద డీల్ ఇదే అవుతుంది. ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్న సందర్భంగా ఈ ఒప్పందంపై సంతకాలు జరగడానికి అవకాశం ఉంది. 114 రఫేల్ విమానాల్లో 88 సింగిల్ సీట్ ఫైటర్లు, 26 ట్విన్ సీట్ శిక్షణ విమానాలు ఉంటాయి. ఈ విమానాలన్నీ పూర్తిగా ఎయిర్‌ఫోర్స్ కోసం మాత్రమే ఉద్దేశించినవి. 2016లో మోడీ-హోలెండే మధ్య 36 రఫేల్ యుద్ధ విమానాల కోసం ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఇప్పుడు 114తో కలిసి మొత్తం మన ఎయిర్‌ఫోర్స్ వద్ద 150 ఎయిర్‌క్రాఫ్టులు ఉంటాయి. ఇక నేవీకి సంబంధించి గతేడాది ఏప్రిల్‌లో రూ.63 వేల కోట్లతో ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ల కోసం 26 రఫేల్-ఎం జెట్ (22 సింగిల్ సీట్, 4 ట్రైనర్లు) సరఫరా చేయాల్సి ఉంటుంది. 2031 నుంచి వీటి రాక ప్రారంభవుతుంది. ఈ రెండు ఒప్పందాలతో భారత్ 176 రఫేల్ ఫైటర్లను కొనుగోలు చేసినట్లవుతుంది. కొత్త డీల్‌లో భాగంగా 18 విమానాలు ఫ్రాన్స్‌లో తయారవుతాయి. మిగతా 96 దేశీయంగా తయారు చేస్తారు. వీటి సరఫరా 2030 నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఒప్పందంలో దేశీయంగా ఉత్పత్తి చేయడమే కీలకం. విమానాల తుది అసెంబ్లింగ్ నాగ్‌పూర్‌లోని దసో రిలయన్స్ ఏరోస్పేస్ లిమిటెడ్ (డీఆర్ఏఎల్)లో, ముఖ్యమైన భాగాలు, ఫ్యూస్‌లేజ్ సెక్షన్, రెక్కలు హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌లో తయారుకానున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లోని జేవార్‌లో ప్రత్యేకంగా ఎంఆర్‌వోను దసో ఏవియేషన్ స్థాపిస్తుంది. ఎం-88 ఇంజిన్ల ఉత్పత్తి, సహాయక ప్లాంట్‌ను హైదరాబాద్‌లో సఫ్రాన్ ఏర్పాటు చేస్తుంది. ఇవన్నీ వాస్తవ దేశీయ విలువను పెంచుతాయని అధికారులు తెలిపారు. ఇక దేశీయ ఆయుధాలను కూడా రఫేల్ యుద్ధ విమానాలను అనుసంధానం చేస్తారు.

3,200 కోట్ల స్కాల్ప్ క్షిపణి డీల్‌పై దృష్టి

ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన స్కాల్ప్ క్షిపణుల డీల్‌పై భారత్, ఫ్రాన్స్ దృష్టి పెట్టాయి. రూ. 3,200 కోట్లతో గణనీయమైన సంఖ్యలో ఈ దీర్ఘశ్రేణి క్రూయిజ్ క్షిపణులను ఫ్రాన్స్ నుంచి కొనడానికి భారత్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) చేస్తున్న చర్చలు తుది దశకు వచ్చాయి. వీటి కొనుగోలు ప్రతిపాదనకు త్వరలో డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఆమోదం తెలపనుంది. ఇదిలా ఉండగా, ప్రపంచంలోనే అత్యంత అధునాతన ఏరోస్పేస్ పరిశ్రమను స్థాపిద్దామని భారత ప్రభుత్వానికి స్వీడన్ సంస్థ ఎస్ఏఏబీ (సాబ్) ప్రతిపాదించింది. బహుళ అంచెల రూపకల్పన, ఉత్పత్తి, నిర్వహణతో పాటు గ్రిపెన్-ఇ యుద్ధ విమానాల ప్రవేశాన్ని కూడా కలిగి ఉండేలా దానిని తీర్చిదిద్దాలని పేర్కొంది. ఈ మేరకు గ్రిపెన్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, ఏరోనాటిక్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ మైకేల్ ఫ్రాంజెన్ చెప్పారు. సింగపూర్‌లో జరిగిన ఎయిర్‌షోలో పాల్గొన్న సందర్భంగా ఆయన పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడారు.

యూరప్‌లో 'ఎప్‌స్టీన్' ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)



బ్రిటన్ ప్రధాని స్టార్మర్

ప్రస్తుతం బ్రిటన్ ప్రధాని తన పదవిని కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు స్టార్మర్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఉన్న మోర్గాన్ మెక్స్వీనే ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. మాండెల్సన్‌ను నియమించాలన్న సలహా ప్రధానికి తానే ఇచ్చానని, దానికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో స్టార్మర్ సోమవారం అధికార లేబర్ పార్టీ చట్టసభ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. తన పదవికి రాజీనామా చేయాలన్న ఆలోచనే లేదని స్పష్టం చేశారు. మాండెల్సన్ నియామకంపై విచారం వ్యక్తం చేశారు. రాజీనామా చేసిన మోర్గాన్ మెక్స్వీనేకు వీడ్కోలు తెలిపారు. ఎనిమిదేళ్లుగా ఆయన తనకు అత్యంత సన్నిహితుడు, స్నేహితుడని పేర్కొన్నారు. ఇక ఎప్‌స్టీన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన బ్రిటన్ రాజకుటుంబ సభ్యుడు ప్రిన్స్ ఆండ్రూపై ఆ దేశ పోలీసులు అధికారిక రహస్యాల చట్టం కింద విచారణ ప్రారంభించారు. 2001 నుంచి 2011 దాకా బ్రిటన్ ప్రత్యేక వాణిజ్య ప్రతినిధిగా ఉన్న సమయంలో ఆయన ప్రభుత్వ రహస్య నిర్ణయాలు, తన అధికారిక పర్యటనలకు సంబంధించిన అతి రహస్య నివేదికలు, పెట్టుబడుల అవకాశాల గురించి ఎప్‌స్టీన్‌కు పంపినట్లు ఈమెయిల్స్ ద్వారా వెల్లడైంది. మరోవైపు నార్వేకు చెందిన రాయబారి మోనా జూల్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నట్లు తేలడంతో జోర్డాన్‌లో నార్వే రాయబారిగా ఉన్న ఆమెను ఇటీవల సస్పెండ్ చేశారు. ఆదివారం ఆమె తన పదవికి రాజీనామా చేసినట్లు నార్వే విదేశాంగ శాఖ తెలిపింది. స్లొవేకియా విదేశాంగ శాఖ మాజీ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు మిరోస్లావ్ లజక్, స్వీడన్‌కు చెందిన సీనియర్ దౌత్యవేత్త జోనా రుబిన్‌స్టీన్‌లు కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. ఎప్‌స్టీన్‌తో వీరికి ఉన్న సంబంధాలపై విచారణ ప్రారంభించారు.

దేశంలో క్యాన్సర్ కేర్ సెంటర్లలో పనిచేసేవి 34 శాతం మాత్రమే!

▸ వాటిలోనూ అత్యధికం తెలంగాణ, బిహార్, కర్ణాటకల్లోనే..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 : జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటుకు ఆమోదించిన డే కేర్ క్యాన్సర్ సెంటర్ల(డీసీసీసీ)లో దేశ వ్యాప్తంగా 34 శాతం మాత్రమే పనిచేస్తున్నాయి. వాటిలోనూ మిగతా రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, బిహార్, కర్ణాటకల్లోనే అధిక శాతం పనిచేస్తుండడం గమనార్హం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏర్పాటుకు ఆమోదించిన 297 డీసీసీసీల్లో 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 డీసీసీసీలు పనిచేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ పార్లమెంటులో తెలియజేసింది. వీటిలో కర్ణాటకలో 16, రాజస్థాన్‌లో 8, తెలంగాణలో 27, త్రిపురలో 3 చొప్పున వంద శాతం పనిచేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. బిహార్, హిమాచల్‌ప్రదేశ్‌లకు కేటాయించిన వాటిలో 50 శాతానికి పైగా పనిచేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు క్యాన్సర్ కేసులు అధికంగా ఉన్న మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో ఒక్క కేంద్రం కూడా పనిచేయడం లేదు. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏర్పాటుకు ఆమోదించిన వాటిలో ఒక్క కేంద్రం కూడా పనిచేయడం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ తెలియజేసింది.



తలపాగా నేస్తున్న దృశ్యం

శ్రీశైలం మల్లన్నకు 365 మూరల తలపాగా

సంతకవిటి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం మల్లన్న కోసం విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన చేనేత కార్మికులు 365 మూరల తలపాగాను రూపొందిస్తున్నారు. చేనేత కార్మికుడు ముతిక వీర్రాజు ఆధ్వర్యంలో కార్మికులంతా నియమ నిష్ఠలతో, సొంత వ్యయంతో ఈ తలపాగాను తయారు చేస్తున్నారు. 21 అంగుళాల వెడల్పుతో ఉన్న ఈ తలపాగా నేతను గత ఏడాది డిసెంబరు 31న ముక్కోటి ఏకాదశి పర్వదినాన ప్రారంభించారు. పూర్తయిన తర్వాత మల్లన్న దీక్షలో ఉన్న కొంతమంది చేనేత కార్మికులు ఈ నెల 12వ తేదీన ప్రత్యేక వాహనంలో శ్రీశైలం తీసుకుని వెళ్లి, మహాశివరాత్రి పర్వదినాన ఆలయ అధికారులకు అధికారికంగా అందజేయనున్నారు.



భృంగి వాహనంపై మల్లన్న విహారం

శ్రీశైలం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉదయం ఉభయ దేవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు ఉదయం నుంచి ప్రత్యేక పూజాక్రతువులు జరిపారు. అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులను ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలు, కోలాటాలు, డప్పు విన్యాసాల మధ్య భృంగివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజైన మంగళవారం స్వామి అమ్మవార్లు హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

నేటి నుంచి శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తి క్షేత్రంలో మంగళవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. 10న భక్త కన్నప్ప ధ్వజారోహణం, అంకురార్పణ, 11న శ్రీకాళహస్తీశ్వరస్వామి ధ్వజారోహణం, వెండి అంబారీ వాహన సేవ నిర్వహించనున్నారు. రోజూ ఉదయం, రాత్రి పలు వాహన సేవలు జరగనున్నాయి. 20న తీర్థవారి ధ్వజావరోహణం, 21న పల్లకీ సేవ, 22న ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.

జూన్ తర్వాత ఎల్‌నినో?

›› నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం!

›› స్కైమెట్ తాజా అంచనా.. వచ్చే నెలలో మరింత స్పష్టత!

విశాఖపట్నం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): భారత ఉపఖండంలో జూన్ తర్వాత ఎల్‌నినో పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ పేర్కొంది. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల ప్రకారం ఎల్‌నినో ఏర్పడేందుకు 50 శాతం అవకాశాలు ఉన్నాయని తాజా బులెటిన్‌లో వెల్లడించింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నాటికి ఎల్‌నినో ఏర్పడే అవకాశం 70 శాతానికి చేరుకుంటుందని తెలిపింది. ఈ నెలలో మాత్రం లానినా కొనసాగుతుందని వివరించింది. గత దశాబ్దకాలంలో ఒకటి కంటే ఎక్కువ సందర్భాల్లో భారతదేశంలో కీలకమైన నైరుతి రుతుపవనాలకు ఎల్‌నినోలు అంతరాయం కలిగించాయని స్కైమెట్ పేర్కొంది. కాగా, స్కైమెట్ అంచనాకు అనుగుణంగానే పలు వాతావరణ మోడళ్లు కూడా నైరుతి రుతుపవనాల ప్రవేశం తర్వాత ఎల్‌నినో పరిస్థితులు ఉంటాయని విశ్లేషిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న లానినా పరిస్థితులు బలహీనపడి తటస్థ వైపు వెళ్లేందుకు అనువైన వాతావరణం వేగంగా పెరుగుతోంది. పసిఫిక్ సముద్రం ప్రస్తుతం చల్లగా ఉన్నప్పటికీ వేగంగా మార్పులు సంభవిస్తున్నందున మార్చి, ఏప్రిల్ కల్లా తటస్థ పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఆ తర్వాత నైరుతి రుతుపవనాల ప్రవేశించే వరకు తటస్థ పరిస్థితులు కొనసాగి, ఆ తర్వాత ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడనున్నాయని పలువురు వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల ప్రారంభంలో మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.

దక్షిణ కోస్తాకు పొగమంచు హెచ్చరిక

ఉత్తరకోస్తాతోపాటు దక్షిణ కోస్తాలోని పలు ప్రాంతాల్లో సోమవారం పొగమంచు కురిసింది. ఇంకా పలు ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. పగటిపూట ఎండ ప్రభావం నెలకొంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా, పగటి ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. మంగళవారం దక్షిణ కోస్తా, దానికి ఆనుకుని రాయలసీమ, ఉత్తర కోస్తాలో మంచు ప్రభావం నెలకొంటుందని వాతావరణ శాఖ తెలిపింది. రాత్రిపూట చలి ప్రభావం ఉంటుందని, పగలు ఎండ స్వల్పంగా పెరుగుతుందని పేర్కొంది.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో కోటయ్య దర్శనం టికెట్లు

›› శివరాత్రికి వీఐపీ దర్శనం టికెట్ ధర రూ.300

నరసరావుపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్లకు స్వామి దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. టికెట్ల విక్రయాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఈవో డి.చంద్రశేఖరరావు సోమవారం తెలిపారు. గతంలో తిరునాళ్ల రోజున వీఐపీ ఉచిత దర్శనం పాసులు వేల సంఖ్యలో జారీ చేసేవారు. అయితే సామాన్య భక్తులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈసారి తిరునాళ్లకు వీఐపీ ఉచిత దర్శనం పాసులు రద్దు చేసినట్టు ఈవో చెప్పారు. వీటి స్థానంలో రూ.300 వీఐపీ దర్శనం టికెట్లు విక్రయిస్తున్నామని, టైం స్లాట్ ప్రకారం దర్శన సమయం కేటాయిస్తామని తెలిపారు. ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీలో వెబ్‌సైట్‌లో దర్శనం టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అలాగే అభిషేకం టికెట్ రూ.500, శీఘ్ర దర్శనం టిక్కెట్ రూ.200, ప్రత్యేక దర్శనం టికెట్ రూ.100 కూడా ఆన్‌లైన్‌లో విక్రయిస్తామని.. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమెరికా నేషనల్ స్పేస్ సొసైటీ కాంపిటీషన్‌లో ప్రపంచ చాంపియన్‌గా శ్రీ చైతన్య స్కూల్

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అమెరికా నాసాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ నిర్వహించిన 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్-2026' డిజైన్ కాంపిటీషన్‌లో శ్రీ చైతన్య స్కూల్ ప్రపంచ చాంపియన్‌గా నిలిచిందని ఆ సంస్థ అకాడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన్న తెలిపారు. ఈ పోటీ ఫలితాలను ఎన్ఎస్ఎస్ ప్రకటించగా, మొత్తం 85 బహుమతుల్లో 7 ప్రపంచ బహుమతులు సహా 34 ప్రైజులను శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులే కైవసం చేసుకున్నట్టు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల జరిగిన నాసా ఎన్ఎస్ఎస్ 'రోడ్ మ్యాప్ టూ స్పేస్-కాంటెస్ట్'లో కూడా ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 10 విన్నింగ్ ప్రాజెక్టులలో 8 తమ సంస్థ విద్యార్థులే దక్కించుకుని క్లీన్ స్వీప్ చేసారని ఆమె తెలిపారు. గత 14 ఏళ్లుగా ఈ పోటీల్లో ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ చైతన్య అని పేర్కొన్నారు. పాతకాలపు బట్టీ పట్టే పద్ధతిని పక్కనపెట్టి, శ్రీచైతన్య అనుసరిస్తున్న కాన్సెప్చువల్ టీచింగ్ మెథడాలజీ, యాక్టివిటీ, ప్రాక్టికల్ ఆధారిత బోధనే ఈ విజయానికి ప్రధాన కారణమని సీమ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాన్ని ఆమె అభినందించారు.

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలిగా దుర్గ

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా పి.దుర్గ ఎన్నికయ్యారు. అమరావతి సచివాలయంలో సోమవారం జరిగిన ఎన్నికలో వైస్ ప్రెసిడెంట్, అడిషనల్ సెక్రటరీ జనరల్, ట్రెజరర్ పదవులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన నాలుగు పదవులకు ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష స్థానానికి ముగ్గురు పోటీపడగా దుర్గ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా సత్యవతి విజయం సాధించారు. ఉపాధ్యక్షురాలిగా సునీత (ఏకగ్రీవం), అదనపు సెక్రటరీగా (జనరల్) జె.సాయిలీల(ఏకగ్రీవం), అడిషనల్ సెక్రటరీ జనరల్ (కల్చర్)గా సత్యవేణి, జాయింట్ సెక్రటరీగా కవిత, ట్రెజరర్‌గా సౌజన్య(ఏకగ్రీవం) గెలుపొందారు.

శివదీక్షాధారుల ఆందోళన



గేట్లను ధ్వంసం చేస్తూ..





గేట్లు దూకి వెళ్తున్న దీక్షాధారులు

శ్రీశైలంలో రద్దీ.. గందరగోళం

›› జ్యోతిర్ముడి స్వాములకు ఉచిత స్పర్శ దర్శనం

›› దర్శనం అనంతరం ఇరుముడి సమర్పణ

›› కొందరు మళ్లీమళ్లీ స్పర్శ దర్శనానికి ప్రయత్నించడంతో తోపులాట

›› సహనం కోల్పోయిన శివదీక్షాధారులు

›› బారికేడ్లు తోసేసి, తాళాలు పగులగొట్టి విధ్వంసం

›› క్యూలైన్లు, కంచెలు ధ్వంసం

›› రాత్రి 10 గంటల సమయానికీ కొనసాగుతున్న ఆందోళన

శ్రీశైలం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఊహించని విధంగా శ్రీశైలంలో శివస్వాముల రద్దీ పెరిగింది. మండల దీక్ష పూర్తిచేసుకుని పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్న జ్యోతిర్ముడి శివస్వాములకు మల్లన్న స్పర్శ దర్శనం ఉచితంగా కల్పించాలని దేవస్థానం నిర్ణయించింది. అయితే రద్దీ కారణంగా స్వామివారి దర్శనం ఆలస్యం కావడంతో శివదీక్షాపరులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగారు. సోమవారం శ్రీశైలానికి వేలాదిగా శివదీక్షాపరులు తరలివచ్చారు. జ్యోతిర్ముడి స్వాములకు సోమవారం తెల్లవారుజాము నుంచి రెండు గంటలకోసారి స్పర్శ దర్శనం కల్పించారు. శివస్వాములకు నాలుగు రోజులు మాత్రమే స్పర్శదర్శనం అవకాశం కల్పించడంతో శ్రీశైలానికి పోటెత్తారు. పాదయాత్రగా వచ్చి నేరుగా మొదటిసారి గర్భాలయ దర్శనం చేసుకున్న తరువాత జ్యోతిర్ముడిని సమర్పించాల్సి ఉంటుంది. అయితే కొంత మంది రెండోసారి కూడా స్పర్శ దర్శనం కోసం కంపార్టుమెంట్లు, క్యూలైన్లలో చొరబడటంతో సమస్య తలెత్తింది. ఈ క్రమంలో ఉదయం 11 గంటల సమయం నుంచి చంద్రావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, కంచెలను శివభక్తులు పూర్తిగా ధ్వంసం చేసి గుంపులుగా ఆలయంలోకి ప్రవేశించి ధ్వజస్తంభానికి ఇరువైపులా క్యూలైన్లలో నిండిపోయారు. దీంతో రద్దీ విపరీతంగా పెరిగిపోగా, సహనం కోల్పోయిన కొందరు శివదీక్షాపరులు నినాదాలు చేస్తూ, గేట్లకు వేసిన తాళాలు పగులకొడుతూ అడ్డుకునేందుకు వచ్చిన ఆలయ అధికారులు, సిబ్బందితోపాటు సేవ చేస్తున్న శివసేవకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు, శివసేవకులు మైక్ ద్వారా చేస్తున్న సూచనలను లెక్క చేయలేదు. స్వామివారిని దర్శించుకునేందుకు బారికేడ్లు తోసుకుంటూ, ఆలయంలో ఏర్పాటు చేసిన గ్రిల్స్‌ను ధ్వంసం చేశారు. మరికొందరు భక్తులు వెంట తెచ్చుకున్న రాళ్లతో గేట్లకు వేసిన తాళాలను ధ్వంసం చేశారు. దీంతో అప్రమత్తమైన జిల్లా కలెక్టర్ రాజకుమారి పోలీసు భద్రతను పెంచారు. ఆలయ పరిసరాల్లోని క్యూలైన్లను పూర్తిగా ధ్వంసం చేసి, అధికారులపై తిరగబడుతున్న వారిని అదుపు చేసేందుకు నంద్యాల ఏఎస్పీ యుగంధర్‌బాబు కొందరు శివస్వాములపై లాఠీ ఎత్తి చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. కొందరు శివస్వాములు అసభ్యపదజాలంతో దూషిస్తూ ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడటం బాధాకరమన్నారు. కాగా.. రాత్రి 10 గంటలైనా శివదీక్షాధారులు ఆందోళన విరమించలేదు. ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, పాలకమండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు భక్తులకు సర్ది చెబుతున్నా పరిస్థితి అదుపులోకి రావడం లేదు. తమపై కుట్రపూరితమైన చర్యలకు పాల్పడుతూ కావాలనే కొందరు శివస్వాములు గొడవలు సృష్టిస్తూ ఆలయ ప్రతిష్ఠతకు భంగం కలిగిస్తున్నారని ఈఓ ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులకు మౌలిక వసతులను కల్పిస్తున్నప్పటికీ వాటిని సద్వినియోగపరుచుకోకుండా ఇలా ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. మరోవైపు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు 10 వేల మందికి పైగా జ్యోతిర్ముడి శివస్వాములు స్పర్శ దర్శనం చేసుకోగా, సామాన్య భక్తులు 30 వేల మందికి పైగా అలంకార దర్శనాలు చేసుకున్నారు. ప్రస్తుతం క్షేత్రంలో లక్ష మంది భక్తులు ఉన్నట్టు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

స్పర్శ దర్శనానికి సహకరించండి: ఈఓ, చైర్మన్

జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు మాత్రమే స్పర్శ దర్శనం కల్పిస్తూ ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, తమకు సహకరించాలని ఈఓ శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు శివభక్తులకు విజ్ఞప్తి చేశారు. శివస్వాములు అలజడులు సృష్టిస్తూ తోటి భక్తులకు అసౌకర్యంగా వ్యవహరించడం సరికాదని సూచించారు. 20 కంపార్టుమెంట్లతోపాటు చంద్రావతి కల్యాణ మండపంలో వేచి ఉండే భక్తులకు అవసరమైన మంచినీరు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు, అల్పాహారాలు నిరంతరాయంగా అందిస్తున్నామని తెలిపారు.

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

›› న్యాయవాదులకు శిక్షణలో జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్



న్యాయవాదుల శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సత్వర న్యాయం అందించడంలో మధ్యవర్తిత్వానిది కీలకపాత్ర అని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కక్షిదారులకు శాశ్వత, సంతృప్తికరమైన ఉపశమనం లభిస్తుందన్నారు. సోమవారం హైకోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వం పై న్యాయవాదులకు 40 గంటల శిక్షణను జస్టిస్ రాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థతో పాటు అధికారులపై ఉందన్నారు. వ్యవసాయ, వ్యాపార, వివాహ సంబంధ వివాదాల్లో మధ్యవర్తిత్వాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులను కోరారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి మాట్లాడుతూ.. న్యాయవాదులు, మధ్యవర్తుల కృషి కారణంగా మధ్యవర్తిత్వ జాతీయ క్యాంపెయిన్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించగలిగామని, భవిష్యత్తులో నిర్వహించనున్న మధ్యవర్తిత్వ క్యాంపెయిన్ కూడా విజయవంతం చేయాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందన్ రావు మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వంపై నైపుణ్యం పెంచుకొనేందుకు న్యాయవాదులకు ఈ శిక్షణ కార్యక్రమం ఉత్తమ వేదికగా నిలుస్తుందన్నారు. శిక్షణకు హాజరైన న్యాయవాదులకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ టీసీడీ శేఖర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మీడియేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీకి చెందిన సీనియర్ ట్రైనర్లు ఎస్.అరుణాచలం, సందీప్ సక్సేనా, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి బీవీఎస్ హిమబిందు, ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి జి.మాలతి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఉపకార్యదర్శి హెచ్.అమరరంగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఒక్క విద్యార్థి.. నలుగురు లెక్చరర్లు!' పై నివేదిక కోరిన ఆర్జేడీ

›› అందజేసిన ప్రధానోపాధ్యాయురాలు

›› 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ముసునూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 'ఒక్క విద్యార్థి.. నలుగురు లెక్చరర్లు'.. శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఏలూరు జిల్లా ముసునూరు జూనియర్ కళాశాల నిర్వహణపై సమగ్ర నివేదిక అందజేయాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి.. ప్రధానోపాధ్యాయురాలు డి.శైలజను సోమవారం ఆదేశించడంతో ఆ మేరకు హెచ్ఎం పూర్తి వివరాలను నివేదికలో పొందుపర్చారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24 విద్యా సంవత్సరంలో ముసునూరు జడ్పీ హైస్కూలును అప్‌గ్రేడేషన్ చేసి ఎంపీసీ, బైపీసీ గ్రూపులతో బాలికల జూనియర్ కళాశాల (హైస్కూల్ ప్లస్)ను ప్రారంభించారు. మొదటి సంవత్సరం తొమ్మిది మంది విద్యార్థినులు చేరారు. బాలికలకు వసతి గృహం, రవాణా సౌకర్యం లేదని, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ లెక్చరర్లను వేరే హైస్కూల్ ప్లస్‌కు డిప్యూటేషన్ వేసిన కారణంగా విద్యార్థినులందరూ వేరే కళాశాలలో చేరినట్టు నివేదికలో పేర్కొన్నారు. మరుసటి విద్యా సంవత్సరంలో 12 మంది బాలికలు చేరగా, ఆంగ్ల మాధ్యమం కారణంగా వివిధ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారని, ఒకే ఒక విద్యార్థిని ఉత్తీర్ణత సాధించగా మిగిలిన 11 మంది కళాశాలకు రావడం మాని వేశారన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించే ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా బదిలీ అయ్యారని, ముగ్గురు బాలికలతో కళాశాల నడుపుతున్న క్రమంలో ఇద్దరు బాలికలు మానివేయగా ఫస్టియర్‌లో పాసయిన ఒకే ఒక్క విద్యార్థిని మాత్రమే మిగిలినట్టు తెలిపారు. ఈ విషయాన్ని నూజివీడు ఉప విద్యాశాఖ అధికారికి తెలిపామని, ప్రస్తుతం కళాశాలలో బైపీసీ రెండో సంవత్సరం ఒక విద్యార్థిని మాత్రమే ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. మొత్తం ఏడు లెక్చరర్ల పోస్టులకు గానూ నలుగురే ప్రస్తుతం విధుల్లో ఉన్నట్టు నివేదించారు. కాగా.. కళాశాలలో ఒక విద్యార్థిని మాత్రమే ఉన్న క్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరానికి బాలికల సంఖ్య పెంచి, కళాశాలను కొనసాగిస్తుందా? లేదా నలుగురు లెక్చరర్లను మరో కళాశాలకు బదిలీ చేసి, ఉన్న ఒక బాలికను మరో కళాశాలలో చేర్పించి, కళాశాలను మూసివేస్తుందా అనేది వేచి చూడాలి.

గొడవ చేయొద్దు అన్నందుకు.. హెడ్‌కానిస్టేబుల్ వేలు కొరికేసిన తాగుబోతు



తెగిన హెడ్‌కానిస్టేబుల్ చేతి వేలు

పుల్లంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గొడవ చేయొద్దు అన్నందుకు ఓ తాగుబోతు హెడ్‌కానిస్టేబుల్ చేతి వేలును కొరికేశాడు. తిరుపతి జిల్లా పుల్లంపేటలో నాగతిమ్మారెడ్డి ఇంటి వద్ద ఆయన మేనల్లుడు మల్లికార్జునరెడ్డి ఆదివారం రాత్రి తప్పతాగి ఆస్తి వాటాలు పంచాలని గొడవకు దిగాడు. దీంతో నాగతిమ్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటసుబ్బరాజు యాదవ్, కానిస్టేబుల్ ప్రసాద్ ఘటనా స్థలానికి వచ్చి మల్లికార్జునరెడ్డిని గొడవ చేయొద్దని వారించారు. అయితే మద్యం మత్తులో ఉన్న మల్లికార్జునరెడ్డి కోపంతో ఊగిపోతూ హెడ్‌కానిస్టేబుల్ ఎడమచేతి ఉంగరపు వేలును కొరికేశాడు. ఈ క్రమంలో మధ్య వేలుకి కూడా గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో హెడ్‌కానిస్టేబుల్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మల్లికార్జునరెడ్డిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమించలేదని యువతిపై కత్తితో దాడి

నూజివీడు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో యువతిపై కత్తితో దాడికి తెగబడ్డాడు ఓ యువకుడు. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన బండారు సురేశ్ పట్టణానికే చెందిన యువతిని ప్రేమించాడు. అయితే మనస్పర్థల కారణంగా ఈ ఇద్దరూ పెద్దల సమక్షంలో విడిపోయారు. కానీ.. ఇటీవల సురేశ్ మళ్లీ ప్రేమ పేరుతో ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఆదివారం రాత్రి నూజివీడులోని తిరువూరు బస్టాండ్ సమీపంలో ఆమెపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. స్థానికుల సమాచారంతో బాధితురాలిని 108లో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణ పోలీసులు సురేశ్‌పై కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మన రైతును కాపాడాల్సిందే!

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా తొలిసారి అమెరికాలో పర్యటిస్తున్నప్పుడు భారత్ శ్రేయోభిలాషి ఒకరు 'మీకు ఎన్ని సమస్యలు ఉన్నాయి' అని అడిగితే 40 కోట్లు అని ఆయన గంభీరంగా సమాధానమిచ్చారు. 'సమస్త స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలలో కెల్లా మనమెన్నదిగా ప్రశంస పొందుతున్న అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం అమలులోకి రానున్న తరుణంలో, ఈ సరికొత్త ఆర్థిక పరిణామం పట్ల ప్రస్తుత భారత జనాభా 150 కోట్ల మంది సంతోషిస్తున్న పరిస్థితి ఉన్నదా? లేదు. భారత ఆర్థిక వ్యవస్థకు ఇప్పటికీ వెన్నెముకగా ఉన్న వ్యవసాయరంగం శ్రేయస్సుకు అమెరికాతో వాణిజ్య ఒప్పందం తోడ్పడదని ఆర్థికులు సంశయిస్తున్నారు. ఈ భయాలను, భరోసాలను నిశితంగా, నిష్పాక్షికంగా తరచి చూడవలసిన అవసరమున్నది.

అమెరికా, యూరోప్‌తో జరిగే వాణిజ్య చర్చలకు అంతిమంగా వ్యవసాయమే కేంద్ర బిందువు అవుతుంది. రైతుల ప్రయోజనాలు కాపాడి తీరుతామని మన వాణిజ్య మంత్రులు హామీ ఇస్తారు, కొత్త కష్టాలు వాటిల్లడం ఖాయమని మన అన్నదాతలు ఆందోళన చెందుతారు; ఆహార భద్రత గురించి యావద్భారతీయులూ గోసపడతారు! నిజానికి మన సమస్య స్వేచ్ఛా వాణిజ్యం కాదు, అత్యధికులు తమ జీవనోపాధికి వ్యవసాయరంగం పైనే ఆధారపడి ఉండడమే. అవును, 70 కోట్ల మంది భారతీయులకు సేద్యమే జీవనాధారం. దేశ శ్రామిక శక్తిలో ఇంచుమించు సగం మందికి వ్యవసాయమే ఉపాధి కల్పిస్తోంది. అయినా దేశ స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే. మరి మనతో స్వేచ్ఛా వాణిజ్యానికి ఆరాటపడుతున్న సంపన్న దేశాలలో ఆహారోత్పత్తి పరిస్థితులు భిన్నమైనవి. అక్కడి పంట క్షేత్రాలు అధిక దిగుబడుల నిస్తాయి. పంట సిరులను సృష్టించే కృషీవలులు అమెరికా కార్మిక శక్తిలో 1.2 శాతం, యూరోప్‌లో 1.6 శాతం మాత్రమే. పూర్తిగా భిన్నమైనది మన పరిస్థితి. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకనే దేశ జనాభాలో సగం మంది అనివార్యంగా వ్యవసాయరంగంపై ఆధారపడుతున్నారు. ఈ కారణంగానే సంపన్న దేశాలు తమ వ్యవసాయ వాణిజ్య విధానాలలో యథాలాపంగా చేసే మార్పులు, చేర్పులు గ్రామీణ భారతంలో లక్షలాది కుటుంబాల జీవన పరిస్థితులను దుర్భరమయ్యేందుకు దారితీస్తున్నాయి. అత్యధికుల వ్యవసాయంపై ఆధారపడే అగత్యాన్ని తొలగించాలి. ఈ ఆవశ్యక పరివర్తనను సాధించకుండా సంపన్న దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల ప్రయోజనముండదు. సేవలు, తయారీ రంగాలను ఇతోధికంగా అభివృద్ధిపరచుకుని వ్యవసాయమే జీవనాధారమయ్యే పరిస్థితిని అంతే గణనీయంగా తగ్గించాలి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం అందుకు దోహదం చేసేదిగా ఉండాలి.


ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల మాటను హేతుయుక్తంగా సంశయించడం ఎంత అవసరమో, అహేతుకంగా వ్యతిరేకించడం అంతే అవాంఛనీయం. అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో ఈ పౌర ధర్మాలు ఎలా సువ్యక్తమవుతున్నాయి? 'ఈ ఒప్పందంతో 30 లక్షల కోట్ల డాలర్ల అమెరికా విపణి మన ఎగుమతిదారులకు అందుబాటులోకి వస్తుంది. రైతులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అపార ప్రయోజనాలు సమకూరుతాయి' అని వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 'ప్రభుత్వం చెప్పుతున్న మాటలో నిజం లేదని, వ్యవసాయ, పాడి ఉత్పత్తుల రంగాలు తీవ్ర నష్టాలతో కుదేలయిపోతాయి' అని ప్రధాన ప్రతిపక్షం విమర్శిస్తోంది. తమ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను అడ్డూ అదుపు లేకుండా అనుమతించాలని అమెరికా అధ్యక్షుడు గట్టిగా కోరుతున్నారు. ఏ దేశమూ తన రైతులకు ఇవ్వనంతగా భారీ సబ్సిడీలతో అమెరికా రైతాంగాన్ని ఆదుకుంటున్న వాషింగ్టన్ ప్రభువులు భారత ప్రభుత్వం తన వ్యవసాయదారులకు సమకూరుస్తున్న కనీస మద్దతు ధర, పంట ఉత్పత్తుల సేకరణ సదుపాయాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు! ఇదే జరిగితే పేద భారతీయ రైతులు తమ సంక్షేమాన్ని మరచిపోయి సమృద్ధ సబ్సిడీ సంపన్న అమెరికా రైతులను మళ్లీ గొప్పవాళ్లని చేయడమే అవుతుంది. మన అన్నదాతలు ఎందుకీ త్యాగం చేయాలి? మన ఆహార భద్రతను మనకు మనమే దెబ్బతీసుకుని మళ్లీ ఒకనాటి 'నౌక నుంచి నోటికి' తరహా దుర్దినాలకు ఎందుకు తిరోగమించాలి? పౌర సమాజ సంస్థలు ఈ విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. సబబే. అయితే రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆరాటపడుతున్నవారు ఒక వాస్తవాన్ని విస్మరించకూడదు. సేవలు, తయారీ రంగాన్ని సర్వ సమగ్రంగా అభివృద్ధిపరచుకోవల్సిన ఆవశ్యకత, అందుకు అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్యం చేయగల దోహదాన్ని ఉపేక్షించకూడదు. సమస్త ప్రజలకు తన శ్రమతో ఆహారాన్ని సమకూర్చే రైతు పొలంలో నాగలితో నిలవగలగాలి. అయితే పాత కాలపు జీవనాధారాలే ఎప్పటికీ మంచి బతుకులకు ఆలంబనగా ఉండేలా వాటిని సంక్షించడం ద్వారా కాకుండా, తదుపరి తరానికి అంతకంటే మెరుగైన కొత్త జీవనాధారాలు సృష్టించడం వల్లే జాతులు నాగరికతా ఔన్నత్య శిఖరాలను అధిరోహిస్తాయి అన్న ఒక విజ్ఞుడి మాటను, అందులోని నిర్దేశాన్ని మనం సదా గుర్తుంచుకోవాలి. ఔదలదాల్చాలి. ఇటువంటి వివేకమూ దాని ఔచిత్యమూ సగటు ఓటర్ల మాటా మంతీ, పిచ్చా పాటీలో భాగమయితే మన ప్రజాస్వామ్యానికీ జాతి ఆర్థికాభ్యుదయానికీ అంతకంటే కావల్సిందేముంది?

“ కొర్బా వంతెన చోరీ ఒక హెచ్చరిక. మన దేశ యువతలో అపారమైన శక్తి ఉంది. కానీ ఆ శక్తికి సరైన దారులు లేకపోతే, అది వరదలా మారి విధ్వంసానికి దారితీస్తుంది. దేశ జనాభాలో 60 శాతం యువత ఉండటమంటే ఒక బలమైన ఆయుధం లాంటిదే. దాన్ని దేశ నిర్మాణానికి వాడతామా, లేక విచ్ఛిన్నానికి వదిలేస్తామా అనేది మనం వారికి నేర్పే సంస్కారం, ఇచ్చే అవకాశాలు, మార్గదర్శకత్వంపై ఆధారపడి ఉంటుంది.

నేరాలపాలవుతున్న యువ నైపుణ్యం

ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొర్బా జిల్లాలో 70 అడుగుల పొడవు, 10 టన్నుల బరువు ఉన్న ఒక ఉక్కు వంతెన రాత్రికి రాత్రే మాయమైపోయిన వార్త సంచలనాన్ని సృష్టించింది. కొందరు వ్యక్తులు ఎంతో పకడ్బందీగా ఆ వంతెనను ముక్కలుగా కోసి, అక్కడి నుంచి తరలించుకుపోయారు. ఇది కేవలం దొంగతనం కాదు. ఇది మన సమాజంలోని ఒక పెద్ద లోపాన్ని బయట పెట్టిన సంఘటన.

పది టన్నుల బరువున్న ఒక ఉక్కు వంతెనను రాత్రికి రాత్రే విడదీయడం చిన్న విషయం కాదు. ఉక్కును కట్ చేయాలంటే సాధారణ పనిముట్లు చాలవు. పరిశ్రమల్లో వాడే గ్యాస్ కట్టర్లు, ఆక్సీ–ఎసిటిలీన్ టార్చ్‌లు అవసరం. వాటిని వాడాలంటే శిక్షణ, అనుభవం ఉండాలి. అంటే ఈ పనిలో పాల్గొన్నవారు సాధారణ వ్యక్తులు కారు. వారికి మంచి సాంకేతిక నైపుణ్యం ఉంది. ఆ భారీ ఉక్కును తరలించడానికి పెద్ద వాహనాలు, క్రేన్లు అవసరం. ఇవన్నీ ఎవరికీ అనుమానం రాకుండా, రాత్రి వేళల్లో సమన్వయంతో నిర్వహించారంటే, వారి ప్రణాళిక ఎంత పక్కాగా ఉందో అర్థమవుతోంది. ఇది ఆకస్మికంగా జరిగిన నేరం కాదు. పూర్తిగా ముందే ఆలోచించి, అమలు చేసిన నేరం.



ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఇంతటి నైపుణ్యం, అనుభవం ఉన్న వ్యక్తులు ఎందుకు ఈ నేర మార్గాన్ని ఎంచుకున్నారు? ఇదే తెలివితేటలను, శ్రమను ఒక నిర్మాణాత్మక పనికి ఉపయోగిస్తే వారి జీవితం ఎంత గొప్పగా ఉండేది? ఇక్కడ ప్రతిభ విధ్వంసానికి దారితీసింది. ఇది ఒక్క కొర్బా సంఘటనకు మాత్రమే పరిమితమైన విషయం కాదు. మన దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్యకు ఇదొక తార్కాణం.

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న దేశం. మన జనాభాలో సుమారు 60 శాతం మంది యువతే. దీనిని మనం గర్వంగా 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' అంటాం. యువ జనాభా ఎక్కువగా ఉంటే అభివృద్ధి సహజంగా వస్తుందనే నమ్మకం చాలామందిలో ఉంది. కానీ యువత సంఖ్య ఎక్కువగా ఉండటం మాత్రమే సరిపోతుందా? వారికి సరైన దిశ, లక్ష్యం, విలువలు లేకపోతే ఏమవుతుంది? అదే యువశక్తి అభివృద్ధికి బదులు విధ్వంసానికి దారి తీస్తుంది. సామాజిక స్పృహ లేని తెలివితేటలు సమాజానికి ముప్పుగా మారతాయి. కాబట్టి యువత సంఖ్య కాదు, వారి ఆలోచనా విధానం, విలువలే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

చదువు లేదా నైపుణ్యం ఉన్నప్పటికీ, దాన్ని ఉపయోగించుకునే సరైన అవకాశాలు, దిశా నిర్దేశం లేకపోవడం వల్ల కొంతమంది యువత సులభంగా డబ్బు సంపాదించే అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తి అంటే అది 'మనందరిది' అనే భావన తగ్గిపోతున్నది. 'ఇది ఎవరిదో, నాకేమిటి' అనే నిర్లక్ష్య ధోరణి పెరుగుతున్నది. ఈ ఆలోచన చాలా ప్రమాదకరం. 'ఎలా అయినా సరే త్వరగా డబ్బు సంపాదించాలి, 'ఫేమ్ తెచ్చుకోవాలి' అనే ఆలోచన సమాజంలో బలపడుతున్నది. ఇందులో నిజాయితీ, నైతికత, మానవ విలువలు వెనుకబడిపోతున్నాయి. మన విద్యా వ్యవస్థ మార్కులు, ర్యాంకులకే పరిమితమైపోతున్నది. పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా, విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నైతిక విలువలు, దేశం పట్ల బాధ్యతను పెంపొందించాలి. 'ఏం చేయాలి' అనే దానికంటే 'ఎందుకు చేయాలి' అనే ఆలోచన నేర్పాలి. తల్లిదండ్రులు, సమాజం కూడా తమ పాత్రను గుర్తించాలి. పిల్లల ప్రతిభను కేవలం సంపాదన కోసం మాత్రమే కాకుండా, సమాజానికి ఉపయోగపడేలా ఎలా వాడాలో చిన్నతనం నుంచే నేర్పాలి.

కొర్బా వంతెన చోరీ ఒక హెచ్చరిక. మన దేశ యువతలో అపారమైన శక్తి ఉంది. కానీ ఆ శక్తికి సరైన దారులు లేకపోతే, అది వరదలా మారి విధ్వంసానికి దారి తీస్తుంది. దేశ జనాభాలో 60 శాతం యువత ఉండటమంటే ఒక బలమైన ఆయుధం లాంటిదే. దాన్ని దేశ నిర్మాణానికి వాడతామా, లేక విచ్ఛిన్నానికి వదిలేస్తామా అనేది మనం వారికి నేర్పే సంస్కారం, ఇచ్చే అవకాశాలు, మార్గదర్శకత్వంపై ఆధారపడి ఉంటుంది.

○ **పి.వేణుగోపాల్‌రెడ్డి**
ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

ప్రజల మనసు కమ్యూనిస్టులకు తెలియదు!

స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ 'ఒకే భారతదేశం' అనే జాతీయ భావనను ప్రజల్లో రగిలించి, బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడేలా వారిని పురిగొల్పారు. సామ్యవాదులు, కమ్యూనిస్టులు సహా వివిధ రాజకీయ శక్తులను ఏకతాటిపైకి తెచ్చి, ఎన్నికల ఆధారిత ప్రజాస్వామ్యానికి నెహ్రూ నాంది పలికారు.


కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన జాతీయ భావనతో కమ్యూనిస్టులు విభేదించారు. గాంధేయ జాతీయ వాదానికి, నెహ్రూ అనుసరించిన వ్యూహానికి ప్రత్యామ్నాయం రూపొందించడం ఎం.ఎన్.రాయ్, ఎస్.ఏ. డాంగే, పి.సి.జోషి, ఆర్.పి.దత్‌లకు కష్టసాధ్యమైంది. ఒకవైపు జాతీయవాదం క్రమంగా బలపడుతున్న తరుణంలో, దానికి ప్రత్యామ్నాయంగా రైతు– కార్మిక రాజకీయాలను కమ్యూనిస్టులు ప్రతిపాదించారు. కాంగ్రెస్ పాలన మొదలైన వెంటనే, నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయాలని వారు ఉవ్విళ్లూరారు. పశ్చిమ యూరప్, రష్యా అనుభవాల ప్రభావంతో దేశంలో నెహ్రూ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని చేపట్టి, రాజులను తన పాలనలో భాగస్వాములుగా చేసుకున్నారు. అనంతరం భూ సంస్కరణల కమిషన్‌ను ఏర్పాటు చేసి, రైతు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. తత్ఫలితంగా, జమీందార్లు, భూస్వాముల స్థానంలో రైతులు భూ యజమానులయ్యారు. వారు పంటలు పండించి అమ్మడంతో వ్యవసాయం కొత్త దశలోకి మళ్లింది. అదే ఆధునిక ఆర్థిక వ్యవస్థకు పునాది అయింది. 'దున్నే వాడిదే భూమి' అనే కమ్యూనిస్టుల ప్రాథమిక నినాదాన్ని నెహ్రూ తమ పాలనలో ఆచరిస్తూ, ఆ పార్టీని బలహీనపరిచారు.

కమ్యూనిస్టులు ఈ ధోరణులను అర్థం చేసుకున్నారా? లేదు. నిజానికి, నెహ్రూ అమలు చేసిన వ్యవసాయ విధానానికి ప్రత్యామ్నాయంగా కార్మిక వర్గాన్ని సంఘటితం చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టుల మీద ఉంది. కానీ వారు అలా చేయలేదు. అంతేకాదు, శూద్రుల్లోని ఉన్నత రైతు వర్గం రైతు రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా దళితులను, క్రింది కులాల అజెండాను ముందుకు తెచ్చారు. దాంతో కమ్యూనిస్టులకు స్పష్టమైన రాజకీయ అజెండా మిగలకుండా పోయింది. వ్యవసాయ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఏర్పడిన రైతు కూలీ, దిగువ కులాల ఐక్యతను వారు ఇప్పటికీ గుర్తించలేదు!

నా ఉద్దేశం ప్రకారం, భారతీయ సమాజంలో వచ్చిన చైతన్యాన్ని కమ్యూనిస్టులు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. ఈ దేశంలో కులవ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తున్నదన్నది నిజం. గతంలో బ్రిటిషర్ల వలస పాలన, స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా కులాన్ని ఆధారంగా చేసుకొని ఏర్పడినవే. పెట్టుబడిదారీ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి శూద్రులే వెన్నెముకగా నిలిచారు. ఇక, కమ్యూనిస్టులకు ప్రత్యామ్నాయం– దిగువ కులాల ఆధారంతో సామాజిక న్యాయం ప్రాతిపదికన ప్రజాస్వామ్యాన్ని స్థాపించడం. ఇక్కడే అసలు సమస్య. భారతదేశంలో రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, సామాజిక నిర్మాణం... వీటన్నింటినీ నిర్ణయించే ప్రధాన అంశం 'కులమే' అయినప్పటికీ, ఆ పదాన్ని తమ విధానాల్లో ఉపయోగించడానికి కమ్యూనిస్టులు సంకోచించారు. కుల వాస్తవికతను అర్థం చేసుకోవడంలో వారు విఫలమయ్యారు. క్రమంగా వామపక్ష పార్టీల్లో చీలికలు మొదలై, ఆ పార్టీలు మరింతగా బలహీనపడ్డాయి.

1940–50 దశకంలో ప్రభుత్వాన్ని నడపడానికి లౌకిక– మతవాద రాజకీయాలు నెహ్రూకు రాజకీయ అవసరంగా మారాయి. దేశ విభజన సమయంలో అల్లర్లకు కారణమైన హిందుత్వ శక్తులను నెహ్రూ తన మతతత్వ వ్యతిరేక విధానం ద్వారా ఒంటరిని చేశారు. తొలుత హిందూ మహాసభ, అనంతర కాలంలో జనసంఘ్ అభివృద్ధి చేసిన హిందూ ఆధిపత్య రాజకీయాలను పక్కకు నెట్టి, మతభేదం లేకుండా అందరికీ ప్రజాస్వామ్య పాలనను అందించడానికి ఆయన కృషి చేశారు. దీంతో కమ్యూనిస్టులు సైతం సెక్యులరిజానికి మౌన అనుచరులుగా మారాల్సి వచ్చింది. ప్రారంభంలో రణదివే, రాజేశ్వర రావు లాంటి ప్రముఖ కమ్యూనిస్టు నేతలు నెహ్రూ విధానాలను గుడ్డిగా వ్యతిరేకించారు. కానీ నెహ్రూ రాజకీయాలకు దీటుగా తమ రాజకీయ విధానాలను రూపొందించుకోవడంలో విఫలమయ్యారు. దీంతో క్రమంగా వారు కూడా నెహ్రూవియన్ కమ్యూనిస్టులుగా మారిపోయారు! ఎమర్జెన్సీ కాలంలో హిందుత్వ రాజకీయ అజెండా మళ్లీ తెరపైకి వచ్చింది. జనసంఘ్ అనంతర కాలంలో బీజేపీగా మారి మతవాద రాజకీయాలను ముందుకు తెచ్చింది. అప్పటికే ఏర్పడిన రాజకీయ శూన్యతను క్రమంగా తనకనుకూలంగా మలుచుకుంటూ 2014లో అధికారాన్ని చేజిక్కించుకుంది.

“ **ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వేడుకల్లో వామపక్ష నేతలు మాట్లాడుతూ, బీజేపీ హిందుత్వ వాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కానీ ప్రజల మనసులో ఏముందో మాత్రం వారు గుర్తించడం లేదు.**



కాంగ్రెస్‌లో భాగమవుతున్నప్పుడు, కమ్యూనిస్టులు కనీసం ఆ వర్గంలోని కింది కులాలనైనా తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించాల్సింది. అదీ చేయలేదు. కమ్యూనిస్టులు ప్రధానంగా రైతు కులాల నుంచి వచ్చినవారు కావడంతో రైతు ప్రయోజనాలు దాటి, వ్యవసాయ కూలీ– దళిత రాజకీయ దృష్టిని అభివృద్ధి చేసుకోలేకపోయారు. చట్టాల ద్వారా ఎప్పుడో అమలైన వ్యవసాయ విప్లవాన్నే (ఇప్పటికీ జరగలేదన్నట్లుగా) కమ్యూనిస్టు పార్టీలన్నీ ఇంకా డిమాండ్ చేస్తూనే ఉన్నాయి! భూ సంస్కరణలతో బలపడిన రైతు కులాలు, అనంతర కాలంలో సొంత ప్రాంతీయ పార్టీలను స్థాపించి రాజకీయ శక్తులుగా ఎదిగాయి. ఈ దశలో ఇందిరాగాంధీ,

ప్రజలకు మతం ఒక విశ్వాసం. కానీ మతతత్వ వాదం అనేది పక్కాగా రాజకీయం. ప్రజలకు ఈ విషయంలో పూర్తి స్పష్టత ఉంది. ప్రజల మనస్తత్వాన్ని కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాలి. నేటికీ భారతీయులు తమ పండుగలతో పాటు పెళ్లిళ్లు, చావులకు సంబంధించిన తంతులన్నింటినీ వారి మతాచారాల ప్రకారంగానే జరుపుకుంటున్నారు. అయినప్పటికీ ప్రజలు స్వభావరీత్యా మతవాదులు కారు. వారు బీజేపీకి ఓటు వేయడానికి హిందూత్వం ఎంతమాత్రం కారణం కాదు. ప్రజల దృష్టిలో మతమనేది మోక్ష సాధనం మాత్రమేగానీ రాజకీయ సాధనం ఏమాత్రం కాదు. నిజానికి దేశంలో సరళీకరణ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి బాగా పెరిగిపోయింది. ఈ అవినీతి, కుల రాజకీయాలపై ప్రజలు విరక్తి చెందారు. బీజేపీ అధికారంలోకి రావడానికి ఈ అంశాలే దోహదం చేశాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ తన పరువును కాపాడుకోవడానికి మతతత్వవాదం అనే ఎత్తుగడను తెరపైకి తెచ్చింది. అయితే, ఈ రాజకీయ మార్పును కూడా కమ్యూనిస్టులు అర్థం చేసుకోలేకపోయారు.

హిందుత్వ నినాదం నగరాల్లో మాత్రమే ప్రభావం చూపగలదని బీజేపీకి తెలుసు. అందుకే, ప్రాంతీయ రాజకీయాల్లో మతపరమైన అంశాల కంటే ఇతర అంశాలపైనే వారు అధిక దృష్టి పెట్టారు. నేడు వీలైనంతగా తటస్థ రాజకీయాలను అవలంబిస్తూ, ముస్లింల మద్దతు కోసమూ ప్రయత్నిస్తున్నారు. ఇక, తెలంగాణలో ఏ ధోరణిని అనుసరించాలో బీజేపీకి ప్రస్తుతం అర్థం కాకుండా ఉంది. ఇప్పటికే రాజకీయంగా అభివృద్ధి చెందిన రెడ్డి సామాజికవర్గాన్ని ఆధారంగా చేసుకుని పార్టీని నిర్మించాలా, లేక ఎగిసిపడుతున్న బీసీ అజెండాను తలకెత్తుకోవాలో తెలియని సందిగ్ధ స్థితిలో ఉంది. ఏదేమైనా రాష్ట్ర కమలదళం హిందుత్వ అజెండాను మాత్రం తెరపైకి తీసుకురావాలనుకోవడం లేదు. అలాంటి మతవాదాన్ని ప్రజలు ఆదరించరని బీజేపీకి తెలుసు. అందుకే కాంగ్రెస్ కూడా ప్రస్తుతం సామాజిక న్యాయం అనే అజెండాను అనుసరిస్తోంది.

ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వేడుకల్లో వామపక్ష నేతలు మాట్లాడుతూ, బీజేపీ హిందుత్వ వాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కానీ ప్రజల మనసులో ఏముందో మాత్రం వారు గుర్తించడం లేదు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర కావాలని కోరుకుంటున్నారు. కానీ రైతు, కార్మిక సమస్యలపై కూడా కమ్యూనిస్టులు దృష్టి సారించడం లేదు. పట్టణ కార్మికవర్గం ఇప్పటికే పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగమైంది.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల్లో వచ్చిన రాజకీయ చైతన్యం నేడు పాలక పార్టీలను కుదిపేస్తోంది. అందుకే ఆయా వర్గాల నాయకులను తమ పార్టీల్లోకి లాక్కోవడానికి పాలకులు ప్రయత్నిస్తున్నారు. నేడు పార్టీలకు అత్యంత అనుకూలమైన అజెండా సామాజిక న్యాయమే. ప్రజా నేతలమని చెప్పుకునే కమ్యూనిస్టులు, ఓటు బ్యాంకు రాజకీయాల్లో కులం ఎంత ప్రధాన అంశమో అర్థం చేసుకోలేకపోయారు. తత్ఫలితంగా, పార్టీకి కట్టుబడి ఉండే క్రింది కులాల కార్యకర్తలు సైతం క్రమంగా ఆ పార్టీని వీడుతున్నారు. దీంతో కమ్యూనిస్టులు క్షేత్రస్థాయిలో బలహీనపడి, చివరకు ఎన్నికల్లో పొత్తుల కోసం ఆ పార్టీని, ఈ పార్టీని ప్రాధేయపడే స్థితికి దిగజారారు. భారత పెట్టుబడులు ఇప్పుడు ప్రపంచ పెట్టుబడులతో పోటీ పడుతున్నాయి. దీనివల్ల మానవ విలువలు, సంబంధాలు కుటుంబ జీవితం కూడా బూర్జువా భావజాలంతోనే నడుస్తోంది. ప్రజలు కొత్త రకమైన రాజకీయాలను కోరుతున్నారు. కానీ కమ్యూనిస్టు పార్టీలు ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాయి. 'సామాజిక న్యాయం' అనే నినాదం దేశంలో ఇప్పుడు మార్మోగుతోంది. తమకు ఎంతగానో ఉపకరించే ఈ అజెండాను కమ్యూనిస్టులు అనుసరిస్తారా? లేక, ఎప్పటిలాగే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని రాజకీయంగా ముమ్ముందుకు సాగాలనే సీపీఐ కోరిక ఫలిస్తుందా? కమ్యూనిస్టుల ఐక్యత ఏనాటికైనా సాధ్యమవుతుందా? వేచి చూడాలి.



■ **ఇనుకొండ తిరుమలి**
చరిత్రకారుడు

పెట్టుబడి మోసానికి 'సుప్రీం' చెక్!

ఐదు దేశాలు, ఎనిమిది సంస్థలు, సుమారుగా పదిహేనువేల కోట్ల రూపాయలు, ఒక బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ, ఒక ప్రముఖ భారతీయ స్టార్టప్, ప్రపంచంలోనే అతిపెద్ద రీటైలర్ సంస్థ– ఇంతమంది పాత్రధారులుగా ఉన్న 'ది అథారిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ రూలింగ్ వర్సెస్ టైగర్ గ్లోబల్ ఇంటర్నేషనల్ II' కేసులో ఈ ఏడాది జనవరి 15 నాడు ఇద్దరు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం ఒక ముఖ్యమైన తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఆదాయపన్నుకు సంబంధించినది మాత్రమే కాదు, ఈ తీర్పులో దేశ సార్వభౌమత్వం, రాజ్యాంగ సర్వోత్కృష్టత, ద్వైపాక్షిక ఒప్పందాలు, పన్నుఎగవేత, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలు ఎన్నో ఉన్నాయి. రాజ్యాంగ పరిభాషలో చెప్పాలంటే ఆదేశిక సూత్రాలకు సంబంధించిన విషయాలు అనేకం మిళితమై ఉన్నాయి.


అమెరికాకి చెందిన టైగర్ గ్లోబల్ అనే బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ భారతదేశంలో వ్యాపారం చేసే సింగపూర్‌కి చెందిన ఫ్లిప్‌కార్ట్ అనే ఒక స్టార్టప్‌లో 2010 నుండి పెట్టుబడి పెడుతూ వస్తున్నది. అయితే ప్రత్యక్షంగా గాక మారిషస్, కేమెన్ ఐలాండ్స్ లాంటి దేశాలలో రిజిస్టర్ అయివున్న తన అనుబంధ సంస్థల ద్వారా ఆ పని చేస్తూ వచ్చింది. ఇది 2018 వరకు కొనసాగింది. 2018లో ఫ్లిప్‌కార్ట్ సంస్థలో తనకి ఉన్న వాటాలో మెజారిటీ భాగాన్ని అమెరికాకి చెందిన ప్రపంచంలోనే అతిపెద్ద రీటైలర్ వాల్‌మార్ట్‌కి అమ్మేసింది. మిగిలిన వాటాని కూడా 2023లో అదే వాల్‌మార్ట్‌కి అమ్మేసింది. టైగర్ గ్లోబల్ మొత్తం ఎంత పెట్టుబడి పెట్టిందీ, ఎంత మొత్తానికి వాల్‌మార్ట్‌కి తన వాటాని అమ్మిందీ ఈ లెక్కలు మనకు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. కానీ, సుప్రీంకోర్టులో జరిగిన కేసు 2018 వరకు జరిగిన లావాదేవీల గురించి మాత్రమే కాబట్టి, ఆ తీర్పులో ఉన్న సమాచారం ప్రకారం– టైగర్ గ్లోబల్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌లోని తన మెజారిటీ వాటాను వాల్‌మార్ట్‌కి 2018 నాటికి దాదాపు రూ.15,000కోట్లకు అమ్మింది.

పన్నులలో కాపిటల్ గెయిన్స్ టాక్స్ అని ఒకటి ఉంటుంది. పెట్టుబడుల విలువ పెరిగినప్పుడు, తద్వారా పొందిన లాభంలో కొంత శాతాన్ని కాపిటల్ గెయిన్స్ టాక్స్‌గా ప్రభుత్వానికి కట్టాలి. టైగర్ గ్లోబల్ కూడా ఆ పన్ను కట్టాలని మన ఆదాయపు పన్ను శాఖ ఆ సంస్థకు తెలియజేసింది. అయితే తాము రూపాయి కూడా భారత ప్రభుత్వానికి కట్టవలసిన అవసరం లేదని టైగర్ గ్లోబల్ వాదించింది. ఈ కేసు అంచెలంచెలుగా–ఆదాయ పన్నుశాఖ, అథారిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ రూలింగ్, ఢిల్లీ హైకోర్టు–దాటి చివరికి సుప్రీంకోర్టుకు చేరింది.

భారతదేశానికి, మారిషస్ ప్రభుత్వానికి మధ్య ఉన్న ఒక ద్వైపాక్షిక ఒప్పందం కారణంగా తాను ఆ పన్ను కట్టనవసరం లేదని టైగర్ గ్లోబల్ వాదన. ఈ రెండు దేశాలలో వ్యాపారం చేసే సంస్థలు రెండు దేశాలలోనూ పన్ను కట్టనవసరం లేకుండా సంస్థ ఎక్కడైతే రిజిస్టర్ అయిందో అక్కడ మాత్రమే కట్టే సౌలభ్యం ఈ ఒప్పందంలో ఉంది. ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడి పెట్టిన టైగర్ గ్లోబల్ అనుబంధ సంస్థలు మారిషస్‌లో రిజిస్టర్ అయి ఉన్నాయి కాబట్టి ఈ ఒప్పందం ప్రకారం అక్కడ పన్ను కడితే చాలు. అయితే మారిషస్‌లో పన్నులు శూన్యం. అంటే టైగర్ గ్లోబల్ భారతదేశంలో వ్యాపారం ద్వారా తమ విలువ పెంచుకుని, ఇక్కడ, మారిషస్‌లోనూ పన్ను కట్టకుండా మొత్తం లాభం తిరిగి అమెరికాకి ఉచితంగా తరలించేసుకోవచ్చు. సుప్రీంకోర్టు కూడా ఇది అన్యాయమూ, చట్టవిరుద్ధమూ అని తేల్చి చెప్పింది.

నిజానికి ఎనిమిదేళ్ళ క్రితం వరకు ఇది చట్టవిరుద్ధమేమీ కాదు. గతంలో అనేక ఇన్వెస్ట్‌మెంట్, వెంచర్ కాపిటల్, ఆల్టర్నేట్ అసెట్ మేనేజ్‌మెంట్ తదితర సంస్థలు మారిషస్ లాంటి దేశాలలో షెల్/ లెటర్ బాక్స్/ సూట్‌కేస్ సంస్థలను రిజిస్టర్ చేసి, అక్కడ నుండి పెట్టుబడులు భారతదేశానికి తరలించి, ఇక్కడ విలువ పెరిగాక వాటాలను అమ్మేసుకుని ఆ లాభాలను తిరిగి మారిషస్ తరలించి, పైన పేర్కొన్న ద్వైపాక్షిక ఒప్పందం పేరు మీద రూపాయి కూడా పన్ను కట్టకుండా డబ్బు పోగేసుకున్నాయి. నిజానికి ఇది పన్ను ఎగవేత. దాంతో 2017లో ఆదాయ పన్ను చట్టానికి ఒక కీలక సవరణ చేశారు. మారిషస్ లాంటి దేశాలలో రిజిస్టర్ అయిన సంస్థలు కేవలం షెల్ లేదా లెటర్ బాక్స్ సంస్థలు అయితే ఈ ఒప్పందం వాటికి వర్తించదని, సదరు సంస్థలకు అక్కడ కూడా వ్యాపార లావాదేవీలు ఉండాలని, అవి కేవలం పన్ను ఎగవేత కోసమే అక్కడ రిజిస్టర్ అయ్యాయా? అన్న సంగతిని ఐటీశాఖ విచారించాలని, అలా తేలిన పక్షంలో, వారిని ఇక్కడ పన్ను కట్టమని డిమాండ్ చేసే అధికారం మనకు ఉంటుందని ఆ సవరణ సారాంశం. సుప్రీంకోర్టు తాజా తీర్పు ఆ సవరణను ప్రామాణికంగా చేసుకుని ఇచ్చిందే.

ఒక దేశంలో వ్యాపారం చేసే సంస్థ మీద పన్ను విధించడం ఆ దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన అంశం. ఇక్కడ వ్యాపారం చేస్తూనే భారత ప్రభుత్వానికి పన్ను ఎగవేసేందుకు ప్రయత్నించిన అమెరికన్ సంస్థను నిలువరిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విలువలకు అనుగుణమైనది.



ఫ్లిప్‌కార్ట్ అనేది సింగపూర్‌లో రిజిస్టర్ అయ్యి భారతదేశంలో వ్యాపారం చేస్తున్న సంస్థ. ఆ సంస్థకు లాభాలు లేకపోయినా వ్యాపారం మాత్రం వేల కోట్లలోనే ఉన్నది. ప్రస్తుతం నడుస్తున్న పెట్టుబడివ్యవస్థ లాజిక్ ప్రకారం సంస్థకి లాభాలు లేకపోయినా ఫరవాలేదు కానీ ఆ సంస్థ మార్కెట్ విలువ మాత్రం ఎప్పటికప్పుడు పెరుగుతూ ఉండాలి. దీనిని కొంతమంది షేర్ హోల్డర్ కాపిటలిజం అని పిలుస్తున్నారు. ఒక్క ఫ్లిప్ కార్టే కాదు, ప్రముఖ 'స్టార్టప్'లుగా పేరుపొందిన స్విగ్గీ, జొమాటో, ఊబర్, ఓలా, రాపిడో, అర్బన్ కంపెనీ, లెన్స్‌కార్ట్ లాంటి అనేక సంస్థల ఫైనాన్షియల్ ప్లే బుక్ ఇదే. వాస్తవానికి ఇవి 'టెక్నో–ఫ్యూడల్' సంస్థలు.

ఇటువంటి సంస్థలకు లాభాల కన్నా మార్కెట్ విలువ ముఖ్యం. ఆ విషయంలోనే పై విధమైన ద్వైపాక్షిక ఒప్పందాలు బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్/వెంచర్ కాపిటల్ సంస్థలకు ఉపయోగపడతాయి. ఇటువంటి సంస్థల విలువ పెంచేది 'ఉద్యోగం' అని లేకుండా 'గిగ్‌వర్క్' పేరు మీద నలిగిపోతున్న లక్షలాది మంది వర్కర్లు, భారతదేశ వినియోగదారులు. లాభాలు మూటకట్టుకునేది మాత్రం ఈ బహుళజాతి సంస్థలు. సుప్రీం కోర్టు కూడా తన తీర్పులో ఈ విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. వ్యాపారం జరిగింది ఇక్కడ కాబట్టి, పన్ను ఇక్కడ కట్టడమే న్యాయం అనే ప్రాథమిక సూత్రాన్ని నొక్కి వక్కాణించింది.

ఒక దేశంలో నివసించే వ్యక్తి మీద, వ్యాపారం చేసే సంస్థ మీద పన్ను విధించడం అనేది ఆ దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన ఒక ముఖ్య అంశం. ప్రగతిశీల పన్ను విధానం అనేది వనరుల పునఃపంపిణీకి ఉద్దేశించిన ప్రక్రియ కూడా. వనరుల పునఃపంపిణీ భారత రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో ప్రధానమైనది. కానీ, పైన పేర్కొన్న రీతిలో పన్నులు ఎగవేయటం దేశ సార్వభౌమత్వానికి గొడ్డలిపెట్టే గాక, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను అపహాస్యం చేయడమే. ఈ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ విలువలను ఎత్తిపట్టే విధంగా తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. 'ఇతర దేశాలతో మనం చేసుకునే ఒప్పందాలు మన రాజ్యాంగానికి లోబడి ఉండాలి' అని తీర్పు చెప్పిన ఇద్దరిలో ఒక న్యాయమూర్తి వ్యాఖ్యానించడం హర్షించదగ్గ విషయం. ఈ దృష్టితో చూసినప్పుడు– ప్రస్తుతం ప్రభుత్వాలు వివిధ సంస్థలతో, దేశం వివిధ దేశాలతో చేసుకుంటున్న ఒప్పందాలలో ఎన్ని రాజ్యాంగ గీటురాయికి నిలబడతాయి అనే ప్రశ్న మనం వేసుకోవటం అవసరం.

● **గుత్తా రోహిత్**
మానవ హక్కుల వేదిక

నెహ్రూ సెక్యులరిస్టు కాదు

'మత జాతీయవాదం భారత్‌కి మేలు చేసేనా?' శీర్షికన ఫిబ్రవరి 7న రామచంద్ర గుహ రాసిన వ్యాసానికి ఏ మాత్రం ఇంగిత జ్ఞానం ఉన్నవాడైనా మేలు చేయదనే చెబుతాడు. తన వ్యాసంలోని అంశాలను సమర్థించుకునేందుకు ఆయన ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూని వెనకేసుకు రావడం అభ్యంతరకరం. నెహ్రూ ఆధ్వర్యంలో ఏర్పడ్డ ప్రభుత్వంలోకి హిందూ మహాసభ ప్రతినిధిగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని తీసుకున్నారు. 20వ శతాబ్దిలో హిందూ మహాసభ రాజకీయాలు అంత ప్రమాదమైతే వారికి ప్రభుత్వంలో నెహ్రూ ఎందుకు స్థానం కల్పించినట్టు? 1947 అక్టోబర్ 15న ముఖ్యమంత్రులకు నెహ్రూ రాసినట్టుగా గుహ ఉటంకించిన ఉత్తరం వేళ మంత్రివర్గంలో శ్యామప్రసాద్ సభ్యుడే. నెహ్రూది పైకి సెక్యులరిజం, లోపల మైనారిటీ సంతుష్టీకరణ విధానం. రాజ్యాంగంలో మత చట్టాలను అనుమతించినపుడే తేలిపోయింది ఆయన సెక్యులరిజం. సెక్యులరిజం అంటూనే మైనారిటీలకు ప్రత్యేక హక్కుల గురించి రాసినపుడే మన రాజ్యాంగం కుహనా లౌకిక రాజ్యాంగం అని అర్థమైంది. సెక్యులర్ దేశంలో అందరూ భారతీయులే. భారతీయులందరికీ సమాన హక్కులు ఉంటాయి. అటువంటి దేశంలో పౌరులకు ఉండే హక్కులన్నీ ముస్లిం మైనారిటీలకు ఇవ్వాలి అని నెహ్రూ ఉత్తరం రాయడం ఆయన కుహనా లౌకికవాదానికి తార్కాణం.

అయోధ్య వివాదం రాజీవ్‌గాంధీ నెత్తిన రుద్ది నెహ్రూని రక్షించే యత్నం చేశారు గుహ. ప్రధానిగా నెహ్రూ ఉన్న 1959లోనే తొలిసారి అయోధ్య మందిర వివాదం తలెత్తింది. నాడు హఠాత్తుగా రామ్‌లాల విగ్రహం అక్కడ ఎవరో పెట్టారు. ఆ సమయంలో ఆ విగ్రహం తొలగించే ఉత్తర్వులు నెహ్రూ ఇచ్చివుంటే అది బాబ్రీ మసీదుగానే ఉండిపోయేది. అది చేయకుండా మందిర–మసీదు వివాదానికి నెహ్రూ పునాది వేశారు. నెహ్రూని సెక్యులర్‌వాదిగా, ప్రజాస్వామ్యవాదిగా, సమ్మిళిత అభివృద్ధిని కాంక్షించినవాడిగా లేనిపోని ఘనకీర్తులు ఆయనకు తన వ్యాసంలో తొడిగారు గుహ. దేశంలో సామాజిక సమరసతకు, మత విభేదాలు, ఘర్షణల నివారణకు ఏకైక పరిష్కారం ఉమ్మడి పౌరస్మృతి. అటువంటి చట్టానికి డిమాండ్ చేయాల్సిన గుహ వంటి మేధావులు హిందూ–ముస్లింలను ఏకం కానివ్వని మత చట్టాలకు అనుమతినిచ్చిన నెహ్రూని కొనియాడడం దురదృష్టకరం.

– **డా. దుగ్గరాజు శ్రీనివాసరావు**, విజయవాడ



కీళ్ల వాతం ఖతం



కీళ్ల నొప్పులకు అరుగుదల ఒక్కటే కారణం కాదు. రోగనిరోధక వ్యవస్థ శరీరం మీదే ఎదురుదాడి చేసే ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో కూడా కీళ్లు వాతానికి గురై, నొప్పులు వేధిస్తాయి. రుమటాలజీ విభాగానికి చెందిన పది రకాల ప్రధాన రుగ్మతలను లక్షణాల ఆధారంగా కనిపెట్టి, చికిత్సతో సరిదిద్దుకోవాలంటున్నారు వైద్యులు.

రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్


కీళ్ల వాతం కీళ్లకే పరిమితం కాదు. దీన్లోని పది రకాల రుగ్మతలు, భిన్నమైన లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటాయి. ఈ రుగ్మతల్లో కీళ్ల నొప్పులతో పాటు అంతర్గత అవయవాలు కూడా దెబ్బతింటూ ఉంటాయి. భిన్నమైన లక్షణాలతో తప్పుదోవ పట్టించే ఈ రుగ్మతల పట్ల అవగాహన పెంచుకోగలిగితే, సాధ్యమైనంత త్వరగా సమర్థమైన చికిత్సను తీసుకోగలుగుతాం!

వేర్వేరు రూపాల్లో వేధిస్తూ...

- **రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్:** రుమటాలజీలో ఇదొక ప్రధాన సమస్య. ఉదయం నిద్రలేస్తూనే 45 నుంచి 60 నిమిషాల వరకూ కీళ్లు పట్టుకుపోయి, నెమ్మదిగా వదులవుతాయి. కాలి, చేతి వేళ్లు వాచిపోయి, మునక్కాడల్లా మారిపోతాయి. ఎడమ, కుడి.. ఇలా శరీరంలోని రెండు అర్థభాగాలూ, ఒకేసారి ప్రభావానికి గురవుతాయి. రెండు మోకాళ్లూ, మోచేతులూ, మణికట్లూ, వేళ్లు... ఒకేసారి ప్రభావితమవుతాయి. ఈ సమస్య మహిళల్లో మూడురెట్లు ఎక్కువ. రక్తపరీక్షల్లో రుమటాయిడ్ ఫ్యాక్టర్ పాజిటివ్ ఉంటుంది. ఈ లక్షణాలు 6 వారాలకు మించి వేధిస్తే, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌గా అనుమానించి చికిత్స తీసుకోవాలి.
- **లూపస్:** 15 నుంచి 50 ఏళ్ల వయసు మహిళల్లో ఈ సమస్య 9 రెట్లు ఎక్కువ. దీన్లో కూడా రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్ లక్షణాలుంటాయి. అలాగే ఎండ సోకితే బుగ్గలు కందిపోతాయి. నోటి అల్సర్లు ఎక్కువగా వేధిస్తాయి, వెంట్రుకలు రాలిపోతూ ఉంటాయి. అలసట, జ్వరం, బరువు కోల్పోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ సమస్య క్రమేపీ ఇతరత్రా అంతర్గత అవయవాలను ప్రభావితం చేస్తుంది. రక్తం ప్రభావితమైతే, తెల్లరక్తకణాలు, ప్లేట్‌లెట్స్, హీమోగ్లోబిన్ తగ్గిపోతాయి. ఊపిరితిత్తులు ప్రభావితమైతే ఆయాసం, దగ్గు వేధిస్తాయి. మూత్రపిండాలకు సోకితే ప్రొటీన్ నష్టం, గుండె ప్రభావితమైతే గుండె వేగం పెరిగి గుండె విఫలం కావచ్చు. మెదడు ప్రభావితమైతే మూర్ఛలు వేధిస్తాయి. నరాలు ప్రభావితమైతే పెరిఫరల్ న్యూరోపతీతో కాళ్లలో, చేతుల్లో తిమ్మిర్లు ఇబ్బంది పెడతాయి. కాలేయం ప్రభావితమైతే కామెర్లు రావచ్చు. లూపస్‌లో ఎపిఎస్ సిండ్రోమ్ కూడా తలెత్తుతుంది. ఈ సమస్య ఉన్న మహిళల్లో వరుస గర్భస్రావాలు బాధిస్తాయి. కాళ్ల రక్తనాళాల్లో, ఊపిరితిత్తుల్లో రక్తపు గడ్డలు ఏర్పడతాయి. ఎఎన్ఎ, డిఎస్‌డిఎన్ఎ, యాంటీస్మిత్ పరీక్షలు పాజిటివ్ ఫలితాన్నిస్తే, లూపస్‌గా నిర్థారించుకోవాలి
- **జోగ్రన్ సిండ్రోమ్:** ఈ సమస్య కూడా మహిళల్లోనే ఎక్కువ. కళ్లు, నోరు, చర్మం, యోని పొడిబారిపోవడం ప్రధాన లక్షణాలు. కళ్లు పొడిబారి పుసులు కడుతూ ఉంటాయి. నోరు ఎండిపోతూ ఉండడం వల్ల నీళ్లు ఎక్కువ తాగవలసి వస్తుంది. వీళ్లలో పిప్పి పళ్లు కూడా ఎక్కువే! యోని పొడిబారడం వల్ల లైంగిక చర్య ఇబ్బందికరంగా మారుతుంది. ఈ సమస్యలకు తోడు కీళ్ల నొప్పులు కూడా ఉంటాయి. పొటాషియం తీవ్రంగా క్షీణించి, పీరియాడిక్ పెరాలసిస్ తలెత్తుతుంది. ఎస్ఎస్ఎ, ఎస్ఎస్‌బి పరీక్షలతో వ్యాధిని నిర్థారించి చికిత్సను ఎంచుకోవాలి
- **సోరియాటిక్ ఆర్థ్రయిటిస్:** సోరియాసిస్‌తో పాటు కీళ్లు కూడా ప్రభావితమైతే దాన్ని సోరియాటిక్ ఆర్థ్రయిటిస్‌గా పరిగణించాలి. గోళ్లన్నీ ఫంగస్ సోకినట్టు మారిపోతాయి. అలాగే గోళ్ల మీద గుండుసూదితో గుచ్చిన గుర్తులు ఏర్పడి, పెళుసుగా మారిపోతాయి. ఈ రుగ్మతను నిర్థారించే పరీక్షలు లేకపోయినా, రుమటాలజిస్ట్ వెంటనే కనిపెట్టగలుగుతారు. ఈ రుగ్మత స్త్రీపురుషులను సమానంగా వేధిస్తుంది
- **యాంకిలోసింగ్ స్పాండిలైటిస్:** ఈ సమస్య పురుషుల్లో 9 రెట్లు ఎక్కువ. ఉదయం లేవగానే గంట పాటు నడుం, వెన్ను నొప్పి వేధించి, పొద్దెక్కేకొద్దీ ఉపశమనం కలుగుతుంది. అర్థరాత్రి కూడా నొప్పి వేధించవచ్చు. పిరుదుల్లోని శాక్రో ఇలియాక్ కీలు వాతానికి గురై నొప్పి వేధిస్తుంది. వెన్ను నొప్పితో పాటు మెడకు కూడా నొప్పి వ్యాపించవచ్చు. క్రమేపీ చేతులు, కాళ్లు, పాదాలకు కూడా నొప్పి వ్యాపిస్తుంది. హెచ్ఎల్ఎ బి27 పరీక్ష పాజిటివ్ ఫలితాన్ని బట్టి, ఎక్స్‌రే ద్వారా వ్యాధిని నిర్థారించుకుని, సమర్థమైన చికిత్స తీసుకోవాలి. కొందర్లో వ్యాధి తీవ్రమై మెడ పట్టేస్తుంది
- **జెఐఎ (జువెనైల్ ఇడియోపతిక్ ఆర్థ్రయిటిస్):** చిన్న పిల్లల్లో వచ్చే కీళ్ల వ్యాధి ఇది. దీన్లో ఐదు రకాలున్నాయి. అయితే ఒక ప్రధాన ఆర్థ్రయిటిస్‌లో జ్వరం, చర్మం మీద దద్దుర్లు, కీళ్ల నొప్పులు, వాపులు వేధిస్తాయి. జ్వరం వచ్చి తగ్గిపోతూ ఉంటుంది. మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు సోకినప్పుడు జ్వరం తగ్గేవరకూ పిల్లలు మంచానికే పరిమితమైపోతే, జెఐఎ జ్వరంలో ఒక రోజులోనే పిల్లలు నీరసించిపోతూ, జ్వరం తగ్గిన వెంటనే హుషారుగా ఆడుకుంటూ ఉంటారు.
- **గౌట్:** యూరిక్ ఆమ్లం పెరిగినప్పుడు వేధిస్తుంది. పురుషుల్లో ఎక్కువ, మెనోపాజ్‌కు చేరిన మహిళల్లో కూడా కనిపిస్తుంది. ఈ సమస్య జన్యుపరంగా కూడా సంక్రమించవచ్చు. మద్యం, మటన్, సముద్రాహారం తిన్నప్పుడు యూరిక్ ఆమ్లం కీళ్లలో పేరుకుపోయి, గౌట్ తలెత్తుతుంది. అలాగే మూత్రపిండాల్లో రాళ్లు కూడా ఏర్పడతాయి. వీళ్లలో గౌట్‌తో పాటు స్థూలకాయం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ కూడా ఉండొచ్చు. ముందు రాత్రి ఎలాంటి అసౌకర్యం లేకపోయినా, తెల్లవారేసరికి కాలి బొటనవేలు వాచిపోతుంది. తీవ్రమైన నొప్పి వేధిస్తుంది. సాధారణంగా ఈ సమస్య దానంతట అదే తగ్గిపోయి, తిరగబెడుతూ ఉంటుంది. ఐదారేళ్ల పాటు చికిత్సను ఆలస్యం చేస్తే, ఈ సమస్య శాశ్వతంగా ఉండిపోతుంది
- **స్క్లీరోడెర్మా:** మహిళల్లో ఎక్కువ. చర్మం మందంగా, బిగుతుగా మారిపోతుంది. కీళ్లనొప్పులు వేధిస్తాయి. చలికాలంలో, చల్లనీళ్లలో చేతులు పెట్టినా అవి నీలంగా మారిపోతాయి. తీవ్రమైన సందర్భాల్లో కాలి, చేతి వేళ్లకు రక్తప్రసరణ లోపించి, గ్యాంగ్రీన్‌తో నల్లగా మారిపోతాయి. పల్మొనరీ ఫైబ్రోసిస్ కూడా వేధిస్తుంది. ఎస్‌సిఎల్ 70 రక్తపరీక్షతో వ్యాధిని నిర్థారించుకోవచ్చు. అలాగే యాంటీసెంట్రోమియర్ యాంటీబాడీస్ పరీక్ష ఫలితం కూడా పాజిటివ్ వస్తుంది
- **పాలీమయోసైటిస్:** పద్మాసనం నుంచి పైకి లేవలేరు. అటక మీదున్న వస్తువులను అందుకోలేరు. కటి చుట్టూరా, భుజం చుట్టూరా ఉండే కండరాలు బలహీనపడడమే ఇందుకు కారణం. కళ్లు, ఛాతీ, వీపు మీద ఎర్రటి మచ్చలు కూడా కనిపిస్తాయి. రక్తపరీక్షతో వ్యాధి నిర్థారణ అయితే సమర్థమైన చికిత్సతో నయం చేసుకోవాలి. అలాగే ఎలక్ట్రోమయోగ్రఫీ పరీక్షతో, కండరాల ఎమ్మారైతో కూడా వ్యాధిని నిర్థారించుకోవచ్చు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- లూపస్ ఉన్న వాళ్లు ఎండలో తిరగడం తగ్గించాలి. లేదంటే సూర్యకిరణాల్లోని అతినీలలోహిత బి కణాలు శరీరానికి సోకి లూపస్ వ్యాధి పెరుగుతుంది
- గౌట్ ఉన్నవాళ్లు అధిక ప్రొటీన్ (రెడ్ మీట్, సముద్రాహారం) తగ్గించాలి, మద్యం మానేయాలి
- ఉపశమనం కోసం వేడి నీళ్ల కాపడం, చల్లనీళ్ల కాపడం ఎంచుకోవచ్చు



వ్యాయామం కీలకం

కీళ్ల నొప్పులు మొదలు కాగానే విశ్రాంతికి పరిమితమయ్యే వారే ఎక్కువ. అయితే మందులు వాడుకుంటూ శారీరకంగా చురుగ్గా ఉండే ప్రయత్నం చేయాలి. నిజానికి విశ్రాంతితో కీళ్లు బిగుసుకుపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వైద్యులు సూచించే వ్యాయామాలతో పాటు, యోగా, ఈత లాంటివి సాధన చేస్తూ ఉండాలి. ఆహార నియమాల్లో భాగంగా ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే రెడ్ మీట్ మానేయాలి. ఒమేగా3 ఎక్కువగా ఉండే వాల్‌నట్స్ తీసుకోవాలి. విటమిన్ సి సమృద్ధిగా దొరికే పుల్లని పండ్లు తీసుకోవాలి. వృక్షాధారిత ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

గురి తప్పని చికిత్సలు

గతంలో రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌కు నొప్పి నివారణ మందులు, స్టిరాయిడ్లతో చికిత్సను అందించేవారు. కానీ నేటి చికిత్సా విధానం మారింది. కీళ్ల వాతాలకు గురి తప్పని సూటి చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. మూల కారణాలు లక్ష్యంగా సాగే రుమటాలజీ చికిత్సలతో నొప్పులు అదుపులోకి రావడంతో పాటు జీవన నాణ్యత మెరుగుపడుతోంది. సపోర్టివ్ చికిత్సలో భాగంగా పరిమిత మోతాదుతో కూడిన నొప్పి నివారణ మందులతో పాటు, తక్కువ మోతాదు 'స్టిరాయిడ్స్'ను అందివలసి ఉంటుంది. స్టిరాయిడ్స్ పట్ల మనలో కొన్ని అపోహలున్నాయి. క్రీడాకారులు కండర సామర్థ్యం, శరీర దారుఢ్యాల కోసం వాడుకునేవి... అనబాలిక్ స్టిరాయిడ్స్. ఇవి కొంత మేరకు ఆరోగ్యానికి హానికరమైనవి. కానీ కీళ్ల వాత చికిత్సల్లో ఇచ్చేవి 'కార్టికో స్టిరాయిడ్స్'. నిజానికి మన శరీరంలోని అడ్రినలిన్ గ్రంథి ప్రతి రోజూ ఐదు మిల్లీగ్రాముల కార్టికో స్టిరాయిడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. అయితే ఆటో ఇమ్యూన్ డిజార్డర్ ఫలితంగా శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరిగినప్పుడు శరీరంలో తయారయ్యే స్టిరాయిడ్ మోతాదు సరిపోకపోవచ్చు. కాబట్టి సప్లిమెంట్‌గా కార్టికో స్టిరాయిడ్స్ తీసుకోగలిగితే వ్యాధి అదుపులోకొస్తుంది. ఆ తర్వాత వీటిని వాడుకోవలసిన అవసరం ఉండదు. గరిష్ఠంగా మూడు నెలల పాటు కార్టికో స్టిరాయిడ్స్ వాడుకుని మానేయవచ్చు. మరీ ముఖ్యంగా లూపస్ సమస్యకు స్టిరాయిడ్స్ అద్భుతమైన విరుగుడు. డిసీజ్ మాడిఫయింగ్ యాంటీ రుమటిక్ డ్రగ్స్‌లో నోటి మాత్రలు, ఇంజెక్షన్లు ఉంటాయి. వీటితో కూడా కీళ్ల వాత సమస్యలు అదుపులోకొస్తాయి. జాక్ ఇన్హిబిటర్స్, టిఎన్ఎఫ్ ఇన్హిబిటర్స్ కూడా మెరుగైన ఫలితాన్నిస్తాయి.

డాక్టర్ వి. శరత్ చంద్ర మౌళి
క్లినికల్ డైరెక్టర్ - డిపార్ట్‌మెంట్ ఆఫ్ రుమటాలజీ అండ్ క్లినికల్ ఇమ్యునాలజీ,
కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్



తెలుసుకుందాం

నాటు, నీటు.. గుడ్లలో ఏవి మేలు?

ఫారం గుడ్లతో పోలిస్తే, నాటు గుడ్లలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని అనుకుంటాం. వీటిలో ఏది మేలు? తెలుసుకుందాం!



ఫారం కోళ్ల గుడ్ల కంటే నాటు కోడి గుడ్లు ఆరోగ్యకరం అన్నది అపోహ మాత్రమే! గుడ్లకు గోధుమ రంగు కోళ్ల బ్రీడ్ నుంచి సమకూరుతుంది. అది జన్యుపరమైన లక్షణం. పోషక లక్షణం కానే కాదు. పైగా నాటు గుడ్ల ధర కూడా ఎక్కువ. నాటు కోళ్లు తక్కువ గుడ్లు పెడతాయి కాబట్టి వీటి గుడ్లకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. అంతే తప్ప వాటిలో ఎక్కువ పోషకాలుంటాయి కాబట్టే ధర ఎక్కువ అని అనుకోకూడదు. పోషకవిలువల పరంగా రెండు రకాల గుడ్లు సమానమైనవే! రెండింట్లోనూ సమాన క్యాలరీలుంటాయి. అయితే కోళ్లను పెంచిన విధానం, కోళ్లు తినే ఆహారం గుడ్ల పోషకాల మీద ప్రభావాన్ని కనబరుస్తాయి. కాబట్టి ఈ అంశాల మీద దృష్టి పెడుతూ, స్వేచ్ఛగా తిరిగే కోళ్లు పెట్టే తాజా గుడ్లకు ప్రాధాన్యమివ్వాలి.

వ్యాయామానికి ముందు

వ్యాయామం ఎంత ముఖ్యమో, దానికి ముందు శరీరాన్ని వ్యాయామానికి సన్నద్ధం చేయడం కూడా అంతే ముఖ్యం. అందుకోసం వార్మప్ చేయాలి.



శరీరం సన్నద్ధం: వ్యాయామానికి శరీరాన్ని సన్నద్ధం చేసే వ్యాయామమిది. తేలికపాటి కార్డియో వాస్క్యులర్ వ్యాయామాలతో పాటు స్ట్రెచింగ్ వ్యాయామాలు వార్మ్ ఎలో ఉండాలి

ఎంతసేపు: కనీసం పది నుంచి 20 నిమిషాల పాటు సాగాలి.

ప్రభావాలు: రక్తనాళాలను వెడల్పు చేసి, కండరాలకు రక్తప్రసారం ద్వారా ఆక్సిజన్ అందేందుకు తోడ్పడుతుంది. నమ్యత పెరిగి, వ్యాయామానికి తగినట్టు కండరాల ఉష్ణోగ్రతను పెంచుతుంది. వార్మప్‌తో గుండె వేగం నెమ్మదిగా పెరగడం వల్ల గుండెమీద ఒత్తిడి తగ్గుతుంది.

అప్రమత్తం

వీటితో క్యాన్సర్ ఖాయం

ఏమాత్రం ప్రమాదకరమైనవి కావని మనం భ్రమించే కొన్ని అంశాలు క్యాన్సర్ కారకాలు కావచ్చు. అవేంటంటే...

సెంటెడ్ క్యాండిల్స్: సువాసనలు వెదజల్లే క్యాండిల్స్, బెంజీన్, ఫార్మాల్డిహైడ్ అనే రసాయనాలను వెదజల్లుతాయి. క్యాన్సర్ కారకాలైన వీటిని పీల్చుకోవడం వల్ల, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు రెట్టింపవుతుంది.

నాన్‌స్టిక్: ఈ వంట పాత్రలు విషపూరితమైన ఎఫ్‌డిఒఎ రసాయనాలను విడుదల చేస్తాయి. ఈ రసాయనాలు మన శరీరంలో పేరుకుపోయి, థైరాయిడ్, మూత్రపిండాలు, వృషణాల క్యాన్సర్ అవకాశాలను పెంచుతాయని పరిశోధనల్లో తేలింది.

మైక్రోవేవ్ పాప్‌కార్న్ బ్యాగ్స్: ఈ బ్యాగ్ లైనింగ్‌లో పిఎఫ్ఒఎ రసాయనాలుంటాయి. ఇవి వేడికి ఆవిరైపోతాయి. కాబట్టి మైక్రోవేవ్‌లో వేడి చేసిన పాప్‌కార్న్ వాయువులను పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.



టాల్కమ్ పౌడర్: బేబీ పౌడర్, బాడీ పౌడర్లలో ఆస్బెస్టాస్ కలుషితాలుంటాయి. ఇవి అండాశయ క్యాన్సర్ ముప్పును పెంచుతాయి

ప్రాసెస్డ్ మీట్: బేకన్, సాసేజ్, హాట్ డాగ్స్‌ను సిగరెట్ల మాదిరిగా, గ్రూప్ 1 క్యాన్సర్ కారకాలుగా గుర్తించారు. వీటితో పెద్ద పేగు క్యాన్సర్ ముప్పు ఎక్కువ

ఎయిర్ ఫ్రెష్‌నర్స్: ఇవి థాలేట్స్, ఫార్మాల్డిహైడ్స్‌ను గాల్లోకి విడుదల చేస్తాయి. దీర్ఘకాలం పాటు వీటికి బహిర్గతమైతే, శ్వాసకోశ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ అవకాశాలు పెరుగుతాయి

పరిశోధన

క్యాబేజీ కట్టుతో నొప్పి కట్

ఇన్‌ఫ్లమేషన్ బాధ నుంచి ఉపశమనం కోసం వేడి నీటి కాపడానికి బదులుగా క్యాబేజీ పట్టు వేస్తే ఫలితం కచ్చితంగా ఉంటుందని నిరూపించే ఒక తాజా పరిశోధన వెలుగులోకొచ్చింది. మరిన్ని వివరాలు...

సంప్రదాయ వైద్య విధానంలో భాగంగా ఇన్‌ఫ్లమేషన్‌తో కూడిన వాపు, నొప్పులను తగ్గించుకోవడం కోసం పలు ప్రాంతాల్లో క్యాబేజీ ఆకులతో పట్టు వేస్తూ ఉంటారు. అయితే ఈ రకమైన కట్టుతో నిజంగానే ఫలితం ఉంటుందనీ, ఒక తాజా పరిశోధనలో వెల్లడైంది. క్యాబేజీలో ఎమ్ఐఆర్ఐ72, ఎమ్ఐఆర్ఐ72బి అనే మైక్రో ఆర్ఎన్ఎ పరమాణువులుంటాయి. ఈ వృక్ష సమ్మేళనాలు శరీరంలోని ఇన్‌ఫ్లమేటరీ పాత్‌వేలోని ప్యాన్ ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుని, కీళ్ల నొప్పి, వాపులకు దారితీసే భౌతిక సంకేతాలను అణచివేస్తాయి. ఆస్టియో ఆర్థ్రయిటిస్ రోగుల్లో కీళ్ల నొప్పులను తగ్గించడంలో క్యాబేజీ ఆకులు డిక్లోఫినాక్ జెల్‌తో సమానమైన ప్రభావాన్ని కనబరుస్తున్నట్టు, పలు ప్రయోగాల్లో రుజువైంది. యాంథోసయానిన్, గ్లుటమిన్, సల్ఫర్ మొదలైన యాంటి ఇన్‌ఫ్లమేటరీ సమ్మేళనాలను కలిగి ఉండే క్యాబేజీ ఆకులు... దెబ్బలు, గాయాలు, మాస్టైటిస్‌ల నుంచి అదనపు ద్రవాన్ని సంగ్రహించి, వాటిని మాన్పుతాయని కూడా పరీక్షల్లో రుజువైంది.



గుండె ఆరోగ్యం మన చేతుల్లో...

మన చేయి కలిగి ఉండే శక్తి ద్వారా వాస్తవిక గుండె వయసును కనిపెట్టవచ్చు. గుండె వైఫల్యాన్ని ఎన్నో ఏళ్ల ముందే అంచనా వేయడానికి వైద్యులు ఈ శక్తినే ఉపయోగిస్తున్నారు. బలహీనమైన చేతులు గుండె కండర క్షీణతకూ, అవసరానికి మించి శ్రమ పడుతున్న గుండెకూ సూచనలు. పూర్తి భౌతిక ఆరోగ్యాన్ని తెలిపే సరళమైన, అత్యంత ప్రభావవంతమైన కీలక లక్షణమిది. సిస్టమిక్ ఇన్‌ఫ్లమేషన్, మెటబాలిక్ సమస్యలు మన అస్థిపంజర కండరాల్లోనే బహిర్గతమవుతాయి. 60 సెకన్ల పాటు ఒక బార్ నుంచి వేలాడలేనప్పుడు, మన వ్యవస్థ విఫలమవుతోందని అర్థం. పెద్దల్లో... చేతి శక్తి, ఎముకల సాంద్రతకూ, మెదడు ఆరోగ్యానికీ సంకేతం లాంటిది. కాబట్టి దృఢమైన పట్టును పెంచుకోవడం ద్వారా, భవిష్యత్తులో క్షీణించబోయే మెదడు ఆరోగ్యాన్ని దృఢపరుచుకున్నవాళ్లం అవుతాం! అందుకోసం జిమ్‌లో వ్యాయామాలు చేయవలసిన అవసరం లేదు. బరువులను మోస్తూ ఉండడం, వేలాడడం ద్వారా కూడా ఈ ప్రయోజనాన్ని పొందవచ్చు. కాబట్టి గుండె రక్షణ కోసం, ఆయుర్దాయం కోసం చేతులను ఆయుధాలుగా మార్చుకోవాలి.



పోషక జలం

పండ్లు పోషకభరితాలు. వీటిలోని పోషకాలను రోజంతా అందుకోవాలంటే పండ్ల ముక్కలను నీళ్లలో కలుపుకోవాలి. ఈ నీళ్లతో బడలిక దరి చేరకుండా ఉంటుంది. రోజంతా హుషారుగా ఉండగలుగుతాం!

కావలసిన పదార్థాలు:

స్ట్రాబెర్రీలు - 4
నిమ్మకాయ - 1
నీళ్లు - 4 గ్లాసులు
తులసి ఆకులు - 5
తేనె - 1 టేబుల్ స్పూను

తయారీ విధానం:

- స్ట్రాబెర్రీలు శుభ్రంగా కడిగి, ముక్కలు చేసి పెట్టుకోవాలి.
- నిమ్మకాయ చక్రాలుగా కోసుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో నీళ్లు నింపి, ముక్కలు, తేనె, తులసి ఆకులు వేసి కలపాలి.
- ఈ గిన్నెను ఫ్రిజ్‌లో 3 గంటల నుంచి 2 రోజుల వరకూ ఉంచి వాడుకోవచ్చు.



కిడ్స్ కేర్

పసికందులకు గృహ చిట్కాలు వద్దు

పసికందు ఆరోగ్యం కోసం, ఉపశమనం కోసం తల్లులు తెలిసిన, విన్న చిట్కాలన్నీ ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఈ చిట్కాలు సమస్యను పరిష్కరించకపోగా, మరింత క్లిష్టం చేసే అవకాశాలు లేకపోలేదు



జలుబు తగ్గించడం కోసం 8 నెలల పసికందుకు విక్స్, కర్పూరం మిశ్రమాన్ని వాడడంతో బిడ్డ పరిస్థితి విషమించి, ప్రాణాలు పోయిన సంఘటన చెన్నైలో చోటుచేసుకుంది. పసికందులకు అనుసరించకూడని గృహ చిట్కాల పట్ల తల్లులకు అవగాహన లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. విక్స్ లాంటి ఉత్పత్తులు స్వల్ప ఉపశమనాన్ని అందించగలుగుతాయి తప్ప సమస్యను నయం చేయవు. పైగా రెండేళ్ల లోపు పసికందులకు విక్స్, కర్పూరం లాంటివి ఉపయోగించకూడదు. కర్పూరం, విక్స్‌ల ఘాటైన వాసనలను పిల్లలు భరించలేరు. ఈ వాసనలతో పసికందుల సున్నితమైన శ్వాస నాళాలు దెబ్బతింటాయి. కాబట్టి తల్లులు ఇలాంటి సందర్భాల్లో వైద్యులు సూచించే జాగ్రత్తలను పాటించవలసి ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

పసికందుల జలుబుకు బ్యాక్టీరియా, వైరస్ ప్రధాన కారణాలు. ఈ ఇన్‌ఫెక్షన్లు వాటంతట అవే అదుపులోకొస్తాయి. శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు ఉన్నప్పుడు, వైద్యులు సూచించే నేసల్ డ్రాప్స్ వాడుకోవచ్చు. హైడ్రేషన్ మెరుగ్గా ఉండేలా చూసుకోవాలి. రెండేళ్లు పైబడిన పిల్లలకు అవసరాన్ని బట్టి వైద్యులు సూచించే యాంటీ హిస్టమిన్ మందులు వాడుకోవచ్చు. విక్స్ లాంటి వాటిని ఛాతీ, వీపు మీద మినహా నోరు, ముక్కు దగ్గర అప్లై చేసుకోకూడదు. ఛాతీ, వెన్ను దగ్గర విక్స్ అప్లై చేయడం వల్ల పిల్లలకు కొంత ఉపశమనం కలుగుతుంది. అలాగే కొందరు తల్లులు పిల్లలకు సాంబ్రాణి పొగ వేస్తూ ఉంటారు. దీంతో ధూళి, బూడిద, పొగ, రసాయనాలతో కూడిన సూక్ష్మ ఘన రేణువులు, నీటి బిందువులు గాల్లో కలిసి పిల్లల శ్వాసనాళాలు ఇబ్బందికి లోనై, దగ్గు, ఆయాసం, పిల్లికూతలు వేధిస్తాయి. అగరబత్తీ పొగలు కూడా పసికందుల్లో అలర్జీలకు కారణమవుతాయి. ఉబ్బసం కలిగి ఉన్న పిల్లలకు ఎలాంటి పొగ క్షేమం కాదు.

డాక్టర్ అనుపమ ఎర్ర
సీనియర్ పీడియాట్రీషియన్,
రెయిన్‌బో చిల్డ్రెన్స్ హాస్పిటల్,
హైదరాబాద్



కుటుంబ నియంత్రణ

పిల్లలను కనడానికి సిద్ధంగా లేని దంపతులు, అనుసరించదగిన కుటుంబ నియంత్రణ విధానాలు అనేకం ఉన్నాయి. అయితే వైద్యుల సలహా మేరకు, స్వల్ప కాలిక, దీర్ఘకాలిక కుటుంబ నియంత్రణ విధానాల్లో అనువైనదాన్ని ఎంచుకోవడం ఉత్తమం.

పిల్లలు వద్దనుకుంటే...

పెళ్లైన వెంటనే పిల్లలు వద్దనుకునే దంపతులుంటారు. అలాగని తోచిన గర్భనిరోధక సాధనాలను ఎంచుకోవడం సరికాదు. ఇవి కొన్ని సందర్భాల్లో విఫలమయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ విషయంలో వైద్యుల సలహా పాటించడం తప్పనిసరి.

అవసరాన్ని బట్టి...

- ఎంత వ్యవధిలో మీకు తల్లి కావాలనే ఉద్దేశం ఉంది?
- ఒక్కో కుటుంబనియంత్రణ పద్ధతి సామర్థ్యం ఎంత?
- దుష్ప్రభావాలు ఏవైనా ఉంటాయా?
- మీరెంత తరచుగా సెక్స్‌లో పాల్గొంటారు?
- ఏ పద్ధతి మీ ఇద్దరికీ సౌకర్యంగా ఉంటుంది?

ఎంతో సమర్థమైన కుటుంబనియంత్రణ పద్ధతులు కూడా ఒక్కోసారి ఫెయిలవుతూ ఉంటాయి. కాబట్టి గర్భం దాల్చే అవకాశాలను సమర్థంగా అడ్డుకునే పద్ధతిని ఎంచుకోవాలి.

కుటుంబ నియంత్రణ పద్ధతులు:

ఫిమేల్ అండ్ మేల్ స్టెరిలైజేషన్: సర్జరీ ద్వారా శాశ్వతంగా గర్భం రాకుండా చేయవచ్చు.

లాంగ్ యాక్టింగ్ రివర్సిబుల్ కాంట్రాసెప్టివ్స్: ఈ విధానంలో శరీరం లోపల అమర్చే పరికరం ద్వారా 3 నుంచి పదేళ్లపాటు గర్భం రాకుండా నియంత్రించవచ్చు. పిల్లలు కావాలనుకున్నప్పుడు ఆ పరికరాన్ని తీసేయొచ్చు.

షార్ట్ యాక్టింగ్ హార్మోనల్ మెథడ్స్: మాత్రలు, మినీ పిల్స్, ప్యాచ్, షాట్, వెజైనల్ రింగ్ - వీటి ద్వారా గర్భధారణను అడ్డుకోవచ్చు. షాట్‌ను ప్రతి మూడు నెలలకూ తీసుకోవాలి. మాత్రలు, వెజైనల్ రింగ్ ప్రతి రోజూ వాడాలి.

బ్యారియర్ మెథడ్స్: కండోమ్స్, డయాఫ్రమ్, స్పాంజ్, సర్వికల్ క్యాప్ - వీటిని లైంగికంగా కలిసే ప్రతిసారీ వాడాలి.

న్యాచురల్ రిథమ్ మెథడ్స్: ఎలాంటి కుటుంబనియంత్రణ పద్ధతులూ పాటించకుండా అండాలు విడుదల కాని సమయంలో సెక్స్‌లో పాల్గొనవచ్చు. ఈ రోజులను కచ్చితంగా గుర్తించడం కోసం ఓవ్యులేషన్ హోమ్ టెస్ట్ కిట్ లేదా ఫర్టిలిటీ మానిటర్‌లను ఉపయోగించాలి. అయితే, ఉజ్జాయింపు లెక్కలతో పాటించే ఈ విధానం ఫెయిలయ్యే అవకాశాలూ ఎక్కువే!



డాక్టర్ షర్మిలా మజుందార్,
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్, హైదరాబాద్

బిజినెస్

ఈ ఏడాదే హైదరాబాద్ ఎంఆర్ఓ అందుబాటులోకి

60కి పైగా టెక్నీషియన్ల నియామకం : సాఫ్రాన్

ముంబై: విమాన ఇంజన్ల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌ఓ) కోసం సాఫ్రాన్ సంస్థ హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న యూనిట్ పనులు ఊపందుకున్నాయి. ఈ యూనిట్ కోసం ఇప్పటికే 60 మందికిపైగా టెక్నీషియన్లను నియమించినట్టు సాఫ్రాన్ వెల్లడించింది. గత ఏడాది నవంబరులో ప్రారంభించిన సాఫ్రాన్ ఎంఆర్ఓ కేంద్రం ఈ ఏడాది వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుందని తెలిపింది. ఏటా 300 లీప్ ఇంజన్లకు ఎంఆర్‌ఓ సేవలు అందించేలా సాఫ్రాన్ ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్ తొలి దశలో 250 మంది, పూర్తి స్థాయి సామర్థ్యం అందుకునే సరికి 1,100 మంది పని చేస్తారు. ఫ్రాన్స్ కేంద్రంగా పని చేసే విమాన ఇంజన్ల తయారీ సంస్థ సాఫ్రాన్, అమెరికా కేంద్రంగా పనిచేసే మరో విమాన ఇంజన్ల తయారీ కంపెనీ జీఈ ఏరోస్పేస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సీఎఫ్ఎం ఇంటర్నేషనల్ హైదరాబాద్‌లో ఈ ఎంఆర్‌ఓ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్‌లో ఎయిర్‌బస్ 320 నియో, బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల్లో ఉపయోగించే లీప్ ఇంజన్లకు ఎంఆర్‌ఓ సేవలు అందిస్తారు.

కోటాకు లోబడే కార్ల దిగుమతి



- మద్యం దిగుమతులకు కనీస ధర
- భారత-యూఎస్ వాణిజ్య ఒప్పందం వెల్లడి

న్యూఢిల్లీ: భారత-అమెరికా వాణిజ్య ఒప్పందం వివరాలు క్రమంగా వెల్లడవుతున్నాయి. ఈ ఒప్పందంతో ఇక ఆ దేశం నుంచి తక్కువ సుంకాలతో లగ్జరీ కార్లు దిగుమతి చేసుకోచ్చని సంబరపడిన వారి గొంతులో వెలక్కాయ పడింది. కోటా పరిమితులకు లోబడి మాత్రమే ఈ దిగుమతులు ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఈ కోటా పరిమితి ఎంత అనే విషయం ఇంకా వెల్లడి కాలేదు. కోటాకు లోబడి దిగుమతి చేసుకునే లగ్జరీ బైకులు, కార్లపైనా వాటి ఇంజన్ సీసీ సామర్థ్యాన్ని బట్టి 30 నుంచి 40 శాతం దిగుమతి సుంకాలు తప్పవు.

మందు బాబులకూ నిరాశే

భారత-అమెరికా వాణిజ్య ఒప్పందం మందుబాబులనూ నిరాశ పరిచింది. ఈ ఒప్పందంతో డ్యూటీ ఫ్రీగా వచ్చే సీమ సరుకుతో చిందులేయ వచ్చని బడాబాబులు ఆశించారు. అయితే ఈ దిగుమతులకూ కనీస దిగుమతి ధర తప్పదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఏర్పాటు లేకపోతే తాము దుకాణాలు మూసుకోవడం తప్ప మరో మార్గం లేదని ఒప్పందానికి ముందు నుంచే దేశంలోని మద్యం తయారీ కంపెనీలు గగ్గోలు పెట్టాయి. దీంతో వీరి ఆందోళనను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంలో ఈ కనీస దిగుమతి ధర క్లాజు చేర్చిందని భావిస్తున్నారు.

కార్ల రుణ వడ్డీ రేట్లు తగ్గింపు : బీఓబీ

న్యూఢిల్లీ: తమ కారు రుణాల కనీస చర (ఫ్లోటింగ్) వడ్డీ రేటును 7.9 నుంచి 7.6 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రకటించింది. రుణ గ్రహీతల పరపతి స్కోరును బట్టి ఈ వడ్డీ రేటు మారుతుంది. ఈ తగ్గింపు వెంటనే అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. ఫిక్స్‌డ్ (స్థిర) వడ్డీ రేటు ఆధారంగా మంజూరు చేసే కారు లోన్ల కనీస వడ్డీ రేటు 8.5 శాతంతో ప్రారంభమవుతుందని బ్యాంకు పేర్కొంది. కారు లోన్ల మొత్తాన్ని ఒకేసారి లేదా పాక్షికంగా చెల్లించినా ఎలాంటి ముందస్తు చెల్లింపు చార్జీలు కూడా ఉండవని తెలిపింది.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి జాతీయ అవార్డులు

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని విద్యుదుత్పత్తి సంస్థ ఎస్ఈఐఎల్ ఎనర్జీ మూడు జాతీయ అవార్డులను దక్కించుకుంది. ఎఫిషియెంట్ కోల్ విభాగం, ఇన్నోవేటివ్ వాటర్ కన్సర్వేషన్ అండ్ ఆప్టిమైజేషన్ ప్రాక్టీసెస్, వాటర్ ఎఫిషియెంట్ విభాగంలో ఈ అవార్డులను గెలుచుకుంది. సోమవారం ఢిల్లీలో జరిగిన జాతీయ పవర్ జెన్ వాటర్ మేనేజ్‌మెంట్ అవార్డుల కార్యక్రమంలో ఎస్ఈఐఎల్ ఆపరేషన్స్ హెడ్ శ్రీనివాస్, మేనేజర్ టీ కృష్ణన్ ఈ అవార్డులను అందుకున్నారు.

అరబిందో ఫార్మా లాభం రూ. 910 కోట్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.910 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం లాభం రూ.846 కోట్లతో పోల్చితే 8 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా 8.4 శాతం వృద్ధితో రూ.7,979 కోట్ల నుంచి రూ.8,646 కోట్లకు పెరిగింది. కీలక మార్కెట్లైన అమెరికా, యూరప్‌ల్లో వివిధ ఉత్పత్తుల పోర్టుఫోలియో పటిష్ఠంగా ఉండటంతో పాటు డిమాండ్ పెరగటం ఎంతగానో కలిసి వచ్చిందని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి వెల్లడించారు.

మొత్తం ఆదాయంలో 8 శాతం వృద్ధి

ఆదాయంలో అమెరికా మార్కెట్ వాటా 43 శాతం

మొత్తం ఫార్ములేషన్ వ్యాపారం రూ.7,683 కోట్లు

కాగా ఈ కాలంలో మొత్తం ఫార్ములేషన్ వ్యాపారం 10.4 శాతం వృద్ధితో రూ.7,683 కోట్లుగా నమోదైందని కంపెనీ తెలిపింది. క్యూ3లో అమెరికా ఆదాయం 2.2 శాతం వృద్ధితో రూ.3,739 కోట్లకు చేరుకోగా యూరప్ రెవెన్యూలు 27.4 శాతం వృద్ధి చెంది రూ.2,703 కోట్లుగా నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. దేశీయ ఫార్ములేషన్ విక్రయాలు రూ.74 కోట్లుగా ఉన్నాయి. కంపెనీ మొత్తం రెవెన్యూలో అమెరికా వాటా 43.2 శాతంగా ఉంది. క్యూ3లో మొత్తం 9 ఔషధాలను విడుదల చేసినట్లు కంపెనీ పేర్కొంది. యూఎస్ఎఫ్‌డీఏ నుంచి 7 అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్స్ (అండా)కు ఆమోదం లభించిందని కంపెనీ తెలిపింది.

గరుడ రెన్యువబుల్స్‌లో 26 శాతం వాటా

సౌర, పవన విద్యుదుత్పత్తి విభాగంలోని గరుడ రెన్యువబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 26 శాతం వాటాను రూ.66 కోట్లకు కొనుగోలు చేసినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. అలాగే విద్యుదుత్పత్తి వ్యయాలను తగ్గించుకోవటంతో పాటు ఈఎస్‌జీ ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు గరుడతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు తెలిపింది. గరుడ రెన్యువబుల్స్.. ఎకోరెన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ సంస్థగా ఉంది.

ఎంఎస్ఎంఈలకు ఊరట

రూ.20 లక్షల వరకు హామీలేని రుణాలు

ముంబై: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్ఎంఈ) రుణ నిబంధలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సవరించింది. ఈ సంస్థలకు రూ.20 లక్షల వరకు ఇచ్చే రుణాలపై ఎలాంటి పూచీకత్తు అడగవద్దని బ్యాంకులను ఆదేశించింది. అలాగే ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద ఖాదీ గ్రామోద్యోగ పరిశ్రమలకు రూ.20 లక్షల వరకు ఇచ్చే రుణాలకూ ఇదే సూత్రం వర్తింప చేయాలని కోరింది. అయితే ఈ పరిమితికి లోబడి రుణాలు తీసుకునే ఎంఎస్ఎంఈలు ఇందుకోసం స్వచ్ఛందంగా బంగారం, వెండి వస్తువులు హామీగా పెడితే బ్యాంకులు అందుకు అంగీకరించడం చట్టవిరుద్ధం కాదని పేర్కొంది. దీంతో బ్యాంకుల ఎంఎస్ఎంఈలకు రూ.20 లక్షల లోపు రుణాలు ఇచ్చేటప్పుడు బంగారం లేదా వెండి పూచీకత్తుగా చూపమని బ్యాంకులు పరోక్షంగా ఒత్తిడి చేసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. దేశంలోని చిన్నచిన్న వ్యాపార సంస్థలకు రుణ సదుపాయాల్ని మరింత చేరువ చేసేందుకు ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. ఎంఎస్ఎంఈ ఆర్థిక పరిస్థితుల, ట్రాక్ రికార్డు ఆధారంగా బ్యాంకులు వీటికి పూచీకత్తుతో కూడిన రుణాలు రూ.25 లక్షల వరకు మంజూరు చేయవచ్చని సూచించింది.

2026-27లో వృద్ధి 6.4% : మూడీస్

న్యూఢిల్లీ: ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ 6.4% వృద్ధిని సాధిస్తుందని, జీ-20 దేశాల్లో అమిత వేగంగా పురోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని రేటింగ్ సంస్థ మూడీస్ అంచనా వేసింది. దేశీయ వినియోగం బలంగా ఉండడంతో పాటు విధానపరమైన చర్యలు, సుస్థిరమైన బ్యాంకింగ్ వ్యవస్థ ఇందుకు సహాయకారిగా ఉంటాయని తెలిపింది. ఎంఎస్ఎంఈ విభాగంలో స్వల్ప ఒత్తిడి ఉన్నప్పటికీ దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఆస్తుల నాణ్యత మెరుగ్గా ఉంటుందని పేర్కొంది. రుణాలపరంగా ఎలాంటి నష్టాలు ఏర్పడినా తట్టుకుని నిలిచేందుకు అవసరమైన నిల్వలు బ్యాంకుల వద్ద ఉన్నట్టు తెలిపింది. వ్యవస్థాత్మక సంస్కరణల కారణంగా 2026 లో బ్యాంకుల నిర్వహణాపరమైన వాతావరణం బలంగానే ఉంటుందని కూడా అభిప్రాయపడింది.

మళ్లీ 84,000 పైకి సెన్సెక్స్

- 26,000కు చేరువైన నిఫ్టీ
- రూ.6 లక్షల కోట్ల సంపద వృద్ధి



ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. సోమవారం ఒక దశలో 734 పాయింట్లు ఎగబాకి 84,314.68 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. చివరికి 485.35 పాయింట్ల లాభంతో 84,064.75 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 228.55 పాయింట్లు పెరిగి 26,000 మైలురాయికి చేరువైనప్పటికీ, ఆఖర్లో 173.60 పాయింట్ల వృద్ధితో 25,867.30 వద్ద క్లోజైంది. భారత్- అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదరిన ఉత్సాహంలో ట్రేడర్లు జోరుగా కొనుగోళ్లకు పాల్పడటం ఇందుకు దోహదపడింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు కూడా ఇందుకు తోడయ్యాయి. దాంతో మన ఈక్విటీ మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) ఒక్క రోజులో రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.473.34 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 రాణించాయి.

రూ.17,000 పెరిగిన వెండి

- కిలో రూ.2.72 లక్షలకు చేరిక

అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ బంగారం, వెండి మళ్లీ ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్కరోజే రూ.17,000 (6.66 శాతం) పెరిగి రూ.2,72,000కు చేరకుంది. 10 గ్రాముల మేలిమి(99.9 శాతం స్వచ్ఛత) బంగారం రేటు రూ.1,300 పెరుగుదలతో రూ.1,58,500 పలికింది. అమెరికన్ డాలర్ మళ్లీ బలహీనపడిన నేపథ్యంలో ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు ఒక శాతానికి పైగా పెరిగి 5,012 డాలర్లకు చేరగా.. సిల్వర్ 2.81 శాతం వృద్ధితో 80.21 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	515
వరంగల్	497	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	120
వరంగల్	125	గుంటూరు	120
కరీంనగర్	125	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	105
కర్నూలు	125	నెల్లూరు	110
విశాఖపట్నం	115	అనంతపురం	110
గోదావరి	120		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,58,840 ▲	1,45,600 ▲	3,00,000 ▲
విజయవాడ	1,60,300 ▼	1,48,300 ▼	2,70,000 ▲
విశాఖపట్నం	1,60,118 ▲	1,43,550 ▲	3,00,000 ▲
రాజమండ్రి	1,58,840 ▲	1,45,600 ▲	2,67,000 ▲
ప్రొద్దుటూరు	1,60,500 ▲	1,47,660 ▲	2,73,000 ▲
ముంబై	1,54,876 ▲	1,41,866 ▲	2,53,665 ▲

ప్రైవేట్ చేతికి 4 జాతీయ రహదారులు

జాబితాలో చిలకలూరిపేట- విజయవాడ్ హైవే : ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ: జాతీయ రహదారుల ప్రైవేటీకరణ కొనసాగుతోంది. తాజాగా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఎన్‌హెచ్ఏఐ నిర్వహణలోని 260 కిలోమీటర్ల పొడవైన ఐదు రహదారుల ప్రైవేటీకరణకు రంగం సిద్ధమైంది. నాలుగు రాష్ట్రాల్లో ఉన్న రహదారులకు రూ.9,500 కోట్లు చెల్లించేందుకు రాజమార్గ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఆర్ఐఐటీ) చేసిన ఆఫర్‌కు ఎన్‌హెచ్ఏఐ ఆమోదం తెలిపింది. ఇందులో 69.4 కిలోమీటర్ల పొడవైన ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేట-విజయవాడ రహదారి ప్రాజెక్టు కూడా ఉంది. మిగిలిన రహదారులు తమిళనాడు, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఉన్నాయి. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పథకం కింద ఈ రహదారులను ఇన్విట్స్‌కు అప్పగిస్తున్నట్టు ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ చెప్పారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు
- నెదర్లాండ్స్ X నమీబియా (ఉ. 11 గం. నుంచి)
- న్యూజిలాండ్ X యూఏఈ (మ.3 గం.)
- పాకిస్థాన్ X అమెరికా (రా.7 గం.)

భారత్‌తో మ్యాచ్‌కు గ్రీన్‌సిగ్నల్

పాక్ ప్రధాని షరీఫ్ అనుమతి ● ఈనెల 15న యథావిధిగా మ్యాచ్



లాహోర్: టీ20 వరల్డ్‌కప్ టోర్నీలో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ నిర్వహణపై వారం రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. షెడ్యూల్ ప్రకారమే భారత్-పాక్ మ్యాచ్ జరుగనుంది. 'ఈనెల 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉండాలని పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ మా జట్టుకు సూచించారు' అని పీసీబీ అధికార ప్రతినిధి ఆమిర్ మీర్ తెలిపారు. దీంతో కొలంబోలో జరగాల్సిన ఈ మ్యాచ్‌కు అడ్డంకులన్నీ తొలగినట్టయింది. అలాగే శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకేకు కూడా షరీఫ్ స్వయంగా ఈ విషయాన్ని తెలిపినట్టు సమాచారం.

ఫలించిన చర్చలు: మెగా టోర్నీ నుంచి బంగ్లాదేశ్ జట్టుకు ఉద్వాసన పలకడంతో పాక్ క్రికెట్ బోర్డు వారికి మద్దతుగా నిలిచింది. దీనిలో భాగంగా ఈనెల 15న కొలంబోలో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించడంతో క్రికెట్ వర్గాలు షాక్‌కు గురయ్యాయి. ఈ మ్యాచ్ ద్వారా వేల కోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్న ఐసీసీతో పాటు బ్రాడ్‌కాస్టర్ జియోస్టార్ కూడా ఈ నిర్ణయం కలవరపాటుకు గురి చేసింది. అటు స్టార్ న్యాయపరమైన చర్యలకు దిగుతానంటూ హెచ్చరించింది. అలాగే శ్రీలంక క్రికెట్ బోర్డు కూడా బాయ్‌కాట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందిగా పాక్ బోర్డుకు విజ్ఞప్తి చేసింది. గతంలో పాక్ దేశంలో ఏ విదేశీ జట్టూ పర్యటించని పరిస్థితుల్లో తమ బృందాన్ని పంపిన విషయాన్ని గుర్తు చేసింది. అలాగే భారత్‌తో మ్యాచ్ ఆడకుంటే తాము కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంది. దీనికితోడు ఆదివారం ఐసీసీ వైస్ చైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం కలిసి పీసీబీ చీఫ్ మొహిసిన్ నక్వీతో సమావేశమయ్యారు. ఇందులో బాయ్‌కాట్ నిర్ణయంపై మనసు మార్చుకోవాలంటూ నక్వీని అమీనుల్ ఇస్లాం ప్రత్యేకంగా కోరారు. 'భారత్‌తో మ్యాచ్ ఆడే విషయమై బంగ్లా, శ్రీలంక, యూఏఈ బోర్డులతో పాటు ఐసీసీ నుంచి కూడా ఒత్తిడి రావడంతో ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో నక్వీ మాట్లాడనున్నారు. ఏదిఏమైనా తుది నిర్ణయం ప్రధాని తీసుకుంటారు' అని పీసీబీ వర్గాలు వెల్లడించాయి. అన్నట్టుగానే సోమవారం అర్ధరాత్రి ప్రధాని నుంచి సానుకూల ప్రకటన రావడంతో టీ20 వరల్డ్‌కప్‌నకు సరికొత్త ఉత్సాహాన్నిచ్చినట్టయ్యింది. మరోవైపు భారత్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌నకు దూరంగా ఉన్నందుకు బంగ్లాదేశ్ బోర్డుపై ఎలాంటి ఆంక్షలు విధించడం లేదని ఐసీసీ స్పష్టం చేసింది.

చెలరేగిన పేస్ త్రయం

- జింబాబ్వే బోణీ
- 8 వికెట్లతో ఒమన్ చిత్తు



కొలంబో: బ్రియాన్ బెన్నెట్ (48 నాటౌట్) తోపాటు పేస్ త్రయం బ్లెస్సింగ్ ముజరబాని (3/16), రిచర్డ్ ఎన్‌గరవ (3/17), బ్రాడ్ ఇవాన్స్ (3/18) చెలరేగడంతో.. టీ20 వరల్డ్‌కప్‌లో జింబాబ్వే ఘనంగా బోణీ చేసింది. గ్రూప్-బిలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 8 వికెట్ల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 19.5 ఓవర్లలో 103 పరుగులకు కుప్పకూలింది. సూఫియాన్ మెహమూద్ రెండు వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే బౌలర్ల దెబ్బకు ఒక దశలో ఒమన్ 27/5తో టోర్నీలో అత్యల్పస్కోరు నమోదు చేసేలా కనిపించింది. కానీ, మిడిలార్డర్‌లో వినయ్ శుక్లా (28), సూఫియాన్ (25) ఆదుకోవడంతో టీమ్ స్కోరు కష్టంగా సెంచరీ మార్క్ దాటగలిగింది. అనంతరం ఛేదనలో జింబాబ్వే 13.3 ఓవర్లలో 106/2 స్కోరు చేసి గెలిచింది. బెన్నెట్, బ్రెండన్ టేలర్ (31 రిటైర్డ్ హర్ట్) మూడో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడంతో.. జింబాబ్వే మరో 39 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. ముజరబాని 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

గురి తప్పని ఇషా

ఆసియా చాంపియన్‌షిప్‌లో మరో స్వర్ణం, కాంస్యం



న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ నాలుగు పతకాలతో ముగించింది. సోమవారం జరిగిన 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో ఇషా, మను భాకర్, రిథమ్ సంగ్వాన్ బృందం 1751 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగం ఫైనల్‌లో నుయెన్ తుయ్ ట్రాంగ్ (వియత్నాం) పసిడి దక్కించుకోగా, మను రజతం, ఇషా కాంస్యంతో సరిపెట్టుకుంది. మొత్తంగా ఈ ఆసియా చాంపియన్‌షిప్‌లో ఇషా మూడు స్వర్ణాలు, ఒక కాంస్యం సాధించడం విశేషం.

సఫారీల దూకుడు

- మార్‌క్రమ్ అర్ధసెంచరీ
- కెనడాపై ఘనవిజయం

టీ20 వరల్డ్‌కప్



అహ్మదాబాద్: టీ20 వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా తమ ఆరంభ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంది. కెప్టెన్ మార్‌క్రమ్ (32 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్‌తో 59) బ్యాటింగ్‌లో చెలరేగగా.. పేసర్ ఎన్‌గిడి (4/31) కెనడాను కట్టడి చేశాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సఫారీలు 57 రన్స్ తేడాతో విజయం సాధించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగులు చేసింది. మిల్లర్ (39 నాటౌట్), స్టబ్స్ (34 నాటౌట్), రికెల్టన్ (33), డికాక్ (25) సహకరించారు. స్పిన్నర్ అన్ష్ పటేల్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కెనడా ఏమాత్రం పోటీనివ్వలేదు. దీంతో 20 ఓవర్లలో 8 వికెట్లకు 156 రన్స్ చేసి ఓడింది. నవ్‌నీత్ (64),హర్ష్ (33) రాణించారు. యాన్సెన్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎన్‌గిడి నిలిచాడు.

ఆరంభం.. ముగింపు అదుర్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు మార్‌క్రమ్, డికాక్ మెరుపు ఆరంభాన్ని అందించారు. అయితే మధ్య ఓవర్లలో స్పిన్నర్ అన్ష్ పటేల్ సఫారీల జోరుకు బ్రేక్ వేసినా.. చివర్లో మిల్లర్-స్టబ్స్ బ్యాట్లు ఝుళిపించారు. ఇన్నింగ్స్ రెండో ఓవర్ నుంచే మార్‌క్రమ్ బౌండరీలతో కదం తొక్కగా, డికాక్ సైతం జోరు చూపాడు. దీంతో పవర్‌ప్లేలోనూ స్కోరు 66కి చేరింది. కానీ ఆ వెంటనే డికాక్ వికెట్ కోల్పోగా తొలి వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం రికెల్టన్‌తో కలిసి మార్‌క్రమ్ రన్‌రేట్‌ను తగ్గకుండా చూశాడు. ఈ ధాటికి పదో ఓవర్‌లోనే స్కోరు వంద దాటింది. అటు మార్‌క్రమ్ 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఈ దశలో స్పిన్నర్ అన్ష్ పటేల్ తన వరుస రెండు ఓవర్లలో మార్‌క్రమ్, రికెల్టన్, బ్రెవిస్ (6) వికెట్లతో ఝలక్ ఇచ్చాడు. దీంతో క్రీజులో ఉన్న స్టబ్స్, మిల్లర్ ఆచితూచి ఆడాల్సి వచ్చింది. చివరకు 18వ ఓవర్‌లో స్టబ్స్ 4,6తో స్కోరు కాస్త కదిలింది. 20వ ఓవర్‌లో మిల్లర్ 3 సిక్సర్లతో 21 రన్స్ అందించి స్కోరును 200 దాటించాడు. అలాగే ఈ జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 75 పరుగులు సమకూర్చగా.. ఆఖరి 18 బంతుల్లోనే 47 పరుగులు రాబట్టింది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 213/4. (మార్‌క్రమ్ 59, మిల్లర్ 39 నాటౌట్, స్టబ్స్ 34 నాటౌట్, రికెల్టన్ 33, డికాక్ 25; అన్ష్ 3/31) **కెనడా:** 20 ఓవర్లలో 156/8 (నవ్‌నీత్ 64, హర్ష్ 33; ఎన్‌గిడి 4/31, యాన్సెన్ 2/30)

ఊహించినట్టే..

- గ్రేడ్ 'బి'కి రోహిత్, విరాట్
- శ్రీచరణికి తొలిసారి చోటు
- బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టులు

న్యూఢిల్లీ: ఊహించినట్టుగానే బీసీసీఐ కేంద్ర కాంట్రాక్టుల్లో సూపర్ సీనియర్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల గ్రేడ్‌లు తగ్గించారు. సోమవారం ప్రకటించిన వార్షిక కాంట్రాక్టుల జాబితాల్లో రో-కోను గ్రేడ్ 'బి'లో చేర్చారు. అలాగే..ఏడు కోట్ల వేతనంతో కూడిన 'ఎ' ప్లస్ విభాగాన్ని బోర్డు రద్దు చేసింది. గ్రేడ్ 'ఎ', 'బి', 'సి' కేటగిరిలలో కలిపి మొత్తం 30 మంది పురుష క్రికెటర్లు, 21 మంది మహిళా క్రికెటర్లకు కాంట్రాక్టులు ఇచ్చింది. గ్రేడ్ 'ఎ' ఆటగాళ్లకు ఐదు కోట్లు, 'బి' గ్రేడ్‌కు రూ. మూడు కోట్లు, 'సి' గ్రేడ్‌కు రూ. కోటి చెల్లించనున్నట్టు సమాచారం. తెలుగు క్రికెటర్, స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణికి తొలిసారి కాంట్రాక్టుల జాబితాలో చోటు లభించింది.


గ్రేడ్ 'ఎ' (రూ. 5 కోట్లు): శుభ్‌మన్ గిల్, బుమ్రా, రవీంద్ర జడేజా; **గ్రేడ్ 'బి' (రూ. 3 కోట్లు):** రోహిత్, విరాట్, సూర్యకుమార్, పంత్, హార్దిక్, జైస్వాల్, రాహుల్, సిరాజ్, కుల్దీప్, వాషింగ్టన్ సుందర్, శ్రేయాస్; **గ్రేడ్ 'సి' (రూ. 1 కోటి):** తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, వరుణ్, రింకూ సింగ్, శివమ్ దూబే, సంజూ శాంసన్, అర్ష్‌దీప్, అభిషేక్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, ధ్రువ్ జురెల్, హర్షిత్ రాణా, ఆకాశ్, ప్రసిద్ధ్, అక్షర్, సాయి సుదర్శన్

మహిళలు: గ్రేడ్ 'ఎ'(రూ. 50 లక్షలు) హర్మన్ ప్రీత్, స్మృతి మంధాన, దీప్తీశర్మ, జెమీమా **గ్రేడ్ 'బి' (రూ. 30 లక్షలు):** షఫాలీ, రిచా ఘోష్, రేణుకా సింగ్, స్నేహ్ రాణా

గ్రేడ్ 'సి' (రూ. 10 లక్షలు): శ్రీచరణి (తొలిసారి), కమలిని, ప్రతికా రావల్, అరుంధతి రెడ్డి, రాధా యాదవ్, యాస్తికా భాటియా, క్రాంతి గౌడ్, తేజల్, అమన్‌జోత్, ఉమా ఛెత్రి, హర్లీన్, కశ్వీ గౌతమ్, వైష్ణవి శర్మ.

మున్సీ, లీస్క్ మెరుపులు

ఇటలీపై స్కాట్లాండ్ గెలుపు




కోల్‌కతా: జార్జ్ మున్సీ (54 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సలతో 84) మెరుపు హాఫ్ సెంచరీ..మైకేల్ లీస్క్ (5 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలతో 22 నాటౌట్, 4/17) ఆల్‌రౌండ్ షోతో టీ20 ప్రపంచ కప్‌లో స్కాట్లాండ్ బోణీ కొట్టింది. గ్రూప్ 'సి' తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిన స్కాట్లాండ్..సోమవారం 73 పరుగులతో ఇటలీపై విజయం సాధించింది. మొదట స్కాట్లాండ్ 20 ఓవర్లలో 207/4 స్కోరు చేసింది. మున్సీ, మైకేల్ జోన్స్ (37) తొలి వికెట్‌కు 83 బంతుల్లో 126 పరుగులతో స్కాట్లాండ్‌కు అదిరే ఆరంభం ఇచ్చారు. బ్రండన్ మెక్‌ములెన్ (18 బంతుల్లో 4 ఫోర్లతో 41 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్ చేయడంతోపాటు కెప్టెన్ రిచీ బేరింగ్టన్ (15)తో మూడో వికెట్‌కు 48 పరుగులు జత చేశాడు. చివర్లో లీస్క్ ఇటలీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. భారీ ఛేదనలో..వరల్డ్ కప్ అరంగేట్ర ఇటలీ జట్టు ప్రత్యర్థికి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. 16.4 ఓవర్లలో 134/9 పరుగులకు పరిమితమై ఓడింది. ఫీల్డింగ్‌లో గాయపడిన ఇటలీ కెప్టెన్ వేన్ మాడ్సన్ బ్యాటింగ్‌కు రాలేదు. మైకేల్ లీస్క్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సుదీప్ ట్రిపుల్ మిస్

బెంగాల్ 629 ఆలౌట్
ఆంధ్రతో రంజీ క్వార్టర్‌ఫైనల్

కళ్యాణి (పశ్చిమబెంగాల్): వన్ డౌన్ బ్యాటర్ సుదీప్ కుమార్ ఘరామీ (299) త్రుటిలో త్రిశతకం కోల్పోగా..ఆంధ్రతో రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 629 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 64/3 స్కోరు చేసింది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 295 రన్స్ చేసింది. కిందటి రోజు 216 పరుగులతో ఆడుతున్న సుదీప్ 299 స్కోరు వద్ద రషీద్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఇక..మరో క్వార్టర్‌ఫైనల్లో కర్ణాటక నాలుగు వికెట్లతో ముంబైకి షాకిచ్చింది. ఇంకో క్వార్టర్స్‌లో జమ్మూ కశ్మీర్ 56 పరుగులతో మధ్యప్రదేశ్‌ని ఓడించింది.

చరిత్ర పుటల్లో..: మూడు రోజులు..930 నిమిషాలు ఓపిగ్గా క్రీజులో నిలిచిన సుదీప్ కుమార్ 596 బంతులు ఎదుర్కొని 31 ఫోర్లు, 6 సిక్సలతో 299 రన్స్ చేశాడు. ఈ క్రమంలో పలు రికార్డులను అతడు తిరగ రాశాడు. ట్రిపుల్ సెంచరీకి ఒక పరుగు దూరంలో నిష్క్రమించిన తొలి భారత బ్యాటర్‌గా, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఓవరాల్‌గా మూడో ఆటగాడిగా ఖ్యాతి గాంచాడు.





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్



అమరావతిలో 41 కంపెనీలు

- రూ.48,711 కోట్ల పెట్టుబడులు
- 41,625 మందికి ఉద్యోగ అవకాశాలు
- ఎంఓయూలు.. ఎస్‌ఐపీబీ ఆమోదం పూర్తి
- రాజధానిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం !
- 4,500 ఎకరాల్లో.. రూ.4,700 కోట్ల వ్యయంతో నిర్మాణం
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో నివేదిక

10

వీఐపీ.. ఉచితాల్లేవ్..



- కోటప్పకొండ వీఐపీ పాసులకు చెల్లుచీటి
- రూ. 300 వీఐపీ దర్శనం టిక్కెట్‌ల విక్రయం
- నేటి నుంచి అన్‌లైన్‌లో విక్రయాలకు ఏర్పాట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహాశివరాత్రి పండుగనాడు కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్లలో టిక్కెట్‌ల విధానంలో దేవస్థానం మార్పులు తీసుకొచ్చింది. సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సారి వీఐపీ ఉచిత పాసులను దేవస్థానం రద్దు చేసింది. ఇప్పటి వరకు ఏడాదికి 10 వేల వీఐపీ ఉచిత పాసులు ముద్రించి రాజకీయ నేతలు పంచుకునేవారు. మరో 10 వేలు ఫేక్ పాసుల పంపిణీ కూడా జరిగేది. ఈ క్యూ లైన్‌లను అధికారం పార్టీ నేతలే నిర్వహించేవారు. దీంతో సామాన్య భక్తులు ఇక్కట్లు ఎదుర్కొనేవారు. ఈ సారి సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా వీఐపీ (మిగతా 10వ పేజీలో)

ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఏపీ టెంపుల్స్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి టిక్కెట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వీఐపీ దర్శనం టిక్కెటు రూ. 300 చెల్లించి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకోవాలి. అలాగే రూ. 500 అభిషేకం, రూ. 200 శీఘ్ర దర్శనం, రూ. 100 ప్రత్యేక దర్శనం టిక్కెట్‌లు కూడా ఆన్ లైన్‌లోనే విక్రయాలు జరుగనున్నాయి. తిరునాళ్ల రోజున దేవస్థానం కౌంటర్‌లలోనూ టిక్కెట్‌లు విక్రయించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రూ 300 టిక్కెట్ కొనుగోలు చేసిన వారికి దర్శనానికి టైం స్లాట్‌కేటాయింపు చేయనున్నారు. అభిషేకం రూ 500 టిక్కెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్ విక్రయాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈవో చంద్రశేఖరరావు కోరారు.

జిల్లా స్థూల దేశీయోత్పత్తిలో గుంటూరు రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచింది. 2024-25 ప్రథమ రివైజ్డ్ ఎస్టిమేట్స్ ప్రకారం రూ.73,632 కోట్ల విలువైన వస్తువులు ఇక్కడ ఉత్పత్తి జరిగింది. ఇది రాష్ట్ర వాటాలో 9.95 శాతంగా ఉంది. 2025-26 ఫస్టు అడ్వాన్స్‌డ్ ఎస్టిమేట్స్ ప్రకారం రూ.83,618 కోట్ల విలువ చేసే వస్తువులు గుంటూరులో ఉత్పత్తి జరగగా.. ఇది రాష్ట్ర వాటాలో 13.56 శాతంగా ఉంది. తలసరి ఆదాయం లోనూ జిల్లా ఏడో ర్యాంకులోనే కొనసాగుతోంది. 2024-25 (ఎఫ్ఆర్ఈ) తలసరి ఆదాయం రూ. 2,90,685 కాగా 2025-26(ఎఫ్ఏఈ)రూ. 3,28,534గా నమోదైంది.



వ్యవసాయ, అనుబంధ రంగాల్లో గుంటూరు జిల్లా పురోగతి నానాటికి ఆందోళనకరంగా మారుతోంది. రాష్ట్రంలో 25వ స్థానంలో కొనసాగుతుండడం పరిస్థితికి దర్పణం పడుతోంది. రూ.10,650 కోట్లతో రాష్ట్ర వాటాలో కేవలం 1.97 శాతం మాత్రమే నమోదు చేసింది.

సేవా రంగంలో.. దూసుకెళ్తున్న గుంటూరు

- జీడీవీఏలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా..
- రూ.45,324 కోట్ల విలువ జోడింపు
- పారిశ్రామిక రంగంలో ఐదో స్థానం..
- జీడీడీపీ, తలసరి ఆదాయంలో 7వ ర్యాంక్

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సేవల రంగంలో గుంటూరు జిల్లా దూసుకుపోతోంది. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల అంచనాల మేరకు సంపద సృష్టించడంలో జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచి తన సత్తా చాటింది. సోమవారం జరిగిన సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన మంత్రుల- కార్యదర్శుల మూడో సమావేశం ఇదే అంశాన్ని స్పష్టం చేసింది.

సేవల రంగంలో 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం గుంటూరు జిల్లా రూ.40,207 కోట్ల జీడీవీఏ సాధించింది. ఇది అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 13.66 శాతం అధికం. రాష్ట్ర జీడీవీఏలో 6.48 శాతం. 2025-26 అంచనాల ప్రకారం జిల్లా రూ.45,344 కోట్ల జీడీవీఏను సాధించింది. ఇది గతంతో పోలిస్తే 12.77 శాతం అధికం. రాష్ట్ర జీడీవీఏలో 6.47 శాతంగా ఉంది. పారిశ్రామిక రంగంలో 2024- 25లో జీడీవీఏ చేర్పులో 8వ స్థానంలో ఉన్న జిల్లా 2025- 26లో 5 స్థానానికి ఎగబాకింది. జీడీవీఏను ఈ ఏడాది రూ.21,090 కోట్లు సాధించింది. రాష్ట్ర జీడీవీఏలో 6.19శాతంగా ఉంది.



నైపుణ్యాభివృద్ధి.. ఉపాధి కల్పన..

కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి పథకాల అమలులో జిల్లా నిర్దేశించిన లక్ష్యాలను సాధించింది. పీఎం విశ్వకర్మ పథకం కింద 3,723 మందికి ప్రయోజనాన్ని అందజేశారు. దీన్‌దయాల్ ఉజ్వల గ్రామీణ కౌశల యోజన(డీడీయూజీకేవై) కింద 2,224 మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చి, ప్రయోజనాన్ని కల్పించారు. నైపుణ్య పోర్టల్‌లో 32 విభాగాలకు సంబంధించి 4,098 మందికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 54 జాబ్ మేళాలు నిర్వహించారు. 580 కంపెనీలు పాల్గొనగా.. 5,894 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

మంగళగిరిలో టీఎల్‌సీ ఏర్పాటు

పట్టణ ప్రాంత పేదలకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో భాగంగా మంగళగిరిలో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రభుత్వం నిర్మించింది. స్థానిక టిడ్కో ఇళ్లకు సమీపంలో టిడ్కో లైవ్లీహుడ్ సెంటర్(టీఎల్‌సీ)ని ఏర్పాటు చేశారు. జీ ప్లస్ 3 అంతస్తుల్లో షాపులను నిర్మించారు. టిడ్కో ఇళ్లలో ఉండే 1,728 కుటుంబాలకు 35 షాపులను నిర్మించారు. వీటి ద్వారా 173 మందికి ఉపాధి లభించింది. పీ- 4 పథకం అమలులో జిల్లా 21వ స్థానంలో ఉంది.

- పాఠశాలల్లో సమగ్ర సివిల్ వర్కుల పరిస్థితి కూడా జిల్లాలో ఆశాజనకంగా లేవు. 298 వర్కులను (మిగతా 8వ పేజీలో)

మరో ఆరు పన్ను చెల్లింపు కేంద్రాలు

కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఆస్తి, ఖాళీ స్థల పన్నులు, నీటి మీటర్ చార్జీలు, డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజుల చెల్లింపు కోసం గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలతో పాటుగా నగరంలో మరో 6 ప్రాంతాల్లో అదనపు పన్ను చెల్లింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని కమిషనర్ కే మయూర్ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థకు బకాయి ఉన్న పన్నులను సకాలంలో చెల్లించడం ద్వారా నగరాభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని కోరా రు. పన్ను చెల్లించడానికి అనువుగా భారత్ పేట సచివాలయం (140), ఎల్ఆర్ కాలనీ మెయిన్ రోడ్ లోని సచివాలయం (53), వసంతరాయపురంలోని సచివాలయం (148), గోరంట్ల వినాయకుని గుడివద్ద సచివాలయం (183), గుజ్జనగుండ్లలోని సచివాలయం (106), సుద్దపల్లి డొంకలోని సచివాలయం (26)ల్లో అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించామని తెలిపారు. అదనపు కౌంటర్లు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు, జీఎంసీ మెయిన్ ఆఫీస్, సర్కిల్ కార్యాలయాల్లో కౌంటర్లు ఉదయం 8 నుండి రాత్రి 7 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళికలు



- 12 నుంచి శ్రీశైలానికి సర్వీసులు ప్రారంభం
- కోటప్పకొండకు అదనంగా 90 బస్సులు
- డీపీటీవో సాంబ్రాజ్యం

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. భక్తుల రాకపోకలకు సంబంధించి అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. విభజిత గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి డి సాంబ్రాజ్యం పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఆపరేట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచే శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు ప్రారంభించనున్నారు. గుంటూరు నుంచి నేరుగా శ్రీశైలానికి బస్సులు సిద్ధం చేస్తున్నారు. అలానే కోటప్పకొండ జాతరకు కూడా గుంటూరు నుంచి 90 బస్సులు పంపుతున్నారు. అలానే జిల్లాలోని అమరావతి, గోవాడ, క్వారీలకు మహా శివరాత్రి పర్వదినం రోజున నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అమరావతికి 25 సర్వీసులు, తెనాలి, గుంటూరు నుంచి క్వారీకి 38 సర్వీసులు, గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి 34 సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు డీపీటీవో తెలిపారు.

అలానే కోటప్పకొండ జాతరకు రాకపోకలు సాగించాల్సిన భక్తులు గుంటూరు నుంచి నరసరావుపేటకు చేరుకొని అక్కడ నుంచి కొండకు బస్సులు ఏర్పాటు చేశారు. మహా శివరాత్రికి సర్వీసులను నిరంతరం పర్యవేక్షించేందుకు 20 మంది సిబ్బందిని అదనపు విధులకు కేటాయించామన్నారు. ఎక్కడా ట్రాఫిక్ అంతరాయాలు, బస్సుల రాకపోకల్లో ఇబ్బందుల్లేకుండా పర్యవేక్షిస్తారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ

మాదక ద్రవ్యాలను నివారిద్దాం

- కలెక్టర్ అన్సారియా

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను నివారించి, యువత జీవితాలను కాపాడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా సంస్థలలో మాదక ద్రవ్యాలు ప్రవేశించకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. యువత మత్తులో పడితే జీవితం చిత్తు అవుతుందని, కుటుంబాలు ఆర్థికంగా నష్ట పోతాయని, ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు 118 మందిపై కేసులు నమోదు చేశామని, గుంటూరు నగరంలో 28 హాట్ స్పాట్‌లు, 92 ఉపయోగంలో లేని భవనాలు గుర్తించామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జె.పద్మ, ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉప రవాణా కమిషనర్ సీతారామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చియార్డు నూతన పాలకవర్గం నియామకం



- చైర్మన్‌గా కుర్రా అప్పారావు
- అధికారికంగా వెలువడిన ఉత్తర్వులు
- 20న ప్రమాణ స్వీకారం

10

ఏసీబీకి చిక్కిన ఏఈ



- పంచాయతీరాజ్ శాఖలో రూ. 24 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

8

నిడమర్రు రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ

- రూ. 90.58 కోట్ల అంచనావిలువతో టెండర్లు పిలిచిన రైల్వే శాఖ
- ఈ నెల 26వ తేదీతో బిడ్డింగ్ ముగింపు

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-16 నుంచి మంగళగిరి పట్టణంలోకి ప్రవేశించి అక్కడి నుంచి నేరుగా ఎలాంటి ఆటంకం లేకుండా అమరావతి రాజధానికి చేరుకోవడానికి నిడమర్రు రైల్వేగేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిని రైల్వే శాఖ మంజూరు చేసింది. ఈ ఆర్‌వోబీకి ఇదివరకే పరిపాలన, సాంకేతిక అనుమతులు రాగా తాజాగా రైల్వే శాఖ టెండర్లను పిలిచింది. రూ. 90 కోట్ల 58 లక్షలుగా ఈ ఆర్‌వోబీ అంచనావిలువని నిర్ణయించింది. ఈ నెల 12వ తేదీ నుంచి బిడ్డింగ్‌ని ప్రారంభించి 26వ తేదీన ముగించనుంది. ఆ తర్వాత నిబంధనల మేరకు ఏజెన్సీని ఖరారు చేస్తుంది. అగ్రిమెంట్ అయిన తర్వాత నుంచి 18 నెలల్లో ఈ బ్రిడ్జీ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందన్న షరతుని కూడా టెండర్ నోటిఫికేషన్‌లో పొందుపరిచింది. ఈ బ్రిడ్జి నిర్మాణం వలన మంగళగిరి నుంచి నిడమర్రుకు చేరుకోవడానికి రైల్వేగేటు వద్ద గంటల తరబడి పడిగాపులు పడాల్సిన అవసరం ఉండదు.

గుంటూరు - విజయవాడ రైలుమార్గంలో నంబూరు - మంగళగిరి మధ్యన 14వ నంబరు లెవల్ క్రాసింగ్ గేటు నిడమర్రు వద్ద ఉన్నది. ఈ రైలుమార్గం రెండు వరసలు కావడం, గుంటూరు, న్యూగుంటూరు రైల్వేస్టేషన్ల వైపు నుంచి రైళ్లు, గూడ్స్ రైళ్లు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తోండటంతో నిడమర్రు రైల్వే గేటుని తరచుగా మూసేయాల్సి వస్తోన్నది. ఒకసారి గేటు పడిన మళ్లీ ట్రాఫిక్ క్లియర్ కావడానికి సమయం పడుతున్నది. అలానే అమరావతి రాజధాని పనులు జోరందుకోవడంతో వాహనాల కదలికల సంఖ్య బాగా పెరిగిపోయింది. ఎస్ఆర్ఎం, విట్ వంటి యూనివర్శిటీలు ఉండటంతో బస్సులు కూడా ఎక్కువ సంఖ్యలోనే రాకపోకలు సాగిస్తోన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం ఇక్కడ ఆర్‌వోబీని నిర్మించాల్సిందిగా రైల్వే శాఖని కోరింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని కూడా ఈ విషయంలో చొరవ తీసుకోవడంతో ఆర్‌వోబీ మంజూరైంది. ఈ ఆర్‌వోబీ భూసేకరణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. టెండర్లు పిలిచిన నేపథ్యంలో ఏజెన్సీ ఖరారు కాగానే మంత్రి లోకేశ్ చేతుల మీదగా శంకుస్థాపన చేయించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రశ్నకు దొరకని ఆధారం

నత్తనడకన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే



- గుంటూరులో 52.2 శాతం పూర్తి
- బాపట్లలో 53.4, పల్నాడులో 36.9 శాతం నమోదు
- లక్షల్లో కనిపించని పౌరుల చిరునామా
- ఆధారాలు ఇవ్వడానికి ప్రజల నిరాకరణ

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఉమ్మడి గుంటూరు జిల్లాలో నత్తనడకన సాగుతోంది. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి ప్రశ్నావళి ఇచ్చి అధికార యంత్రాంగం పంపించగా.. వాళ్లు అడుగుతున్న ప్రశ్నలు చూసి ప్రజలు సమాధానం చెప్పడానికి తటపటాయిస్తున్నారు. ఆధారాలు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. ఇక సిబ్బంది వద్ద ఉన్న డేటా ప్రకారం ఇళ్ల వద్దకు వెళితే చాలామంది అక్కడ నివాసం ఉండటం లేదు. దీంతో మిస్సింగ్ పౌరుల సంఖ్య గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కలిపి లక్షల్లో ఉంది. మరోవైపు సిబ్బందిని ఇతరత్రా విధులకు అధికారులు వినియోగిస్తుండటంతో సర్వే (మిగతా 10వ పేజీలో)

ప్రతి పౌరుడి వద్దకు వెళ్లి ఉన్నత విద్యార్హత, ఆదాయపు పన్ను, కులం, నివాస, వివాహ ధ్రువీకరణ, స్కిల్ సర్టిఫికెట్, ఆదాయ మార్గం, ప్రస్తుత, శాశ్వత చిరునామ, ఆస్తి పన్ను డాక్యుమెంట్, వాటర్, ఎల్‌పీజీ కనెక్షన్, విద్యుత్ కనెక్షన్ బిల్లులు, ప్రస్తుతం చదువుతున్నట్లు అయితే అందుకు తగిన ధ్రువపత్రాన్ని కోరుతున్నారు. అయితే వీటిల్లో రెండు, మూడింటికి తప్పితే తాము ఎట్టి పరిస్థితుల్లో ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వ బోమని ముఖానే చెబుతున్నారు. ఇప్పటి వరకు 83,520 మంది మ్యాపింగ్ సక్రమంగా జరగలేదని తేలింది. 22,917 మంది రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోగా, 14,728 మంది వేరే రాష్ట్రాలకు వెళ్లిపోయారు.

ఉత్కంఠగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● ఆరుపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా ఎడ్లజత ప్రథమం



ప్రథమస్థానం సాధించిన పల్నాడు జిల్లా ఎడ్లజత

దుర్గి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వార్షిక మహోత్సవాలను పురస్కరించుకొని దుర్గిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన ఆరుపళ్ల విభాగం పోటీల్లో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3,523 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ప్రకాశం జిల్లా ఎద్దనపూడికి చెందిన మేస్త్రీ ఖాదర్ మస్తాన్ బుల్స్, గుంటూరు జిల్లా పెద కాకానికి చెందిన అల్లా రాజేష్ యాదవ్ సంయుక్త ఎడ్లజత 3,250 అడుగులతో రెండోస్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం బ్రహ్మబొట్లపాలెంకు చెందిన పాలెం వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం ఏల్చూరుకు చెందిన శ్యావలి గోపికృష్ణ ఎడ్లజత 3,240 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3,231 అడుగులతో నాలుగోస్థానం, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పి.జయంత్‌కుమార్, నంద్యాల జిల్లా మిడుతూరు మండలం చింతపల్లికి చెందిన వేల్పుల ఇబ్రాయేలు సంయుక్త ఎడ్లజత 3,016 అడుగులతో ఐదోస్థానం దక్కించుకున్నాయి. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించారు. నిర్వాహకులు కటకం రామారావు, గండె గోపాలరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దుర్గి మార్కెట్‌యార్డు చైర్మన్ లింగా బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు జక్కెంపూడి జానకిరామయ్య, మారుగుండ్ల వేణుగోపాలరావు, గాలి శ్రీనివాసరావు, బొజ్జా నరసింహారావు, శెట్టిపల్లి నరసింహారావు, వంకమళ్ల కోటేశ్వరరావు, కోటా వీరయ్యచౌదరి పాల్గొన్నారు.

● నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

మాచవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాచవరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యల 21వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ వారు సోమవారం తెలిపారు. 10న పాల పళ్ళ విభాగంలో, 11న జత పళ్ళ, న్యూ క్యాటగిరి విభాగాలలో, 12న సబ్ జూనియర్ విభాగంలో ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సబ్ జూనియర్స్‌లో మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.25వేలు, ఐదో బహుమతి రూ.20వేలు, ఆరో బహుమతి రూ.15వేలు, ఏడో బహుమతి రూ.12వేలు నగదుతో పాటు షీల్డ్ బహుకరిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారు.

ముగిసిన సమగ్ర పోషక యాజమాన్యం కోర్స్



సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డా.ఎన్‌వీవీఎస్. దుర్గాప్రసాద్, డా. జి.శివనారాయణ, తదితరులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏరువాక కేంద్రం గుంటూరులో నిర్వహించిన 15 రోజుల సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికేట్ కోర్స్ సోమవారం ముగిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి 30 మంది వెస్టిజ్ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. ముఖ్య అతిథి విస్తరణ సంచాలకులు డా. జి.శివనారాయణ మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను రైతులకు చేరవేయాలని సూచించారు. ఈ కోర్సులో ఉత్తీర్ణులైన సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సహాయ పరిశోధన సంచాలకులు డా.ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, వెస్టిజ్ ఏరియా మేనేజర్ ఎస్.ఆనంద్ ప్రసాద్, వ్యవసాయ అధికారి మంగమ్మ, ఏరువాక కేంద్రం గుంటూరు సమన్వయకర్త డా. ఏ.మనోజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ రథాలపై ఎంపీడీవోలకు అవగాహన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ రథాలపై ఎంపీడీవోలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతి బసు తెలిపారు. ఈ కార్యక్రమం మంగళవారం గుంటూరులోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జరగనుందని చెప్పారు. ఈ సమావేశానికి ఎంపీడీవోలు తప్పనిసరి హాజరు కావాలని స్పష్టం చేశారు. స్వచ్ఛత కార్యక్రమాల అమలులో స్వచ్ఛ రథాల వినియోగం, నిర్వహణపై ఎంపీడీవోలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని సీఈవో జ్యోతిబసు తెలిపారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

దాచేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8వ తరగతుల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ పరమేశ్వరరావు సోమవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు మార్చి 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

13న మంగళగిరిలో మెగా జాబ్ మేళా

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో జరుగుతున్న ఈ జాబ్ మేళాలో 15కు పైగా కంపెనీలు పాల్గొంటాయని, మొత్తం 590 ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదువుకున్న 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సున్న అభ్యర్థులు ఆధార్, సర్టిఫికెట్లు, ఫోటోలు, బయోడేటాతో నేరుగా ఇంటర్వ్యూకు హాజు కావొచ్చన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. అభ్యర్థులు నైపుణ్యం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, జాబ్ మేళా రోజు కూడా ప్రత్యక్ష రిజిస్ట్రేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9966788993, 80745 97926నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చైన్ స్నాచర్‌ను పట్టించిన డ్రోన్

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి వైకుంఠపురంలోని భవఘ్ని ఆరామానికి వస్తున్న ఓ మహిళ మెడలో చైన్‌ను లాక్కొని బైక్‌పై పారిపోయిన చైన్‌స్నాచర్‌ను స్థానికులు డ్రోన్‌ను ఉపయోగించి వెంటాడి పట్టుకున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజుల క్రితం నర్సరావుపేటకు చెందిన ఓ వృద్ధురాలు వైకుంఠపురంలో బస్సు దిగి భవఘ్నిఆరామానికి నడిచి వెళ్తుండగా వెనుక నుంచి హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చిన యువకుడు ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కుని బైక్‌పై పారిపోయాడు. ఇది గమనించిన స్థానికులు అతనిని వెంబడించారు. కొంత దూరం పోయిన తరువాత బైక్‌ను వదిలివేసి సమీపంలోని పొలాల్లోకి పారిపోయాడు. గ్రామస్థులు స్థానిక ఫొటోగ్రాఫర్ వద్దనున్న డ్రోన్ కెమేరా ఉపయోగించి దొంగ పారిపోయిన వైపు పర్యవేక్షణ చేసి పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తి గుంటూరు సమీపంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఇమ్మడబత్తిన నాగార్జునగా గుర్తించారు.

గురుకులంలో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

అచ్చంపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని అచ్చంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం చేరాలనుకునే విద్యార్థులు ఈ నెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, జిల్లా నాయకులు పాటిబండ్ల బాపిరాజు, అంబటి నారాయణ, శాఖమూరి బాజీ, ఏసుపోగు నాగయ్య, కోట చంటి తదితరులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర


● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130 , 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

మిర్చియార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	94,459	
అమ్మకాలు	90,847	
నిల్వ	18,299	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	22500
273	14000	22000
341	14000	25500
4884	----	----
సూపర్ 10	----	------
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15000	27000
ఆర్మూరు	13000	18000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21500
నెంబరు. 5	13000	21000
273	----	----
341	14000	24000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	24500
దేవనూరు డీలక్స్	----	-------
తాలుకాయలు	7200	12000

సేవా రంగంలో.. దూసుకెళ్తున్న గుంటూరు

(7వ పేజీ తరువాయి)

మంజూరు చేశారు. వీటిల్లో 99 మాత్రమే పూర్తి అయ్యాయి. 137 వివిధ దశలలో ఉండగా, 62 అసలు ప్రారంభానికే నోచుకోలేదు. అక్షరాంధ్రలో గుంటూరు జిల్లా ర్యాంకు కాస్తంత మెరుగ్గా ఉంది. 568 సచివాలయాల్లో 9043 వలంటీర్ టార్గెట్ కాగా ఇప్పటి వరకు 7455 మంది రిజిష్టర్ అయ్యారు. 90,426 మందిని ఈ కార్యక్రమం కిందికి తీసుకు రావాల్సి ఉండగా 68,709 మందితో రిజిష్టర్ చేయించారు.

● రైలు కనెక్టివిటీ ప్రాజెక్టులపై కలెక్టర్ దృష్టి సారించాలి

రైలు కనెక్టివిటీ ప్రాజెక్టులు ఎంతో కీలకమని ప్రభుత్వం స్పష్టం చేసింది. కలెక్టర్ దృష్టి సారించి అనుమతులు, భూసేకరణ చేయించాలంది. ప్రాజెక్టులు 62 కాగా 30 మంజూరయ్యాయని, ఇంకా 32 పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వీటిపై దృష్టి పెట్టాలని సూచించింది. గుంటూరు మిర్చి, మంగళగిరి చీరలు, ఫ్యాబ్రిక్స్‌కి బ్రాండింగ్ చేయాలని, బయో-సీబీజీ ప్లాంట్ టెండర్లను త్వరగా ఖరారు చేయాలని సూచించింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాన్ని గుంటూరులో నెలకొల్పాలని ఆదేశించింది. స్వర్ణ పంచాయతీ పన్ను వసూళ్ల లక్ష్యంలో కేవలం 32 శాతం మాత్రమే చేయడంతో 16వ స్థానంలో ఉంది. నిధులు ఖర్చు చేయడంలో గుంటూరు జిల్లా స్థానంలో నిలిచింది. రూ.154 కోట్లకు రూ. 138 కోట్లు వివిధ పనులకు ఖర్చు చేశారు. మహిళ సాధికారతలో భాగంగా గుంటూరు, సత్తెనపల్లిలో చాయ్ రాస్తాలు ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది. గుంటూరులో పచ్చళ్ల క్లస్టర్‌ని మరింతగా అభివృద్ధి చేయాలని ఆదేశించింది. ఇప్పటికే ఎంవోయూ జరిగిన ప్రాజెక్టులను మార్చిలో జరిగే ఎస్ఐపీసీ - ఎస్ఐపీబీ మీటింగ్ అజెండాలో చేర్చనున్నారు. కెమ్‌వోల్ట్ గ్లోబల్ సంస్థ రూ.2,500 కోట్ల పెట్టుబడి, 4 వేల ఉద్యోగాలు, స్నేహ ఫార్మ్ సంస్థ రూ. 450 కోట్ల పెట్టుబడి, ఐటీసీ అగ్రి బిజినెస్ డివిజన్ రూ. 380 కోట్లతో 480 మందికి ఉద్యోగాలు, విశ్వనాథ్ ఎవెన్యూస్(థ్రిల్ సిటీ)ని రూ.51.5 కోట్లతో ఏర్పాటు చేయనుంది. వీటన్నింటిని బోర్డు మీటింగ్‌లో ఆమోదించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తల్లికి తెలియకుండానే భూమి రిజిస్ట్రేషన్

● వీఆర్‌వో అండతో కొడుకు చేతివాటం

చేబ్రోలు, ఫిబ్రవరి 09 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పేరుతో వేలిముద్ర వేయించుకుని తల్లికి తెలియకుండా తండ్రి రాసిన భూమిని కొడుకు తన పేరు మీద మార్చుకున్నాడు. ఈ ఘటన చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం, సుద్దపల్లి గ్రామానికి చెందిన ఆమె భర్త పేరయ్య నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. ఆయన పేరిట 83 సెంట్ల పొలం ఉంది. మంగమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు నాగరాజు ఉన్నారు. కాగా, తనకున్న పొలంలో కొంత భాగాన్ని తన రెండో కుమార్తె కుమారుడికి ఇవ్వాలని మంగమ్మ నిర్ణయించుకుంది. తల్లి తీసుకున్న ఈ నిర్ణయం కుమారుడు నాగరాజుకు నచ్చలేదు. ఎలాగైనా ఆ భూమికి తన వశం చేసుకోవాలని పథకం రచించాడు. తన బాబాయి శ్రీనివాసరావు, స్థానిక వీఆర్‌వో సహాయంతో నాటకానికి తెరలేపాడు. కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని, అందుకోసం సంతకాలు, వేలిముద్రలు అవసరమని తల్లిని, సోదరీమణులను కార్యాలయానికి తీసుకువెళ్లి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, ఆన్‌లైన్‌లో భూమి మొత్తం తన పేరు మీదకు వచ్చేలా మార్చుకున్నాడు. ఇటీవలే పొలం తన పేరు మీద లేదని తెలుసుకున్న మంగమ్మ మోసపోయానని గ్రహించింది. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. తనకు చెందాల్సిన ఆస్తిని తనకు దక్కేలా చూడాలని అధికారులను వేడుకుంది. దీనిపై స్పందించిన అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం 538.80 అడుగులు ఉంది. ఇది 185.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7,934 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు మొత్తం ఔట్‌ఫ్లోగా 20,034 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 12,864 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

5800 మిర్చి టిక్కీలు అమ్మకం

దాచేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 6,300 మిర్చి టిక్కీలు చేరుకోగా 5,800 అమ్ముడయ్యాయి. 334వ రకం రూ.10వేలు నుంచి రూ 22వేలు, తేజా రకం రూ.9వేల నుంచి రూ.19వేలు, తాలు గాయాలు రూ.3వేల నుంచి రూ.9వేలకు అమ్ముడు పోయాయి.

గుంటూరు సిటీ వార్తలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

17న నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ పంపిణీ

- కలెక్టర్ అన్సారియా వెల్లడి.. పోస్టర్ల ఆవిష్కరణ
- 4.72 లక్షల మందికి మాత్రల పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల దినోత్సవం (డీ వార్మింగ్ డే) ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో డీ వార్మింగ్ డే పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 17న ఉచితంగా ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ మాత్ర సేవనం ద్వారా నులిపురుగుల సంక్రమణ సులభంగా నిర్మూలించవచ్చని ఆమె వివరించారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వయసు కలిగిన 4,71,937 మంది చిన్నారులు, బాల బాలికలు, యువతీ, యువకులకు ఈ మాత్రలు అందజేస్తామని ఆమె వెల్లడించారు. 17న ఈ మాత్రలు తీసుకోలేని వారి కోసం ఫిబ్రవరి 24న మాపప్ కార్యక్రమం నిర్వహించి ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని కలెక్టర్ అన్సారియా తెలిపారు. నులిపురుగులు శరీరంలో ఉంటే పోషకాహార లోపం, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలుగుతాయని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ కే మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా వెట్టి చాకిరి వ్యవస్థ (బాండెడ్ లేబర్) నిర్మూలనపై కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని సోమవారం కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెట్టి చాకిరి వ్యవస్థ ఒక సామాజిక దురాచారమన్నారు. ఈ చట్టంపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా బలవంతపు కార్మిక వ్యవస్థ, అప్పుల బానిసత్వం వంటి ఘటనలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ కలిసి వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలీ, కార్మిక శాఖ ఉప కమిషనర్ ఏ.గాయత్రీదేవి, ఐసీడీఎస్ పీడీ వి.ప్రసూన, డీఎస్పీ నాగ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉబర్ తరహాలో డ్రోన్ సేవలు: కలెక్టర్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ఉబర్ తరహాలో డ్రోన్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఈ మేరకు రైతుల అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉబర్ క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలను పొందవచ్చన్నారు. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు డ్రోన్ ద్వారా చల్లడం వంటి ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. డ్రోన్ వినియోగం వలన సమయం, కూలీల ఆదా అవుతుందని అన్నారు. సమీప ప్రాంతంలోని అద్దెకు డ్రోన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ముక్కామల శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజ్జాడిది విజయలక్ష్మి, ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలో లేని వస్తువులను తొలగించాలి

- అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నక్యాంటీన్ల పరిసరాల్లో వినియోగంలో లేని వస్తువులను తొలగించి, శుభ్రత పాటించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. నల్లచెరువు మెయిన్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను సోమవారం కమిషనర్ పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని అన్న క్యాంటీన్లలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి, ఆహార నాణ్యత, రుచిపై ఆరా తెలుసుకొని, సమస్యలు ఉంటే తెలియచేయడానికి ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ కే మయూర్ అశోక్

నూరు శాతం తడిపొడిగా వ్యర్థాల సేకరణ చేయాలి

నగరంలో ప్రతి ఇంటి నుంచి నూరు శాతం తడి, పొడిగా వేర్వేరుగానే వ్యర్థాలు సేకరణ చేయాలని, ప్రజలు కూడా వేరుగా ఇచ్చి సహకరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు. ఆయన సోమవారం 14, 19 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు సేకరణ జరుగుతున్న వ్యర్థాలను ఏటుకూరు రోడ్డులోని వేయింగ్ మెషిన్ ద్వారా తూకం చెక్ చేస్తారని, కాని ఎక్కువ డివిజన్ల నుంచి నిర్దేశిత లక్ష్యం కంటే తక్కువ రావడం గమనించామని, అంటే ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణ సమర్థవంతంగా జరగడం లేదని తెలుస్తుందన్నారు. మంగళవారం నుంచి ఎంహెచ్‌ఓ, వెహికిల్ షెడ్ డీఈఈలు ఏ వార్డు నుంచి వస్తున్న వాహనంలో తక్కువ చెత్త వస్తుంది రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. కమర్షియల్ చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, సదరు ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సేకరణ సక్రమంగా చేయకుంటే చర్యలు తీసుకుంటామని తెలియచేయాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌లో పెండింగ్ అభివృద్ధి పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. పర్యటనలో సీపీ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ, ఈఈలు విష్ణు, వేణు, డీసీపీ సూరజ్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆపరేషన్, విజిలెన్స్ సిబ్బంది తనిఖీలు

- రూ. 5.44 లక్షల అపరాధ రుసుం విధింపు

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు టౌన్-1 డివిజన్ పరిధిలోని డి 8 సెక్షన్ పరిధిలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ బృందాలు సోమవారం విస్తృత తనిఖీలు చేశాయి. సెక్షన్ పరిధిలోని కృష్ణనగర్, లక్ష్మీపురం, బృందావన్‌గార్డెన్స్‌లో 57 మంది అధికారులు, 161 మంది సిబ్బంది 57 బృందాలుగా విడిపోయి 5341 సర్వీసులను తనిఖీ చేసినట్లు డివిజన్ ఈఈ పీ హుస్సేన్‌ఖాన్, డీపీఈ ఈఈ ఎస్ఏ కరీమ్‌లు తెలిపారు. అనుమతించిన కేటగిరికాక ఇతర కేటగిరిల్లో విద్యుత్ వాడుకుంటున్న ఒకరికి రూ.5వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 102 మందికి రూ.5.39 లక్షలు మొత్తం రూ.5.44 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం అని, చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812361 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. తనిఖీల్లో ఎస్ఏవో పాశం రామిరెడ్డి, డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య, డీపీఈ డిప్యూటీ ఈఈ ఎన్.మల్లికార్జునప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, కె రవికుమార్ పలువురు సిబ్బంది ఉన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- డీఆర్వో ఖాజావలీ
- పీజీఆర్ఎస్‌కు 466 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు


గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందిన ఆర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను డీఆర్వో ఖాజావలీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ కలెక్టర్ గంగరాజుతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్‌లో 109 ఇతర సమస్యలపై 357 మొత్తం 466 అర్జీలు అందాయి. డీఆర్వో ఖాజావలీ మాట్లాడుతూ ఆన్‌లైన్, విడిగా అందుతున్న ప్రతి అర్జీపై ఆడిట్ పక్కాగా జరగాలని స్పష్టం చేశారు. రెవెన్యూ క్లినిక్‌లో వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీహరి, ఐసీడీఎస్ పీడీ జ్ఞాన ప్రసూన, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

● కాకాని మండలంలో, చినకాకాని వద్ద ఉన్న వక్ఫ్ భూముల్లో ఇండస్ట్రియల్ ఐటీ పార్క్ ఎకనామిక్ కారిడార్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేఖిస్తున్నట్టు వైసీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా తెలిపారు. ఈ మేరకు వైసీపీ నాయకులతో పీజీఆర్ఎస్‌లో డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి మరీ భూములను లాక్కోవడం అప్రజాస్వామికమని అన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో వైసీపీ నాయకులు సీరజ్, షేక్ హఫీజ్‌ఖాన్, ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

● 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీలకు పెరిగిన జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో సబ్ ప్లాన్ నిధులను పెంచాలని అంబేడ్కర్ యూత్ సోషల్ సంఘాల వ్యవస్థాపకుడు డాక్టర్ రాజసుందరంబాబు కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం రూ.36 వేల కోట్లను ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతరులకు ఖర్చు చేసి ఆర్థిక అన్యాయం చేసిందన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాన్నమ, మట్టుపల్లి వీరమ్మ, అనూష, రాజకుమారి, సత్యవతి తదితరులు ఉన్నారు.

● నగర పాలక సంస్థ పాఠశాలలోని మినరల్ వాటర్ ప్లాంటులకు మరమ్మతులు చేపట్టాలని మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. ప్రతి పాఠశాలలో రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్లు పర్యవేక్షణ లేకపోవడంతో మూలనపడ్డాయని అన్నారు. రానున్న వేసవి దృష్ట్యా వాటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

● దుగ్గిరాల మండలంలో శుభం కోల్డ్ స్టోరేజ్ రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘ నాయకుడు వి.వెంకట్రామయ్య అర్జీ అందజేశారు. తొలుత రూ.10 కోట్లు చెల్లిస్తామని యాజమాన్యం అంగీకారం పత్రం అందజేశారని, ఆ తరువాత రూ.7 కోట్లు మాత్రమే చెల్లిస్తానని చెప్పారని తెలిపారు. ఇప్పుడు రూ.7 కోట్లు కూడా చెల్లించకుండా వేధిస్తున్నాడని డీఆర్వో దృష్టికి తీసుకువచ్చారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

పీజీఆర్ఎస్ ఫిర్యాదుల శాశ్వత పరిష్కారానికి చర్యలు

- నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు ప్రజలు అందించే ఫిర్యాదుల శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ ద్వారా అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, ఆక్రమణలు వంటి సమస్యల సత్వర పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 58 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 18, ఇంజినీరింగ్ విభాగం 16, రెవెన్యూ విభాగం 15, ప్రజారోగ్య విభాగం 3, ఉపా సెల్ 3, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగుల సమస్యలపై చర్చించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రానున్న బడ్జెట్ సమావేశాల్లో నిరుద్యోగుల సమస్యలపై చర్చించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలీ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారం సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల, డీఎస్సీకి ముందు టెట్ నిర్వహణ, ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నిరుద్యోగులకు రూ.3 వేలు, వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ నిరసనల్లో జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు బి.యశ్వంత్, బన్ని, అజయ్, రెహమాన్, సుభాని, ఖాసిం వలి పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులను ప్రభుత్వమే నిర్వహించాలి



మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విద్యుత్ బస్సులను ఆర్టీసీ సంస్థే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంఈ బస్సు పేరుతో ప్రైవేటు విద్యుత్ బస్సుల నిర్వహణను పూణేకు చెందిన పినకల్ కంపెనీకి అప్పగించడంతో పాటు, డిపోలకు చెందిన 12 స్థలాలను అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదన్నారు. ఆర్టీసీకి నష్టం కలిగించే ఇటువంటి ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. సంప్రదింపులు, చర్చలు లేకుండానే విజయవాడలోని విద్యాధరపురం, గుంటూరు 2, నెల్లూరు 2, తిరుపతిలోని మంగళం డిపోలను ప్రైవేటు కంపెనీకి అప్పగించడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీనివాసరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): షూటింగ్ బాల్ అసోసియేషన్ గుంటూరు డిస్ట్రిక్ ఆధ్వర్యంలో ఈనెల 11న గుంటూరు రూరల్, లాలుపురం గ్రామంలోని కాటూరి పబ్లిక్ పాఠశాల ఆవరణలో అండర్-17 సబ్ జూనియర్ షూటింగ్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ఛైర్మన్ మార్కపూడి రవిబాబు, స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2010లోపు పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. గుర్తింపు కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో మధ్యాహ్నం రెండు గంటలకు క్రీడాకారులు హాజరవ్వాలన్నారు. వివరాలకు 86399 22978 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

పోలీస్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా పోలీసుల ప్రతిభ

- అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్‌లోని పటేల్ సింథటిక్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా పోలీస్ సిబ్బంది ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారు పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ ని మర్యాదపూర్వకంగా కలిసి తాము పాల్గొన్న క్రీడా విభాగాలు, సాధించిన పతకాల వివరాలను ఎస్పీకి వివరించారు. ఎస్పీ విజేతలను అభినందించి, శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో ఇలాంటి పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి గుంటూరు జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. షాహిదుల్లా డిస్కస్ త్రోలో బంగారు పతకం, కానిస్టేబుల్ ఎం. లక్ష్మయ్య హ్యామర్ త్రో పోటీలో వెండి పతకం, ఏఎస్ఐ ఎం.సాంబశివరావు అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని విశేష ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జీవీ రమణమూర్తి పాల్గొని విజేతలను అభినందించారు.



పోలీస్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పదో రోజుకు చేరుకున్న సహకార సంఘ ఉద్యోగుల ఆందోళన

- రోడ్లను ఊడ్చి వినూత్న నిరసన

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సహకార ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు కోరారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనలలో భాగంగా స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన ఉద్యోగుల నిరసనలు సోమవారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి. రోడ్లను ఊడ్చి ఉద్యోగులు తమ నిరసనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సహకార ఉద్యోగుల అడిగే న్యాయమైన డిమాండ్లతో ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి భారం పడదన్నారు. నిరసనల్లో భాగంగా ఈనెల 13న తలపెట్టిన కార్యాలయాల ముట్టడిలో ప్రతి ఉద్యోగి పాల్గొనాలని కోరారు. నిరసనల్లో తోట వెంకట్రామయ్య, సత్యనారాయణ, ఎర్రంశెట్టి రామచంద్రరావు, సుబ్రహ్మణ్యం, జయరామ్, అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.



రోడ్లను శుభ్రం చేస్తూ నిరసన తెలుపుతున్న సహకార సంఘ ఉద్యోగులు

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తూట్లు

- పాత భవనాల మట్టితో రోడ్డు మార్జిన్ ఫిల్ చేస్తున్న కాంట్రాక్టర్
- ఆర్టీసీ కాలనీలో అడ్డగోలుగా పనులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఏమాత్రం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు... నగరంలోని ఆర్టీసీ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తిగా నాణ్యత ప్రమాణాలు లోపించాయి. పాత కృష్ణ హోటల్ పక్క సందులో ఉన్న ఈ రోడ్డు ఎంతో ప్రాముఖ్యత చెందింది. ఈ రోడ్డు గుండా నేరుగా జియావుద్దీన్ నగర్‌లో నుంచి నందివెలుగు రోడ్డుకు చేరుకోవచ్చు. ఈ రోడ్డుకి ఇరువైపులా సైడ్ డ్రెయిన్స్ కట్టారు. రోడ్డులో సీసీ రోడ్డుకు, డ్రెయిన్‌కు మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని గ్రావెల్‌తో నింపాల్సి ఉంది. అయితే గ్రావెల్, డస్ట్‌తో కాకుండా అడ్డగోలుగా పాత భవనం తొలగించేటప్పుడు వచ్చిన మెటీరియల్, వేరే ప్రదేశాలలో డ్రెయిన్‌లు కట్టేందుకు తొలగించిన మట్టితో రోడ్డు సైడ్ ఖాళీ ప్రదేశాన్ని నింపుతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు పత్తా లేకుండా పోయారు. దీనిపై ఆర్టీసీ కాలనీ ప్రజలు ఇంజనీరింగ్ అధికారుల పనితీరు పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఆర్టీసీ కాలనీలో నాసిరకం మట్టితో రోడ్డు మార్జిన్ ఫిల్ చేస్తున్న కాంట్రాక్టర్



లా పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

సమాజంలో సేవాతత్పరత ఎంతో అవసరం

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సేవాతత్పరత ఎంతో అవసరమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరులోని పరుచూరి వీర రాఘవులు సేవా సమితి అధ్యక్షుడు పరుచూరి సంజీవరావు సౌజన్యంతో రామిరెడ్డితోటకు చెందిన వెంకటేశ్వరరావు అనే విద్యార్థికి అవసరమైన విలువైన 'లా' పుస్తకాలను సోమవారం ఆమె అందించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవా సమితులు ముందుకు వచ్చి ఇలాంటి సహాయ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరికీ హక్కు అని, ఆ దిశగా పరుచూరి వీర రాఘవులు సేవా సమితి చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయని ప్రశంసించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ చదువుపై ఆసక్తి కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. కార్యక్రమంలో కామరాజు గడ్డ కిరణ్, సాంబశివరావు, కే.సుబ్బారావు, శివ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో గుంటూరులోని మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైన పండుగ అని, ఈ నేపథ్యంలో మసీదుల వద్ద ఎప్పటికప్పుడు శానిటేషన్ సక్రమంగా ఉండేలా దృష్టి సారించాలని సూచించారు. పట్టణంలో ఆవులు రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని, ఆ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. డ్రెయినేజీల నిర్వహణలో ఎలాంటి అశ్రద్ధ వహించవద్దని చెప్పారు. ప్రతి ప్రాంతంలో తడి, పొడి చెత్త సేకరణ పక్కాగా ఉండాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో బ్లాక్ పాయింట్స్ (చెత్త నిల్వ చేసే ప్రదేశాలు) కనిపిస్తున్నాయని, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ప్రజారోగ్య అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట, సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో గోడ ప్రతులను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు, విద్యుత్ సంస్కరణ చట్టం ఉపసంహరించుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని తదితర డిమాండ్‌లతో చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున జిల్లా ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడా హనుమంతురావు, అకిటి అరుణ్‌కుమార్, జంగాల అజయ్‌కుమార్, రావుల అంజిబాబు, చిన ఆంజనేయులు, పూర్ణ, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేకేసీ లా కళాశాలలో ముగిసిన మూట్ కోర్టు పోటీలు

గుంటూరు విద్య, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ లా కళాశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న 5వ జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు ఆదివారం పొద్దుపోయాక ముగిశాయి. తమిళనాడుకు చెందిన సత్యభామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఈరోడ్ న్యాయ కళాశాల విద్యార్థులు వరుసగా మొదటి, రెండవ బహుమతులను సొంతం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి వేమన కుప్పుస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరబాబు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

ఎడ్యుకేషనల్ సొసైటీకి రూ.లక్ష విరాళం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీకి గుంటూరుకు చెందిన గుర్రం చినవీరయ్య రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం ఉదయం తెనాలి రోడ్డులోని శ్రీ మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో సొసైటీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును కలిసి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ప్రగడ రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు మంచా విజయమోహనరావు, ఉపాధ్యక్షుడు గంజి రవీంద్రనాథ్, మురుగుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉందా?

- హోం శాఖ మాజీ మంత్రి తానేటి వనిత
- గుంటూరులో అంబటి కుటుంబ సభ్యులకు పరామర్శ

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి ఘటన పరిశీలిస్తే రాష్ట్రంలో అసలు పోలీసు వ్యవస్థ ఉందా లేదా అన్న అనుమానం కలుగుతోందని మాజీ హోం మంత్రి తానేటి వనిత విమర్శించారు. ఇటీవల సీఎం చంద్రబాబును దూషించిన కేసులో అరెస్టు అయిన మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను గుంటూరులోని ఆయన గృహంలో మాజీ మంత్రి వనిత సోమవారం పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దాడి ఘటనను పరిశీలిస్తే అధికార పార్టీ నేతలు అధికార మదంతో పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులు చేయటం దుర్మార్గమని మండిపడ్డారు. పోలీసులు దగ్గరుండి దాడులు చేయించటం రాష్ట్రంలో ఇప్పుడే చూస్తున్నామని అన్నారు. అసలు రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం ఎక్కడా అమలు కావటం లేదని, కనీసం మాట్లాడే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అకృత్యాలను ప్రశ్నిస్తే అరెస్టులు, దాడులు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన మూల్యం చెల్లించుకునే సమయం కూడా దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

అమరావతిలో 41 కంపెనీలు

- రూ.48,711 కోట్ల పెట్టుబడులు
- 41,625 మందికి ఉద్యోగ అవకాశాలు
- ఎంఓయూలు.. ఎస్‌ఐపీబీ ఆమోదం పూర్తి
- రాజధానిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం!
- 4,500 ఎకరాల్లో రూ.4,700 కోట్లతో నిర్మాణం
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో నివేదిక



మంగళగిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. సోమవారం జరిగిన మంత్రులు- కార్యదర్శుల మూడో సమావేశంలో దీనిని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా విడుదల చేసిన నివేదికలో రాజధాని అమరావతిలో పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పన అంశాలపై ప్రభుత్వ కృషిని వివరించారు. అమరావతిలో 41 కంపెనీలు రాబోతున్నాయని ప్రభుత్వం తెలిపింది. ఆయా కంపెనీలు రూ. 48,711 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాయి. 41,625 మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని నివేదిక చెబుతోంది. ఇప్పటికే మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండిగ్స్(ఎంఓయూ)లు పూర్తయిపోయాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర పరిశ్రమల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) ఆమోద ముద్ర కూడా వేసిందని నివేదిక పేర్కొంది.

● రూ.4,700 కోట్లతో విమానాశ్రయం

రాజధాని అమరావతిలో రూ.4,700 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. 4,500 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి భూ సమీకరణ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. కాగా అమరావతిలో ఇప్పటి వరకూ 9 జాబ్ మేళాలు నిర్వహించారు. తాడికొండ నియోజకవర్గంలో 7 జాబ్‌మేళాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా మొత్తం 9 జాబ్ మేళాలు నిర్వహించారు. వీటిలో 580 కంపెనీలు పాల్గొన్నాయి. వీటి ద్వారా 5,984 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు నివేదిక తెలుపుతోంది.

మిర్చియార్డు నూతన పాలకవర్గం నియామకం

● చైర్మన్‌గా కుర్రా అప్పారావు ● అధికారికంగా వెలువడిన ఉత్తర్వులు ● 20న ప్రమాణ స్వీకారం

గుంటూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) నూతన పాలకవర్గం నియామకం పూర్తి అయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదంతో రాష్ట్ర వ్యవసాయ, సహకార(మార్కెటింగ్) శాఖ సోమవారం అధికారికంగా జీవో నంబరు 89ని విడుదల చేసింది. కమిటీకి గౌరవ చెర్‌పర్సన్‌గా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, చైర్మన్‌గా కుర్రా అప్పారావు, వైస్ చైర్‌పర్సన్‌గా బిట్రగుంట మల్లికని నియమించింది. సభ్యులుగా కొనకళ్ల వెంకట సత్యన్నారాయణ, ముడావత్ మంగాబాయి, మొహమ్మద్ హఫీజ్, మేళం సైదయ్య, షేక్ ఖాదర్ బీ, బత్తుల జాన్ సైదా, దర్శనపు విజయమ్మ, ఇమ్మడి వెంకటలక్ష్మి, డాకుమళ్ల భాగ్యారావు, కుత్తూరు శ్రావణ కుమారి, కటకంశెట్టి విజయలక్ష్మి, చంద్రగిరిబాబు, నక్కల వంశీకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, పశు సంవర్ధక శాఖ ఏడీ, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ పదవీకాలాన్ని ప్రాథమికంగా ఏడాది పాటు పేర్కొంటూ మార్కెటింగ్ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

20న ప్రమాణ స్వీకారం

మిర్చియార్డు పాలకవర్గం నియామకానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలవడిన నేపథ్యంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలని చైర్మన్‌గా నియామకం పొందిన కుర్రా అప్పారావు నిర్ణయించారు. ఈ నెల 20న గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని చేబ్రోలు హనుమయ్య గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు.

కూటమి ఐక్యత చాటిచెప్పేలా..

ఎన్‌డీఏ కూటమి ఐక్యతని చాటి చెప్పేలా మిర్చి యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని మూడు పార్టీల నేతలు తెలిపారు. కమిటీలో దామాషా ప్రకారం తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులకు పదవులు కేటాయించారు. చైర్మన్ సీటుని తెలుగుదేశం పార్టీకి కేటాయించగా వైస్ చైర్‌పర్సన్ పదవిని జనసేనకు ఇచ్చారు. అలానే డైరెక్టర్ పదవుల్లో బీజేపీకి సముచిత స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలో ప్రమాణ స్వీకారం రోజున భారీ ఎత్తున ర్యాలీలు కూడా గుంటూరు నగరంలో నిర్వహించనున్నారు.

కళాకారులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ● వేడుకగా నాటక మహోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వేదికపై గుమ్మడి గోపాలకృష్ణ, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నాటక కళాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం వేదిక (యడ్లపాడు), నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా - ఢిల్లీ వేదిక (ఎన్ఎస్ఈ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవాలు 4వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం నాటక ప్రదర్శనలను, సభలను నాటక వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ప్రారంభించారు. ముఖ్య అతిథి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గతంలో సినిమా, టీవీలకే పరిమితమైన నంది అవార్డులను నాటక రంగానికి విస్తరించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని గుర్తు చేశారు. సోషల్ మీడియా ప్రభావంతో నాటక రంగం ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఈ సమయంలో, ఇంతటి భారీ అంతర్జాతీయ నాటకోత్సవాలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎన్ఎస్‌డీ చాప్టర్ లేకపోవడం ఒక లోటుగా భావిస్తున్నామని, దాన్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని అమరావతిలో ఆయన విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అదే రోజు 'అమరజీవి' నాటకాన్ని ప్రదర్శించి, ప్రపంచ వ్యాప్తంగా ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం సుదీర్ఘకాలంగా నాటక రంగానికి సేవలందిస్తున్న సుబ్బరాయశర్మ, బుద్ధాల వెంకట్రావు, వి. పురుషోత్తమం, దేవేంద్రలను ఎమ్మెల్యే చేతుల మీదగా ఘనంగా సత్కరించారు.



'ఎ వెరీ సింపుల్ స్టోరీ నాటకంలో ఓ సన్నివేశం

● మానవీయ విలువల దృశ్య కావ్యం ఎ వెరీ సింపుల్ స్టోరీ

ప్రొఫెసర్ ఆలెక్సి బ్లాకిన్ రచించిన ఎ వెరి సింపుల్ స్టోరీ (రష్యన్) నాటకం మంత్రముగ్ధులను చేసింది. విశ్వాసం, నిజాయితీతో కూడిన పెంపుడు జంతువులు, తమ యజమానుల కోసం ఏకమై ఒక చిన్నారి ప్రాణాన్ని కాపాడే ప్రయత్నం చేయడమే ఈ కథలో అత్యంత కీలక మలుపు. హాస్యంతో పాటు కరుణ, స్నేహం, పరస్పర అవగాహనే జీవిత పరమార్థమని ఈ నాటకం చాటి చెప్పింది. ఉత్సవం ప్రారంభ సందర్భంగా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత డాక్టర్ భార్గవ చౌదరి ఆధ్వర్యంలో నగరంలో కళా ర్యాలీ నిర్వహించారు.

రెండోసారి పక్షవాతం వచ్చే అవకాశం

● ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు విజయ వెల్లడి

● అమెరికన్ సదస్సులో ఆసక్తికర విశేషాలు



120	157	3.88	పట్టా	3.88	మన్నేమాల సుబ్బా రెడ్డి S/o వెంకట రామి రెడ్డి	141/1,156	344	154	158	
					ఉప్పాల సుధాకర్ S/o అంకయ్య	141/1,156	344	154	158	
					తుళ్లూరు ఆదినారాయణ	141/1,156	344	154	158	
					ఉప్పాల మహేశ్వర రావు S/o వెంకయ్య	141/1,156	344	154	158	
					ఉప్పాల చిన్న యల్లయ్య	141/1,156	344	154	158	
					ఉప్పాల రమణమ్మ w/o తిరుపతి	141/1,156	344	154	158	
					జమ్మున కృష్ణ W/o చిన్న వెంకయ్య	141/1,156	344	154	158	
					ఉప్పాల రామయ్య	141/1,156	344	154	158	
					ఉప్పాల లచ్చయ్య	141/1,156	344	154	158	
					ఉప్పాల శేషయ్య	141/1,156	344	154	158	
					ఉప్పాల వెంకట స్వామి S/o నరసయ్య	141/1,156	344	154	158	
					బోమిరెడ్డి సత్య వాణి W/o భాస్కర్ రెడ్డి	141/1,156	344	154	158	

(మిగతా 14వ పేజీలో)

121	158	15.58	పట్టా	15.58	వేపూరు సుజాతమ్మ w/o కొండా రెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
					బల్లెల మనోజ్ఞ W/o సునీల్	139,140,141/1	344	157	138,160,159	
					మన్నేమాల వెంకట రమణా రెడ్డి S/o రాఘవరెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
					మన్నేమా సుబ్బారెడ్డి S/o వెంకట రామి రెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
					మన్నేమావెంకట రమణా రెడ్డి S/o రాఘవరెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
					మన్నేమారాఘవ రెడ్డి S/o సుబ్బారెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
					బల్లెల మాలకొండ రెడ్డి S/o రాఘవరెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
					బోగిరెడ్డి పద్మజ W/o వెంకట రామి రెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
					ఆనం బ్రహ్మా నంద రెడ్డి S/o యలమంద రెడ్డి	139,140,141/1	344	157	138,160,159	
122	159	1.93	పట్టా	1.93	కన్నం రెడ్డి పుల్లా రెడ్డి S/o రమణా రెడ్డి	160	344	158	161	
					కన్నం రెడ్డి భాస్కర్ రెడ్డి S/o రామి రెడ్డి	160	344	158	161	
					కన్నం రెడ్డి భక్త జయ దేవా రెడ్డి S/o రామి రెడ్డి	160	344	158	161	
					కన్నం రెడ్డి రంగా రెడ్డి S/o రమణా రెడ్డి	160	344	158	161	
					కన్నం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి S/o రామి రెడ్డి	160	344	158	161	
					వాక సుధాకర్ రెడ్డి S/o కృష్ణా రెడ్డి	160	344	158	161	
					వాక మల్లికార్జున రెడ్డి	160	344	158	161	
					కనం రెడ్డి పుల్లారెడ్డి S/o రమణా రెడ్డి	160	344	158	161	
					కన్నం రెడ్డి రాంబాబు	160	344	158	161	
123	160	3.6	పట్టా	3.6	కన్నం రెడ్డి భక్తజయ దేవా రెడ్డి S/o రామి రెడ్డి	138,164	159	158	163	
					కన్నం రెడ్డి రంగా రెడ్డి S/o రమణ రెడ్డి	138,164	159	158	163	
					కన్నం రెడ్డి వెంకారెడ్డి S/o రామి రెడ్డి	138,164	159	158	163	
					కన్నం రెడ్డి వెంకారెడ్డి S/o పుల్లా రెడ్డి	138,164	159	158	163	
					వాక సుధాకర్ రెడ్డి S/o కృష్ణా రెడ్డి	138,164	159	158	163	
					వాక మల్లికార్జున రెడ్డి	138,164	159	158	163	
					కన్నం రెడ్డి రాంబాబు S/o భాస్కర్ రెడ్డి	138,164	159	158	163	
					కన్నం రెడ్డి పుష్పలత	138,164	159	158	163	
124	161	2.52	పట్టా	2.52	కన్నం రెడ్డి పుల్లా రెడ్డి S/o రమణ రెడ్డి	162,163	344	159,160	189	
					కన్నం రెడ్డి భక్తజయ దేవా రెడ్డి S/o రామి రెడ్డి	162,163	344	159,160	189	
					కన్నం రెడ్డి రంగా రెడ్డి S/o రమణ రెడ్డి	162,163	344	159,160	189	
					కన్నం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి	162,163	344	159,160	189	
					గడియం శ్రీనివాసులు రెడ్డి	162,163	344	159,160	189	
					గడియం సుమతి	162,163	344	159,160	189	
					వాక మల్లికార్జున రెడ్డి	162,163	344	159,160	189	
					పులుసు కోటేశ్వరమ్మ	162,163	344	159,160	189	
					కన్నం రెడ్డి రాంబాబు	162,163	344	159,160	189	
					గడియం నిత్య W/o ప్రదీప్ రెడ్డి	162,163	344	159,160	189	
					ఇతరులు	162,163	344	159,160	189	
125	163	2.11	పట్టా	2.11	డేగా శ్రీనివాసులు S/o వెంకట సుబ్బయ్య	164	161,162	160	165	
					డేగా వెంకట సుబ్బ రాజు S/o కాజయ్య	164	161,162	160	165	
					డేగా శ్రీనివాసులు S/o వెంకట సుబ్బయ్య	164	161,162	160	165	
					రాయని వెంమ లక్ష్మి w/o పెద్ద కొండయ్య	164	161,162	160	165	
					డేగా శ్రీనివాసులు S/o వెంకట సుబ్బయ్య	164	161,162	160	165	
					తగిల తులసమ్మ W/o నాగేశ్వరరావు	164	161,162	160	165	
					గడియం నిత్య W/o ప్రదీప్ రెడ్డి	164	161,162	160	165	
					రాయణి వెంచు కొండయ్య	164	161,162	160	165	
126	164	3.06	పట్టా	3.06	రాయని వెంమ లక్ష్మి w/o పెద్ద కొండయ్య	166,167	160,163	138	165	
					డేగా వెంకట సుబ్బయ్య S/o కాజయ్య	166,167	160,163	138	165	
					డేగా వెంకట రమణయ్య S/o కాజయ్య	166,167	160,163	138	165	
					డేగా శ్రీనివాసులు S/o వెంకట సుబ్బయ్య	166,167	160,163	138	165	
					గడియం నిత్య W/o ప్రదీప్ రెడ్డి	166,167	160,163	138	165	
127	165	1.87	పట్టా	1.87	గడియం శ్రీనివాసులు రెడ్డి	166	162	163,164	186	
					నల్లగట్ల నాగ మల్లీశ్వరి	166	162	163,164	186	
					నక్కల రాఘవేంద్ర రావు	166	162	163,164	186	
					గడియం నిత్య W/o ప్రదీప్ రెడ్డి	166	162	163,164	186	
					చల్లా కోటేశ్వరరావు	166	162	163,164	186	
128	166	3.2	పట్టా	3	గడియం చైతన్య S/o శ్రీనివాసులు రెడ్డి	170	164,165	167	185,186	
				0.2	గడియం నిత్య W/o ప్రదీప్ రెడ్డి	170	164,165	167	185,186	
129	167	1.97	పట్టా	1.34	గడియం మౌనిక W/o మదన్ మోహన్ రెడ్డి	168,169,170	138,164	166	138	
				0.63	గడియం నిత్య W/o ప్రదీప్ రెడ్డి	168,169,170	138,164	166	138	
130	168	4.64	ఇనామ్	4.64	నన్నమూరి సుందరా వారి S/o వెంచయ్య	219	167,169	137	173,174	
					ననుమూరి వీర బ్రహ్మయ్య S/o సుందరా వారి	219	167,169	137	173,174	
					ననమూరి నాగ భూషణం S/o వెంచయ్య	219	167,169	137	173,174	
					బొమ్మిరెడ్డి శేష రెడ్డి	219	167,169	137	173,174	
					కన్నం రెడ్డి ఆదెమ్మ	219	167,169	137	173,174	
					నలపరెడ్డి బ్రహ్మా రెడ్డి	219	167,169	137	173,174	
					నల్లపురెడ్డి వనజాక్షమ్మ w/o శంకర రెడ్డి	219	167,169	137	173,174	
					గడియం సుమతి	219	167,169	137	173,174	
131	169	0.93	పట్టా	0.93	నల్లపురెడ్డి రమేష్ రెడ్డి బ్రహ్మానంద రెడ్డి	168	170	167	171	
					ఉల్చి మదన్ మోహన్ రెడ్డి S/o వెంకటేశ్వర్లు	168	170	167	171	
					గడియం మౌనిక W/o మదన్ మోహన్ రెడ్డి	168	170	167	171	
132	170	1.94	పట్టా	0.22	కన్నం రెడ్డి వెంకారెడ్డి S/o పుల్లా రెడ్డి	169,171	166,185	167	184	
				0.25	కన్నం రెడ్డి రంగా రెడ్డి S/o రమణా రెడ్డి	169,171	166,185	167	184	
				0.42	కన్నం రెడ్డి రాంబాబు S/o భాస్కర్ రెడ్డి	169,171	166,185	167	184	
				1.05	దేవండ్ల పున్నయ్య S/o చిన్న వెంచయ్య	169,171	166,185	167	184	
133	171	2.74	పట్టా	2.74	గండికోట కోటయ్య	169	181,183	170	172	
					వల్లెపు కోటేశ్వరమ్మ W/o కోటేశ్వరరావు	169	181,183	170	172	
					గండికోట సుబ్బమ్మ W/o యలమందయ్య	169	181,183	170	172	
					దేవండ్ల వెంకమ్మ W/o చిన్న వెంచయ్య	169	181,183	170	172	
					దేవండ్ల సింగమ్మ	169	181,183	170	172	
					దేవండ్ల వెంచయ్య	169	181,183	170	172	
					దేవండ్ల యానదయ్య S/O పెద్దయ్య	169	181,183	170	172	
134	172	2.36	పట్టా	2.36	దేవండ్ల లీలమ్మ w/o పున్నయ్య	173	171	169	180,181	
135	173	2.2	పట్టా	2.2	గడియం సుధాకర్ రెడ్డి S/o వెంకట శేషారెడ్డి	174	172	168	179	
					ఉల్చి మేడం మోహన్ రెడ్డి S/o వెంకటేశ్వర్లు	174	172	168	179	
					గడియం సుధాకర్ రెడ్డి S/o వెంకట శేషారెడ్డి	174	172	168	179	
136	174	5.8	పట్టా	5.8	బత్తుల పోలి రెడ్డి S/o వెంకారెడ్డి	211	173	168,219	175,176,178	
					అత్తిపల్లి రామి రెడ్డి S/o శేషారెడ్డి	211	173	168,219	175,176,178	
					అత్తిపల్లి వెంకట కృష్ణా రెడ్డి S/o శేషారెడ్డి	211	173	168,219	175,176,178	
					అత్తిపల్లి రమణ రెడ్డి S/o లక్ష్మారెడ్డి	211	173	168,219	175,176,178	
					కుంకాల నిర్మల	211	173	168,219	175,176,178	
					అత్తిపల్లి శ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	211	173	168,219	175,176,178	
					కుంకాల నిర్మల w/o సుబ్బ రామి రెడ్డి	211	173	168,219	175,176,178	
137	175	1.14	పట్టా	1.14	బత్తుల పోలి రెడ్డి S/o వెంకారెడ్డి	211	176	174	176	
					కుంకల లక్ష్మి ప్రసాద్ S/o సుబ్బరామి రెడ్డి	211	176	174	176	
138	176	1.24	పట్టా	1.24	వాక మంజుల W/o వెంకట రమణా రెడ్డి	211	175	178	174	
139	177	0.94	పట్టా	0.94	బుర్రి శ్రీరామ మూర్తి S/o వెంకట సుబ్రహ్మణ్యం & ఇతరులు	211	178	176	209,210	
140	178	1.35	ఇనాం	1.35	గ్రామ దేవత అంకమ్మ	176,177	179,180	174	199,209	
141	180/1	1.31	పట్టా	0.6675	జరుగుమల్లి శారద W/o శ్రీను	198,178	180-2	179	197,198	
				0.6425	జరుగుమల్లి నిర్మల w/o శ్రీను	198,178	180-2	179	197,198	
142	180/2	0.5	పట్టా	0.16	జరుగుమల్లి శారద W/o శ్రీను	180-1	183	172	180-1	
				0.19	జరుగుమల్లి నిర్మల w/o శ్రీను	180-1	183	172	180-1	
				0.15	జరుగుమల్లి శారద W/o శ్రీను	180-1	183	172	180-1	
143	181	1.2	పట్టా	1.2	జరుగుమల్లి నిర్మల w/o శ్రీను	180	182,183	171,172	180	
144	182	0.22	పట్టా	0.22	ఇతరులు	181	183	181	181	
145	184	1.92	ఇనామ్	1.92	గడియం చైతన్య S/o శ్రీనివాసులు రెడ్డి	183	193,187	185,170	194/1,194/2	
146	185	1.4	పట్టా	1.4	దేవళ్ల లక్ష్మమ్మ w/o వెంచా రావు	170	186	166	184,187	
					నలపురెడ్డి జాలి రెడ్డి S/o సుబ్బా రెడ్డి	170	186	166	184,187	
					నలపురెడ్డి జాలి రెడ్డి S/o సుబ్బా రెడ్డి	170	186	166	184,187	
					చీకుర్తి యానాదయ్య S/o వెంకట స్వామి	170	186	166	184,187	
					చీకుర్తి వెంకట రమణయ్య S/o యనాదయ్య	170	186	166	184,187	
147	186/1	2.26	పట్టా	2.26	ఎల్లేటి కోటమ్మ W/o కోటయ్య	185,187	162	165,166	186/2	
					పులుసు రామయ్య	185,187	162	165,166	186/2	
					కార్యం పనమ్మ W/o క్రిష్ణయ్య	185,187	162	165,166	186/2	
					నక్కల రాఘవేంద్రరావు S/o రాగయ్య	185,187	162	165,166	186/2	
148	187/1	0.9	పట్టా	0.45	పాలపర్తి శివ కోటయ్య S/o యలమందయ్య	193,184	190	185,186,187/2	191,192	
				0.45	పాలపర్తి అయ్యావారప్ప	193,184	190	185,186,187/2	191,192	
149	187/2	0.25	పట్టా	0.25	ఇతరులు	184	186	185	187/1	
150	189	1.36	పట్టా	1.36	నల్లగట్ల మల్లీశ్వరి W/o శంకరయ్య	162,188	344	161	190	
					ఇతరులు	162,188	344	161	190	
151	190	0.36	చుక్కలు భూమి	0.36	పులుసు రామయ్య	187,188	144	189	191	
					పాలపర్తి శివ కోటయ్య S/o యలమందయ్య	187,188	144	189	191	
					పాలపర్తి శంకరయ్య	187,188	144	189	191	
					ఇతరులు	187,188	144	189	191	
152	191	5.77	ఇనామ్	5.77	వాక కోట రెడ్డి S/o అంజి రెడ్డి	192	274,275	187,190	273,274	
					వాక కోట రెడ్డి S/o వెంకట రామి రెడ్డి	192	274,275	187,190	273,274	
					వాక గోవింద రెడ్డి S/o తిరుపతి రెడ్డి	192	274,275	187,190	273,274	
					వాక బ్రహ్మానంద రెడ్డి S/o రమణా రెడ్డి	192	274,275	187,190	273,274	
					వాక రమణా రెడ్డి S/o రామచంద్రారెడ్డి	192	274,275	187,190	273,274	
					వాక వేణుగోపాల్ రెడ్డి S/o కోట రెడ్డి	192	274,275	187,190	273,274	
					పూసపాటి వెంకట శేషమ్మ W/o వెంకట సుబ్బారెడ్డి	192	274,275	187,190	273,274	
					వాక శేషమ్మ W/o లేట్ సుధాకర్ రెడ్డి	192	274,275	187,190	273,274	
153	192	2.09	ఇనామ్	0.69	కన్నం రెడ్డి భాస్కర్ రెడ్డి S/o రామి రెడ్డి	194/1	191	187,193	273	
				0.7	కన్నం రెడ్డి భక్త జయదేవ రెడ్డి S/o రామి రెడ్డి	194/1	191	187,193	273	
				0.7	కన్నం రెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి	194/1	191	187,193	273	
154	194/1	2.41	ఇనామ్	0.56	కన్నం రెడ్డి భాస్కర్ రెడ్డి S/o రామి రెడ్డి	195	192	184,194/2	271,272,273	
				0.55	కనంరెడ్డి భక్త జయదేవ రెడ్డి S/o రామి రెడ్డి	195	192	184,194/2	271,272,273	
				0.55	కన్నం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి S/o రామి రెడ్డి	195	192	184,194/2	271,272,273	
				0.75	కన్నం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి S/o రామి రెడ్డి	J95	192	184,194/2	271,272,273	
155	194/2	0.31	చుక్కలు భూమి	0.31	ఇతరులు	195	194/1	184	194/1	
156	196	0.89	పట్టా	0.4	పాకాల ఆదిశేషమ్మ W/o సుబ్బ రామయ్య	197	195,271	197	201,202	
				0.39	పాకాల మల్లికార్జునరావు S/o సుబ్బా రాయుడు	197	195,271	197	201,202	
				0.1	పాకాల బాల రామయ్య S/o వెంకటేష్	197	195,271	197	201,202	
157	197/1	2.23	పట్టా	2.23	పాకాల బాల రామయ్య S/o వెంకటేష్	198	195,196	180	201	
					చల్లా బాబు రావు S/o యానాది	198	195,196	180	201	
					చల్ల రాజా S/o యానాది	198	195,196	180	201	
158	197/2	0.09	పట్టా	0.09	దేవళ్ల యానాదయ్య S/O పెద్దయ్య	197/1	195	180	195	
159	198	2.4	పట్టా	2.4	పాకాల ఆదిశేషమ్మ W/o సుబ్బ రామయ్య	199,200	197	180	201	
					పులుసు కోటేశ్వరమ్మ W/o సత్యం	199,200	197	180	201	
					ముసునూరు శ్రీనివాసులు S/o లక్ష్మయ్య	199,200	197	180	201	
					పాకాల ప్రభాకర్ రావు S/o సుబ్బ రాయుడు	199,200	197	180	201	
160	199	2.47	పట్టా	2.47	ముసునూరు శేషమ్మ	207,208,209	198,180	178	200	
					ముసునూరు చినమ్మ w/o శేషయ్య	207,208,209	198,180	178	200	
					పాలకీర్తి పాండయ్య S/o పెద్ద రామలింగయ్య	207,208,209	198,180	178	200	
					వాక ఆదిలక్ష్మమ్మ W/o గడ్డం సురేష్	207,208,209	198,180	178	200	
					ముసునూరు శ్రీదేవి W/o తిరుపతి రావు	207,208,209	198,180	178	200	
161	201	2.72	ఇనామ్	2.72	గండికోట కొండయ్య S/o కలగయ్య	205	202	196,197,198,200	204	
					చల్లా దుర్గమ్మ W/o వెంచులు	205	202	196,197,198,200	204	
					చల్లా దుర్గమ్మ W/o వెంచులు	205	202	196,197,198,200	204	
					చల్లా పిచ్చమ్మ W/o సుబ్బ రాయుడు	205	202	196,197,198,200	204	
					దేవండ్ల చిన్న కొండయ్య S/o మాలకొండయ్య	205	202	196,197,198,200	204	
					సాకం రమణమ్మ W/o నాగరాజ	205	202	196,197,198,200	204	
					వాక ఆదిలక్ష్మమ్మ W/o గడ్డం సురేష్	205	202	196,197,198,200	204	
162	204	1.31	పట్టా	1.31	బొమ్మిరెడ్డి రమణ రెడ్డి S/o వెంకారెడ్డి	205	203	201	268	
					దేవండ్ల చిన్న కొండయ్య S/o మాలకొండయ్య	205	203	201	268	
					బొమ్మిరెడ్డి అనూష W/o శరత్ బాబు	205	203	201	268	
163	206	0.55	పట్టా	0.275	గడ్డం శ్రీనివాసులు S/o పెద్ద వెంకయ్య	232	205	207	268	
				0.275	గండికోట లక్ష్మమ్మ W/o రమణయ్య	232	205	207	268	
164	207	1.13	పట్టా	0.65	దాసరి బాల కోటయ్య	232	199,205,208	210	206	
				0.48	కుమ్మరగుంట మమత బేబీ W/o ప్రవీణ్	232	199,205,208	210	206	
165	208	0.82	పట్టా	0.06	చల్లా కోటేశ్వరరావు S/o యలమందయ్య	207,210	199	209	207	
				0.76	చల్లా ప్రభాకర్ S/o యల్లమందయ్య	207,210	199	209	207	
166	209/1	0.96	పట్టా	0.32	ముసునూరు శ్రీనివాసులు S/o లక్ష్మయ్య	210	199	177,178	209/2	
				0.3	ముసునూరు నాగరాజ S/o శేషయ్య	210	199	177,178	209/2	
				0.34	ముసునూరు వెంకట లక్ష్మి W/o శ్రీనివాసులు	210	199	177,178	209/2	
167	209/2	0.33	పట్టా	0.33	డేగా వెంకట రమణయ్య S/o జ్ఞానయ్య	210	199	209/1	208	
168	210	2.59	పట్టా	2.59	పాలకీర్తి వెంకయ్య S/o పొట్ట కోటయ్య	211,230	208,209	177	231,232,207	
					దాసరి ఆదినారాయణ	211,230	208,209	177	231,232,207	
					కాకు పద్మ W/o నాగభూషణం	211,230	208,209	177	231,232,207	
					కాకు నాగభూషణం S/o సుబ్బయ్య	211,230	208,209	177	231,232,207	
					ముసునూరు నాగరాజ S/o శేషయ్య	211,230	208,209	177	231,232,207	
169	212/1	0.84	పట్టా	0.84	పాలకీర్తి వెంకయ్య S/o వెంకటయ్య	226	212/2	213	227	
170	212/2	1.78	పట్టా	1.78	అత్తిపల్లి లక్ష్మి నారాయణ రెడ్డి S/o శంకర రెడ్డి	212/1	211	213	227	
					ఇతరులు	212/1	211	213	227	
					వాక ఆదిలక్ష్మమ్మ W/o గడ్డం సురేష్	212/1	211	213	227	
171	213/1	1.58	పట్టా	1.58	గండవరపు వాసుదేవ రెడ్డి S/o సుబ్బారెడ్డి	224,225,226	213/2	214	212	
172	213/2	0.19	పట్టా	0.19	గండవరపు వాసుదేవ రెడ్డి S/o సుబ్బారెడ్డి	213/1	211	214	212	
173	214	3.28	పట్టా	0.665	అత్తిపల్లి గోపాల్ రెడ్డి S/o వెంకారెడ్డి	217,218	213	211	224,215,216	
				1.315	అత్తిపల్లి గోపాల్ రెడ్డి S/o వెంకారెడ్డి	217,218	213	211	224,215,216	
				0.61	చింతం మహాలక్ష్మమ్మ W/o కృష్ణయ్య	217,218	213	211	224,215,216	
				0.34	అత్తిపల్లి రామి రెడ్డి S/o వెంకారెడ్డి	217,218	213	211	224,215,216	
				0.35	గండవరపు వాసుదేవ రెడ్డి S/o సుబ్బారెడ్డి	217,218	213	211	224,215,216	
174	215	0.52	పట్టా	0.085	అత్తిపల్లి రామి రెడ్డి S/o శేషారెడ్డి	216	214	215	213	
				0.085	అత్తిపల్లి వెంకట కృష్ణా రెడ్డి S/o శేషారెడ్డి	216	214	215	213	
				0.05	అత్తిపల్లి వెంకట కృష్ణా రెడ్డి S/o శేషారెడ్డి	216	214	215	213	
				0.065	అత్తిపల్లి వెంకట కృష్ణా రెడ్డి S/o శేషారెడ్డి	216	214	215	213	
				0.09	అత్తిపల్లి వెంకట కృష్ణా రెడ్డి S/o శేషారెడ్డి	216	214	215	213	
				0.085	అత్తిపల్లి వెంకట కృష్ణా రెడ్డి S/o శేషారెడ్డి	216	214	215	213	
				0.06	అత్తిపల్లి వేణుగోపాల రెడ్డి S/o శంకర రెడ్డి	216	214	215	213	
175	216	3.64	పట్టా	1.51	బల్లెల మాలకొండ రెడ్డి S/o రంగారెడ్డి	215	214	217	213	
				0.05	అత్తిపల్లి గోపాల్ రెడ్డి S/o వెంకారెడ్డి	215	214	217	213	
				0.31	బల్లెల మాలకొండ రెడ్డి S/o రాఘవరెడ్డి	215	214	217	213	
				0.91	అత్తిపల్లి వెంకట కృష్ణా రెడ్డి S/o శేషారెడ్డి	215	214	217	213	
				0.8	కాటంరెడ్డి కవిత	215	214	217	213	
				0.06	అత్తిపల్లి శంకర రెడ్డి	215	214	217	213	
176	218	2.13	ఇనామ్	0.3	పాపిశెట్టి తులసమ్మ w/o యానాది	220	219+	220	217,214	
				0.46	అత్తిపల్లి రామి రెడ్డి S/o వెంకారెడ్డి	220	219+	220	217,214	
				0.38	అత్తిపల్లి సుబ్బమ్మ W/o శంకర్ రెడ్డి	220	219+	220	217,214	
				0.21	అత్తిపల్లి లక్ష్మి నారాయణ రెడ్డి S/o శంకర రెడ్డి	220	219+	220	217,214	
				0.21	అత్తిపల్లి వేణుగోపాల్ రెడ్డి S/o శంకర రెడ్డి	220	219+	220	217,214	
				0.57	ఇతరులు	220	219+	220	217,214	

(మిగతా 15వ పేజీలో)

177	223	1.94	పట్టా	0.35	దీమకుర్తి రమాదేవి W/o శ్రీనివాసులు రెడ్డి	222	216	221	224	
				0.5	గండవరపు వాసుదేవ రెడ్డి S/o సుబ్బారెడ్డి	222	216	221	224	
				0.35	ఇతరులు	222	216	221	224	
				0.44	పూసపాటి వెంకారెడ్డి S/o టి.వెంకట సుబ్బా రెడ్డి	222	216	221	224	
				0.3	సుంకర వెంకట సుప్రజ W/o రామి రెడ్డి	222	216	221	224	
178	224	3.22	పట్టా	2	అత్తిపల్లి రామి రెడ్డి S/o శేషారెడ్డి	222	213,214	216,223	225	
				0.91	చేవూరు సుజాతమ్మ w/o కొండా రెడ్డి	222	213,214	216,223	225	
				0.31	అరలింగం పూర్ణ W/o కిరణ్ కుమార్	222	213,214	216,223	225	
179	225	1.83	పట్టా	1.83	చేవూరి జితేంద్ర S/o కొండా రెడ్డి	222,227	226	224	226	
					అరలింగం పూర్ణ W/o కిరణ్ కుమార్	222,227	226	224	226	
					యామల వెంకయ్య S/o తిరుపతమ్మ	222,227	226	224	226	
					యామల వెంకట రమణమ్మ W/o బాబు	222,227	226	224	226	
180	226	2.37	పట్టా	0.38	రాయని పెద్ద పాపయ్య S/o దాసయ్య	225	213	213	227	
				0.4	గండికోట వెంకమ్మ W/o కొండయ్య	225	213	213	227	
				1.29	రాయని లక్ష్మమ్మ W/o చిన్న పాపయ్య	225	213	213	227	
				0.3	వాక ఆదిలక్ష్మమ్మ W/o గడ్డం సురేష్	225	213	213	227	
181	228	4.31	పట్టా	1.16	వాక గోపాల్ రెడ్డి S/o శంకర రెడ్డి	239,240	229,227	227	237,238	
				0.35	వాక శంకర రెడ్డి S/o రాఘవ రెడ్డి	239,240	229,227	227	237,238	
				0.35	వాక శంకర రెడ్డి S/o రాఘవ రెడ్డి	239,240	229,227	227	237,238	
				0.35	వాక వెంకట కృష్ణ రెడ్డి S/o శంకర్ రావు	239,240	229,227	227	237,238	
				1.43	వాక వెంక రెడ్డి S/ o కోట రెడ్డి	239,240	229,227	227	237,238	
				0.17	దాసరి పెద్ద కొండయ్య S/o ఆదయ్య	239,240	229,227	227	237,238	
				0.09	దాసరి పెద్ద కొండయ్య S/o ఆదయ్య	239,240	229,227	227	237,238	
				0.09	దాసరి రంగమ్మ W/o లేట్ చిన్న కోటయ్య	239,240	229,227	227	237,238	
				0.32	ఆళ్ల వెంకట కృష్ణ రెడ్డి S/o రమణ రెడ్డి	239,240	229,227	227	237,238	
182	229	1.59	పట్టా	1.59	దేవండ్ల వెంచారావు	228	230	2,27,228	235	
					పేరం యనాదమ్మ	228	230	2,27,228	235	
					దాసరి సుజాత W/o వెంకటేశ్వర్లు	228	230	2,27,228	235	
					వాక గోపాల్ రెడ్డి S/o శంకర రెడ్డి	228	230	2,27,228	235	
					వాక దశరథ రామి రెడ్డి S/o శంకర్ రెడ్డి	228	230	2,27,228	235	
					కాకు రాగయ్య	228	230	2,27,228	235	
183	231	1.21	ఇనామ్	0.15	సురె రవీంద్ర రెడ్డి S/o సుబ్బారెడ్డి	230	232	210	233	
				0.15	సురె వెంకారెడ్డి S/o సుబ్బారెడ్డి	230	232	210	233	
				0.91	సురె వెంకారెడ్డి S/o సుబ్బారెడ్డి	230	232	210	233	
184	235	1.12	పట్టా	1.12	దాసరి బాల కోటయ్య	236	230,234	229	268	
					కుట్టుబోయిన రామకోటేశ్వరమ్మ W/o పాస రాజా	236	230,234	229	268	
					దాసరి బాల కోటయ్య	236	230,234	229	268	
					పొట్టేల పరంధామయ్య	236	230,234	229	268	
					కుట్టుబోయిన రామకోటేశ్వరమ్మ W/o పాస రాజా	236	230,234	229	268	
185	236	1.51	పట్టా	0.55	వింజమూరు రమణమ్మ W/o వెంచయ్య	237	235	229	250	
				0.04	పులుసు కొండమ్మ W/o నాగభూషణం	237	235	229	250	
				0.32	పోటేల పరంధామయ్య S/o కొండయ్య	237	235	229	250	
				0.6	పొట్టేల రమణమ్మ W/o రమణయ్య	237	235	229	250	
186	237/1	0.47	పట్టా	0.23	పులుసు కొండమ్మ W/o నాగభూషణం	237/2	236	229	250	
				0.24	పదర్తి ఆంజయ్య S/o రాఘవులు	237/2	236	229	250	
187	237/2	0.39	పట్టా	0.18	పులుసు కొండమ్మ W/o నాగభూషణం	237/3	237/1	228	250	
				0.21	పదర్తి ఆంజయ్య S/o పెద్ద రాఘవులు	237/3	237/1	228	250	
188	237/3	0.43	పట్టా	0.43	వింజమూరు రమణమ్మ W/o లేట్ వెంకయ్య	237/4	237/2	228	250	
189	237/4	0.43	పట్టా	0.43	వింజమూరు రమణమ్మ W/o లేట్ వెంకయ్య	238	237/3	228	250	
190	238	0.89	పట్టా	0.89	ముసునూరు శ్రీనివాసులు S/o లక్ష్మయ్య	239	237	228	250	
					కట్టా విజయమ్మ w/o వెంకటేశ్వర్లు	239	237	228	250	
					ముసునూరు శ్రీనివాసులు S/o లక్ష్మయ్య	239	237	228	250	
191	239	3.67	పట్టా	0.45	వాక వెంకా రెడ్డి S/o కోట రెడ్డి	241,242	228,238	240	250	
				1.92	వాక వెంకట రమణా రెడ్డి S/o కోట రెడ్డి	241,242	228,238	240	250	
				0.45	బాపట్ల అయ్యన్న S/o రోశయ్య	241,242	228,238	240	250	
				0.85	బాపట్ల అయ్యన్న S/o రోశయ్య	241,242	228,238	240	250	
192	240	1.11	పట్టా	1.11	ముచ్చాల శశికళ W/o సుబ్బరామి రెడ్డి	241,242	228,238	240	250	
193	241	1.85	పట్టా	0.925	వెన్నలగంటి వెంకట రమణారావు	484	239,240	484	242	
				0.465	వెన్నలగంటి వెంకట రమణారావు	484	239,240	484	242	
				0.46	పాలం రెడ్డి విజయలక్ష్మమ్మ W/o శ్రీనివాసులు రెడ్డి	484	239,240	484	242	
194	242	2.74	పట్టా	1.54	వెన్నలగంటి వెంకట రమణారావు	484	239	241	250	
				0.16	వెన్నలగంటి వెంకట రమణారావు	484	239	241	250	
				0.57	వెన్నలగంటి వెంకట రమణారావు	484	239	241	250	
				0.47	పాలంరెడ్డి విజయ లక్ష్మమ్మ W/o లేట్ శ్రీనివాసులు రెడ్డి	484	239	241	250	
195	273	5.95	పట్టా	5.95	వాక కోట రెడ్డి S/o అంజి రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక బ్రహ్మానంద రెడ్డి S/o రమణా రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక రామచంద్రారెడ్డి S/o రాధా కృష్ణ రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక వెంకట నారప రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక శేషమ్మ W/o సుధాక రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక మల్లికార్జున రెడ్డి S/o రాఘవ రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక శ్రీనివాసులు రెడ్డి S/o రమణా రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక దయాకర్ రెడ్డి S/o సుధాకర్ రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					ఇతరులు	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక రామలక్ష్మమ్మ W/o రామకృష్ణా రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
					వాక రామలక్ష్మమ్మ W/o రామకృష్ణా రెడ్డి	272,277	274,276	191,192, 194/1	277,281	
				447.84						

2018 భూసేకరణ, పునరావాసము, పున: స్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2018 లోని 22 చట్టం) ద్వారా సవరించబడిన విధముగా 2013 భూసేకరణ, పునరావాసము, పున:స్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2013లో 30వ చట్టం) సెక్షన్ 10 (ఎ) ప్రకారము **"కావలి మండలము రుద్రకోట గ్రామము** నందు పారిశ్రామిక కూడలి/పరిశ్రమలు స్థాపించుట" సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది.

సదరు పై తెలిపిన భూసేకరణకు సంబంధించిన భూముల యందు లభ్యమగు బొగ్గు గనులు, యినుప ఖనిజం, పలక లేక ఇతర ఖనిజములు ఏవేని సదరు భూమి యందు జరుపు త్రవ్వకం సమయములో బయల్పడిన పక్షంలో సదరు భూమిని తీసుకున్న ఉద్దేశ్యము నెరవేరుటకు ఉపయోగయుక్తమైనంత మేరకు మాత్రమే సదరు ఖనిజములను ఉపయోగించుకొనబడును.

సం/- హిమాన్షు శుక్ల, జిల్లా కలెక్టర్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా

టాప్‌లో విజయవాడ పశ్చిమ

- హిందూపురం-5, పిఠాపురం-10
- టాప్-13లో చోటు దక్కని కుప్పం, మంగళగిరి
- చిట్టచివరి స్థానంలో గుంటూరు పశ్చిమ
- ప్రగతి నివేదిక విడుదల చేసిన సీఎం
- నియోజవర్గాల్లోని స్థితిగతులపై ర్యాంకింగ్స్
- ఎమ్మెల్యేల పనితీరుపై కాదని స్పష్టీకరణ
- జిల్లాల వారీగానూ ర్యాంకులు, గ్రేడ్‌లు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వివిధ రంగాల్లో అద్భుత పనితీరు కనబర్చి నూటికి 93 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో నిలిచింది. హిందూపురం 5వ స్థానంలో, పిఠాపురం 10వ స్థానంలో నిలవగా, కుప్పం, మంగళగిరికి తొలి-13 స్థానాల్లో చోటు దక్కలేదు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లోని స్థితిగతులపై నివేదిక ఆధారంగా ప్రభుత్వం ర్యాంకింగ్స్ ఇచ్చింది. ఎమ్మెల్యేల పనితీరును బట్టి ఎమ్మెల్యేలకు వచ్చిన ర్యాంకులుగా వీటిని చూడరాదని స్పష్టం చేసింది. ఆయా జిల్లాలు, నియోజకవర్గాల్లో ఉన్న వనరుల ఆధారంగా 141 నుంచి 69 సూచికలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నివేదికను విడుదల చేశారు. మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఈ ప్రగతి నివేదికపై సీఎం చర్చించారు.

ఏ ప్లస్ నియోజకవర్గాలు.. 21

మొత్తం 175 నియోజకవర్గాలకు 2026 జనవరి వరకు ఉన్న డేటా ఆధారంగా ర్యాంకింగ్‌లు ఇచ్చారు. నూటికి 90 శాతం కన్నా ఎక్కువ మార్కులు సాధిస్తే ఎక్సలెంట్ అని ఏ ప్లస్ గ్రేడ్ ఇచ్చారు. 75 నుంచి 89 శాతం మార్కులు సాధిస్తే గుడ్ అని ఏ గ్రేడ్, 50 నుంచి 74 శాతం సాధిస్తే మోడరేట్ అని బీ గ్రేడ్, 50 శాతం కన్నా తక్కువ సాధిస్తే పూర్ అని పేర్కొంటూ సీ గ్రేడ్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్లస్ సాధించిన నియోజకవర్గాలు 21, ఏ గ్రేడ్ సాధించినవి 153 ఉన్నాయి. బీ గ్రేడ్ సాధించిన నియోజకవర్గం ఒకే ఒక్కటి ఉండగా, సీ గ్రేడ్ సాధించిన నియోజకవర్గాలు ఏవీ లేకపోవడం గమనార్హం. విజయవాడ పశ్చిమ 93 మార్కులతో ఏప్లస్ గ్రేడ్ సాధించగా, తర్వాతి స్థానాల్లో వరుసగా గాజువాక (92 మార్కులు), కాకినాడ సిటీ (92 మార్కులు), విజయవాడ తూర్పు, హిందూపురం, పెనుకొండ, కదిరి, విశాఖపట్నం పశ్చిమ, మాడుగుల, పిఠాపురం, రామచంద్రాపురం, జగ్గంపేట, గోపాలపురం(ఎస్సీ) అన్నీ 91 మార్కులు సాధించి ఏ ప్లస్‌లో నిలిచాయి. కొండెపి (ఎస్సీ) 79 మార్కులు, కందుకూరు 78 మార్కులు, కావలి 78 మార్కులు, ఒంగోలు 77 మార్కులతో ఏ గ్రేడ్ సాధించాయి. జాబితాలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 73 మార్కులతో బీ గ్రేడ్‌తో చిట్టచివరి స్థానంలో నిలిచింది.

జిల్లాల వారీగా ప్రగతి ఇలా..

వ్యవసాయ-అనుబంధ, పారిశ్రామిక, సేవా రంగాలతో పాటు వివిధ రంగాల్లో వివిధ రంగాల్లో జిల్లాలు సాధించిన ప్రగతి ఆధారంగా ర్యాంకులు, గ్రేడ్‌లు కేటాయించారు.

- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో కాకినాడ 94 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో శ్రీసత్యసాయి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు నిలిచాయి. ఈ రంగంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 69 మార్కులతో బీ గ్రేడ్‌తో అట్టడుగున నిలిచింది.

రెవెన్యూ లోటులో 30వ ర్యాంకు

- పారిశ్రామిక రంగంలో విశాఖపట్నం 99 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో అన్నమయ్య, పార్వతీపురం మన్యం నిలవగా, చిట్టచివరి స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా 38 మార్కులతో సీ గ్రేడ్ సాధించింది. ఏలూరు జిల్లా కూడా 48 మార్కులతో సీ గ్రేడ్‌తో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది.
- సేవా రంగంలో గుంటూరు జిల్లా 97 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో అనంతపురం, బాపట్ల 96, 95 మార్కులతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించాయి. చివరి స్థానంలో చిత్తూరు జిల్లా 75 మార్కులతో ఏ గ్రేడ్ సాధించింది.
- ఎస్డీజీ (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్), ఆరోగ్య రంగాల్లో పల్నాడు, తిరుపతి జిల్లాలు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. చివరి రెండు స్థానాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలు నిలిచాయి.

ఈ ఏడాది 9.88 శాతం వృద్ధి అంచనా

- 2024-25లో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 9.03 శాతం వృద్ధి సాధించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10.14 శాతం వృద్ధి అంచనా వేస్తున్నారు.
- పారిశ్రామిక రంగంలో గత ఆర్థిక సంవత్సరంలో 8.05 శాతం వృద్ధి సాధించగా, ఈ ఏడాది 9.15 శాతం వృద్ధి అంచనా వేస్తున్నారు.
- సేవా రంగంలో గత ఆర్థిక సంవత్సరంలో 8.7 శాతం వృద్ధి నమోదు కాగా, ఈ ఏడాది 10.67 శాతం వృద్ధిరేటు అంచనా వేస్తున్నారు.
- స్థూల విలువ జోడింపు గత ఏడాది 8.6 శాతం పెరగ్గా, ఈ ఏడాది 10.07 శాతం వృద్ధిరేటు అంచనా వేస్తున్నారు.
- జీఎస్‌డీపీ 8.27 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 9.88 శాతం అంచనా వేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ జీడీపీ 6.51 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 7.4 శాతం అంచనా వేస్తున్నారు.
- గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో తలసరి ఆదాయం 7.91 శాతం పెరిగి రూ.1,41,847 ఉండగా, ఈ ఏడాది 9.56 శాతం పెరిగి రూ.1,55,412కు చేరుతుందని భావిస్తున్నారు. అదే సమయంలో జాతీయ తలసరి ఆదాయ సగటు గత ఏడాది రూ.1,14,710 ఉండగా,ఈఏడాది రూ.1,21,968 ఉంటుందని అంచనా వేస్తున్నారు.

రాష్ట్ర ఆదాయం

ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులకే సరిపోతోందని, ఇతర అవసరాలకు అప్పులు చేస్తున్నామని, అందుకే రెవెన్యూ లోటులో రాష్ట్రం అత్యంత వెనుకబాటులో ఉందని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి పీయూష్ కుమార్ చెప్పారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం రాష్ట్రానికి అప్పులు చేయడంలో 28వ ర్యాంకు, కేంద్ర రుణాల్లో 25వ ర్యాంకు వచ్చాయి. జీఎస్‌డీపీలో అప్పుల నిష్పత్తి సూచీలో 19వ ర్యాంకు, స్థూల ద్రవ్యలోటు సూచీలో 26వ ర్యాంకులో నిలిచింది. రెవెన్యూ ఆదాయంలో 12వ ర్యాంకు, మూలధన వ్యయంలో 12వ ర్యాంకు, సొంత పన్ను ఆదాయం, జీఎస్‌డీపీ,వడ్డీ చెల్లింపుల్లో 8వ ర్యాంకులు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు రూ.60,480 కోట్లకు చేరే అవకాశం ఉంది. మొత్తం వ్యయంలో రెవెన్యూ వ్యయం 90 శాతం ఉండగా, తెలంగాణ ఈ ఖర్చును 75 శాతానికే పరిమితం చేసింది. అలాగే మొత్తం వ్యయంలో మూలధన వ్యయం ఏపీలో 10 శాతం మాత్రమే ఉండగా, తెలంగాణలో 24 శాతం ఉంది.



డొక్కా సీతమ్మ నివాసంలో సీతమ్మ చిత్ర పటానికి అద్దం చూపిస్తున్న సినీ రచయిత వి.విజయేంద్రప్రసాద్

సాక్షాత్తూ అన్నపూర్ణే డొక్కా సీతమ్మ

- ప్రముఖ సినీ రచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్

పి.గన్నవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన డొక్కా సీతమ్మ నివాసంలోకి రాగానే ఒళ్లు పులకరించిందని సినీ రచయిత, ప్రముఖ డైరెక్టర్ రాజమౌళి తండ్రి, రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్రప్రసాద్ అన్నారు. సాక్షాత్తూ అన్నపూర్ణ తల్లియే సీతమ్మగా వచ్చిందన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వాడపల్లి వెంకన్న, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను విజయేంద్రప్రసాద్ సోమవారం సందర్శించారు. వీటితో పాటు పి.గన్నవరం మండలం లంకల గన్నవరంలోని డొక్కా సీతమ్మ నివాసాన్ని సందర్శించారు. స్థానిక పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి సీతమ్మ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మీ రచనలు, సినీ కథల్లో సీతమ్మ జీవిత చరిత్రతో ఓ పాత్రను సృష్టించే ఆలోచన ఉందా? అని విలేకరులు ప్రశ్నించగా.. ఇప్పుడిప్పుడే ఆ ఆలోచన వస్తోందని, ఆ తల్లి కోసం ఏదైనా చేయాలని చెప్పారు. అన్నార్తుల ఆకలి తీర్చడమే ముఖ్యమనుకుని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనాన్ని చేసుకోలేకపోయిన చరిత్రను విజయేంద్రప్రసాద్ గుర్తుచేశారు. అంతర్వేదిలో కొత్త అద్దం తీసుకుని ఆ అద్దాన్ని శ్రీలక్ష్మీనరసింహస్వామికి చూపించి అదే అద్దాన్ని జాగ్రత్తగా తీసుకొచ్చి సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటానికి చూపారు. ఈ విషయంపై ఆయన వివరణ ఇస్తూ.. ఇలాగైనా సీతమ్మకు స్వామిని చూపిద్దామని ప్రయత్నం చేశానని బదులిచ్చారు.

స్పెషాలిటీ హాస్పిటల్స్ వినతిని పరిగణనలోకి తీసుకోండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వివిధ చికిత్సలకు ధరలు నిర్ణయించే అంశంలో ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఏఎస్‌హెచ్‌ఏ)వినతిని పరిగణనలోకి తీసుకొని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపి వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులిచ్చారు. తమతో పాటు నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అందించే వివిధ చికిత్సలకు ధరలు నిర్ణయించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏఎస్‌హెచ్‌ఏ అధ్యక్షుడు కె.విజయ్ కుమార్ గత డిసెంబరులో పిటిషన్ దాఖలు చేశారు.

అంబటికి నోటీసులివ్వండి

- సెక్షన్ 35(3) ప్రకారం వివరణ తీసుకోండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- గతేడాది గుంటూరులో రెండు కేసులు నమోదు
- బైక్ ర్యాలీలో ఇన్‌స్పెక్టర్‌పై దుర్భాషణలు
- చంపేస్తామని కార్మిక నాయకుడికి బెదిరింపులు
- చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలోనూ 33 కేసుల్లో నోటీసులివ్వాలని కోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గతేడాది నమోదైన రెండు కేసులలో వైసీపీ నేత అంబటి రాంబాబుకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తమ ముందున్న రెండు కేసులలో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తు చేసింది. ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేసింది. కేసులకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. వ్యాజ్యాలపై తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేసింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వెన్నుపోటు దినం పేరుతో అనుమతి లేకుండా బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు అడ్డుకున్న ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించి, దుర్భాషలాడారంటూ ఎస్ఐ నక్కా నరహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది జూన్ 4న గుంటూరు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరులోని బజరంగ్ జూట్ మిల్ భూములకు సంబంధించి యాజమాన్యం, కార్మికుల మధ్య జరుగుతున్న వివాదంపై తాను దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారని, కులం పేరుతో దూషించారని పేర్కొంటూ కార్మిక నాయకుడు పిల్లి బాబూరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2025లో గుంటూరు నగరంపాలెం పోలీసులు అంబటిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కోరుతూ అంబటి రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు.

ఆ 33 కేసుల్లోనూ నోటీసులివ్వండి

ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన మొత్తం 33 కేసులను కొట్టివేయాలని కోరుతూ అంబటి రాంబాబు అత్యవసరంగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను కోర్టు లంచ్‌మోషన్లుగా విచారణకు స్వీకరించింది. రాంబాబు తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసును ప్రధాన కేసుగా పరిగణించి, సీఆర్‌పీసీ సెక్షన్ 162 ప్రకారం మిగిలిన కేసులను వాంగ్మూలాలుగా నమోదు చేసేలా ఐవోలకు సూచనలు చేస్తామన్నారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి... ఈ 33 కేసుల్లో రాంబాబుకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఆదేశించారు. వ్యాజ్యంపై తదుపరి విచారణను మార్చి 2కి వాయిదా వేశారు.

మాపై నమోదైన కేసులు కొట్టివేయండి!

- హైకోర్టును ఆశ్రయించిన జోగి, కాకాణి

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ పర్యటన సందర్భంగా అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించారంటూ ఎస్ఐ రవివర్మ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ఈనెల 6న తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత జోగి రమేశ్ సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు ఆధారంగా తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే బాలిక అత్యాచారానికి గురై మృతి చెందిన వ్యవహారంపై ప్రభుత్వాన్ని విమర్శించానంటూ నెల్లూరు టూటౌన్ టీడీపీ అధ్యక్షుడు మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 8న నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మరో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి పిటిషన్ వేశారు.

అంబటికి 20 వరకు రిమాండ్

- పోలీసులను బెదిరించిన కేసులో కోర్టు ఆదేశం
- సీఎంను దూషించిన కేసులో షరతులతో బెయిల్
- మరికొన్ని రోజులు జైల్లోనే..
- తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు



అంబటి రాంబాబును గుంటూరు కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

గుంటూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును అసభ్యకర పదజాలంతో దూషించిన కేసులో ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో రాంబాబును నల్లపాడు పోలీసులు ఇటీవల అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్ నిమిత్తం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. బెయిల్ కోసం గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టులో రాంబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం అంబటికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ మేజిస్ట్రేట్ స్రవంతి సోమవారం తీర్పు చెప్పారు. మరోసారి ఇటువంటి నేరపూరిత చర్యలకు పాల్పడరాదని, కేసును ప్రభావితం చేసే విధంగా బెదిరింపులకు, ప్రలోభాలకు పాల్పడరాదని రాంబాబుకు షరతు విధించారు. కేసులో చార్జిషీటు దాఖలు చేసే వరకు, లేదంటే రెండు నెలల పాటు ప్రతి రెండు శనివారాలకు ఒకసారి పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకాలు చేయాలన్నారు. రూ.పదివేలతో ఇరువురు పూచీకత్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అయితే, పోలీసులను బెదిరించిన కేసులో అంబటికి మరో కోర్టు ఈనెల 20 వరకు రిమాండ్ విధించడంతో ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ గతేడాది నవంబరు 12న అంబటి రాంబాబు ఆధ్వర్యంలో గుంటూరులో వైసీపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఆ సందర్భంగా పోలీసుల సూచనలను రాంబాబు బేఖాతరు చేసి, అడ్డంగా పెట్టిన బారికేడ్లను లాగిపడేసారు. అభ్యంతరం చెప్పిన పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లును, సిబ్బందిని బెదిరించి, వారిని నెట్టుకుంటూ బ్రిడ్జి పైకి ర్యాలీగా వెళ్లారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అంబటి రాంబాబును గుంటూరులోని పట్టాభిపురం పోలీసులు సోమవారం పీటీ వారంట్‌పై రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి తీసుకొచ్చి గుంటూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ సారా దానమ్మ ఈ నెల 20 వరకు రిమాండ్ విధించారు. దీంతో తిరిగి ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

అంబటి మరికొన్ని రోజులు జైల్లోనే..

సీఎంను అసభ్య పదజాలంతో దూషించిన కేసులో అంబటి రాంబాబుకు బెయిల్ లభించినప్పటికీ, సీఐను దూషించి, బెదిరించిన కేసులో ఈనెల 20 వరకు రిమాండ్ విధించడంతో ఆయన జైలు నుంచి బయటికి వచ్చే అవకాశం లేదు. బయటికి రావాలంటే సీఐని దూషించిన కేసులోనూ అంబటి బెయిల్ పొందాల్సి ఉంటుంది. ఈలోగా సీఎంను దూషించిన ఘటనకు సంబంధించి రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసులలో పీటీ వారెంట్ దాఖలు చేస్తే ఆయనను తిరిగి సంబంధిత కోర్టుల్లో పోలీసులు హాజరుపరచాల్సి ఉంటుంది. తద్వారా ఆయన రిమాండ్ కొనసాగే అవకాశం ఉంది. అంటే అంబటి మరికొన్ని రోజులు రాజమండ్రి జైల్లోనే ఉండాల్సి ఉంటుంది.

రాష్ట్రానికి ఎడ్యుకేషన్ సిటీ..!

- కేంద్రం ప్రకటించిన ఐదింటిలో ఒకటి సాధించేందుకు ప్రయత్నం
- సీఎం ఆదేశాలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఉన్నత విద్యాశాఖ

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి రాష్ట్రంలో ప్రత్యేకంగా ఒక నగరం ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది. కేంద్రం ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన ఐదు ఎడ్యుకేషన్ సిటీల్లో రాష్ట్రానికి ఒకటి వచ్చే పరిస్థితి ఉంది. సీఎం ఆదేశాలతో ఉన్నత విద్యాశాఖ ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. 100-200 ఎకరాల్లో ఈ నగరాన్ని నిర్మిస్తారు. సాధారణ విద్యాసంస్థలకు ఇది భిన్నంగా ఉంటుంది. సాధారణ వర్సిటీలైతే వంద, రెండు వందల ఎకరాల్లో సొంతంగా ఏర్పాటవుతాయి. కానీ ఎడ్యుకేషన్ సిటీలో భవనం మినహా అన్నీ ఉమ్మడిగా ఉంటాయి. అడ్మిషన్లు తక్కువగా ఉండే అంతర్జాతీయ స్థాయి ప్రఖ్యాత వర్సిటీలను ఇందులోకి ఆహ్వానిస్తారు. నాలుగైదు ఎకరాల్లో వర్సిటీ భవనం నిర్మించుకునేలా భూమి కేటాయిస్తారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కామన్‌గా అందుబాటులోకి తెస్తారు. అన్ని ప్రముఖ వర్సిటీలు ఒకేచోట ఉంటే సమీప ప్రాంతంలో ఎడ్యుకేషన్ ఎకో సిస్టమ్ పెరుగుతుందనేది ఆలోచన. ఉమ్మడి పరిశోధనలకూ అవకాశం ఏర్పడుతుంది. ఈ సిటీలో స్కిల్ సెంటర్లు కూడా ఏర్పాటు చేస్తారు. వీటిలో హైటెక్ ల్యాబ్స్, మోడ్రన్ కాలేజీలు, పరిశోధనా కేంద్రాలు, ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో అమరావతి లేదా విశాఖపట్నంలో ఈ సిటీ ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యాశాఖ ప్రతిపాదిస్తోంది. ప్రతిపాదనల తయారీలో ఉన్నత విద్యాశాఖ నీతి ఆయోగ్ సహకారం తీసుకుంటోంది.

తెలుగు రాష్ట్రాల సొమ్ముతో గోదావరి బోర్డు సోకులు!

- పైసా పని లేకున్నా భారీగా నిధుల ఖర్చు
- ఈ-ఆఫీస్ కోసమే రూ.కోటి దాకా వ్యయం
- అద్దెకు తీసుకున్న కార్లకు అదనంగా చెల్లింపులు

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నిధుల వ్యయంలో గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలు ఇచ్చే నిధులను పొదుపుగా ఖర్చు చేయాల్సి ఉండగా, విరుద్ధంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులను కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల సమ్మతి, సమన్వయంతో ఈ బోర్డులు పనిచేయాలి. బోర్డులు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా... తెలుగు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి. కానీ, నిధుల వ్యయం విషయంలో గోదావరి బోర్డు ఇలాంటివేవీ పాటించడం లేదు. ఒకవైపు కృష్ణా బోర్డు కేంద్రం సహకారంతో ఉచితంగా ఈ-ఆఫీస్(ఎలక్ట్రానిక్ కార్యకలాపాల అమలు)ను వినియోగించుకుంటుండగా, ఇందుకోసం గోదావరి బోర్డు రూ.కోటి దాకా వెచ్చించింది. అద్దె వాహనాలకు తెలుగు రాష్ట్రాలు రూ.34వేలు చెల్లిస్తుండగా.. గోదావరి బోర్డు మాత్రం రూ.45వేలు చెల్లిస్తోంది. ఇదేంటని అధికారులు ప్రశ్నిస్తే.. కేంద్రం మాదిరిగానే తామూ చెల్లిస్తున్నామని బదులిచ్చింది. వారానికి ఆరు రోజుల పనిదినాలు ఉంటేనే తాము రూ.34వేలు చెల్లిస్తుంటే.. ఐదు రోజుల పనిదినాలకే రూ.45వేలు చెల్లించడంపై అధికారులు మండిపడుతున్నారు. జలసౌధ భవనం మొత్తానికి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల వ్యవస్థ ఉండగా.. బోర్డు కార్యాలయం వరకే ప్రత్యేకంగా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవడంపైనా విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి జలాశయాలు కావడంతో ఏటా తెలుగు రాష్ట్రాల మధ్య లెక్కలేనన్ని ఫిర్యాదులు అందుతుంటాయి. వీటిని సమన్వయం చేసుకొని, రాష్ట్రాలకు లేఖలు పంపించడం, కేంద్రంతో సంప్రదింపులు జరపడం వంటి పనులతో కృష్ణాబోర్డు నిత్యం బిజీగా ఉంటుంది. గోదావరి బేసిన్‌లో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి తగాదాలు లేవు. పెద్దవాగు ప్రాజెక్టు ఒక్కటే ఉమ్మడిగా ఉంది. ఈ క్రమంలో గోదావరి బోర్డుకు పెద్దగా పని లేకున్నా.. ఇష్టారాజ్యంగా నిధులు ఖర్చు చేస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి.

సిబ్బంది పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థ

స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల అధికారుల జాబ్ చార్ట్ విడుదల

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్వర్ణ గ్రామ-స్వర్ణవార్డు సచివాలయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. 15,004 సచివాలయాల్లోని సిబ్బందిని పర్యవేక్షించేందుకు మూడంచెల వ్యవస్థను రూపొందించింది. జిల్లా, మండల స్థాయి అధికారుల పాత్ర, బాధ్యతలపై మార్గదర్శకాలు విడుదల చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు ఆఫీసర్, మండల స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు ఆఫీసర్లకు సంబంధించి జాబ్‌చార్ట్‌ను విడుదల చేసింది. దీనికోసం పంచాయతీరాజ్ శాఖకు చెందిన 17 మంది జడ్పీ సీఈవో స్థాయి అధికారులను, మున్సిపల్ శాఖకు చెందిన 9 మందిని జిల్లా అధికారులుగా నియమించనున్నారు. వీరు జిల్లా స్థాయిలో సచివాలయాలకు సంబంధించి పూర్తి పర్యవేక్షణ బాధ్యత వహిస్తారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సచివాలయాల ద్వారా అమలు చేసేందుకు ఆయా జిల్లాల తరపున బాధ్యత తీసుకుంటారు. సిబ్బందిపై వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్లకు సమర్పిస్తారు. అలాగే ఎంపీడీవోల ద్వారా ఖాళీగా ఉన్న డీడీవో పోస్టులను భర్తీ చేసి, జీతాలు డ్రా చేసేందుకు ఇబ్బందులు లేకుండా చూస్తారు. అదే విధంగా మండల స్థాయిలో స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు అధికారులు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.

ఉద్యోగుల హక్కుల సాధనకు కార్యాచరణ

ఏపీఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ (గాంధీనగర్), ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు చట్టపరంగా రావాల్సిన హక్కులను దశలవారీగా సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఏపీఎన్జీజీవో రాష్ట్ర నూతన అధ్యక్షుడు విద్యాసాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత, సీపీఎస్ ఉద్యోగులకు న్యాయమైన పింఛన్ విధానం, మెరుగైన వైద్య సేవలు, పీఆర్సీ నియామకం, ఐఆర్ మంజూరు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన రాష్ట్ర కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా డీవీ రమణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా కిలారు జగదీశ్వరరావు, సహాధ్యక్షులుగా వి.దస్తగిరి, ఉపాధ్యక్షులుగా ఎల్.బొంజయ్య, ఆర్ఎస్ హరినాథ్, షేక్ జానీపాషా, పి.కిరణ్ కుమార్, ఎస్కే నాగుర్ షరీఫ్, వై.ప్రసాద్, ఎస్.రాజశేఖర్, ఆర్.రవిశంకర్, ఎం.సత్యనారాయణ,రాజు, బి.వెంకటేశ్‌బాబు, ఆర్.వేణుగోపాల్, టి.ఏసుబాబు, కార్యదర్శులుగా ఎల్.రజనీష్‌బాబు, ఎస్‌బీబీ రాంప్రసాద్, ఎ.రంజిత్‌కమార్ నాయుడు, పి.శివప్రసాద్, వి.సుబ్బారెడ్డి, కోశాధికారిగా ఎన్.భారతీ ప్రసాద్, మహిళా విభాగం కార్యదర్శిగా ఎం.సరస్వతి, ప్రచార కార్యదర్శిగా బి.జానకిలకు స్థానం లభించిందని వివరించారు.

కారుణ్య కొలువుకు మోక్షమెప్పుడు?

కరోనా సమయంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న 922 మంది ఉపాధ్యాయులు మృతిచెందారు. 2020లో ఈ మరణాలు సంభవించాయి. నిబంధనల ప్రకారం వారి కుటుంబ సభ్యులకు 'కారుణ్య నియామకం' కింద వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ అప్పటి అధికారులు పెద్దగా స్పందించలేదు. దీంతో నాటి సీఎం జగన్‌ను కలిసి సమస్యను వివరిద్దామని బాధితులు ప్రయత్నించారు. కానీ, వారిని ఆయన కరుణించలేదు. ఆరేళ్లు దాటి పోతున్నా... మరణించిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యుల 'కారుణ్య' రోదన అరణ్య వేదనగానే మిగిలిపోయింది.

- కరోనాతో మరణించిన 922 మంది టీచర్లు
- ఉద్యోగాల కోసం కుటుంబాల ఎదురుచూపు
- ఖాళీలు లేవంటున్న జడ్పీ అధికారులు
- కలిసేందుకూ ఇష్టపడని నాటి సీఎం జగన్
- ఇటీవల స్పందించిన ఉపముఖ్యమంత్రి పవన్
- కానీ, జీఏడీలో పలు అంశాలపై మెలికలు

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)



కరోనా కాలంలో(2019-2020) చాలా మంది వైరస్ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. వీరిలో రాష్ట్ర వ్యాప్తంగా 922 మంది ప్రభుత్వ టీచర్లు ఉన్నారు. ప్రభుత్వం 2012లో విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం సర్వీస్‌లో ఉండి మరణించిన ఉపాధ్యాయుల కుటుంబసభ్యులకు జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల్లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలి. ఈ నిబంధన నేపథ్యంలోనే కరోనాతో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబసభ్యులు ఉద్యోగాల కోసం జిల్లా పరిషత్‌లకు దరఖాస్తు చేసుకున్నారు. ఒకేసారి వందల దరఖాస్తులు రావటంతో తమ వద్ద అన్ని ఖాళీలు లేవని అధికారులు తేల్చిచెప్పారు. చేసేది లేక బాధితులు సమస్య వివరించేందుకు నాటి సీఎం జగన్‌ను కలిసే ప్రయత్నం చేసినా ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని బాధితులు తెలిపారు.

కూటమి లోనే కదలిక..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధితులు తమ సమస్యను పంచాయతీ రాజ్ శాఖను నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి జిల్లా పరిషత్‌లలో తగినన్ని ఖాళీలు లేనప్పుడు కలెక్టర్లకు ఈ బాధ్యతను అప్పగించాలని అధికారులకు సూచించారు. ఇది జరిగి కూడా చాలా నెలలు అయింది. డిప్యూటీ సీఎం సూచనతో సంబంధిత ఫైల్‌ను జీఏడీ(సాధారణ పరిపాలనా విభాగం)కు పంపారు. అక్కడి అధికారులు మాత్రం గడచిన సంవత్సర కాలంగా బాధితులను కార్యాలయం చుట్టూ తిప్పుతూనే ఉన్నారు. కొర్రీలతో కాలయాపన చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

జిల్లాల వారీగా మరణాలు..	
శ్రీకాకుళం	105
విజయనగరం	51
విశాఖపట్నం	32
తూర్పు గోదావరి	96
పశ్చిమ గోదావరి	28
కృష్ణా	50
గుంటూరు	106
ప్రకాశం	115
నెల్లూరు	106
కర్నూలు	95
కడప	28
చిత్తూరు	38
అనంతపురం	72

ఉద్యోగం లేదు.. పెళ్లి కాదు..

ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులు ఆకస్మికంగా మరణించటంతో వారి పిల్లల జీవితాలు రోడ్డున పడ్డాయి. చాలా మంది పెళ్లిళ్లు కూడా అర్థాంతరంగా ఆగిపోయాయి. తల్లిదండ్రుల మరణంతో పిల్లలకు ఉద్యోగం వస్తుందన్న ఆలోచనతో కొందరు సంబంధాలు కుదుర్చుకున్నారు. ఉద్యోగం రావటం ఆలస్యం అవుతోందని తెలియడంతో పెళ్లి సంబంధాలు చాలా వరకు రద్దయ్యాయి. కొందరికి కుటుంబ పెన్షన్ వస్తోంది. తల్లిదండ్రులు ఇద్దరు మరణించటంతో కొందరికి ఆ పెన్షన్ కూడా రాని పరిస్థితి నెలకొంది. తల్లి దండ్రులు ఉన్నప్పుడు హాయిగా బతికిన పిల్లలను ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందులు చుట్టు ముట్టడంతో ప్రస్తుతం వారి జీవనం ఇబ్బందుల్లో పడింది. ఈ నేపథ్యంలోనే పల్నాడు జిల్లాకు చెందిన ఒక బాధితురాలు కొద్ది రోజుల కిందట బలవన్మరణానికి ప్రయత్నించారు. పొరుగు ఇంట్లో ఉన్న వాళ్లు గమనించి ఆమెను కాపాడారు.

జగన్‌కు జాలి లేదు



మా తల్లిదండ్రులు ఎంతో మందికి చదువులు చెప్పారు. వారి మరణం తర్వాత మా జీవితాలు రోడ్డున పడ్డాయి. ఒక్కోసారి చనిపోవాలని అనిపిస్తోంది. అధికారులు మమ్మల్ని ఇంతగా ఇబ్బంది పెట్టటం ధర్మమా?. కూటమి ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. జగన్ ప్రభుత్వం ఎటూ జాలి చూపించలేదు.

\- సీహెచ్ సువర్ణ కుమార్, గుంటూరు

రోజొక యుగంలా గడుస్తోంది



నాన్న ఉన్నప్పుడు రోజులు ఎలా గడిచాయో కూడా తెలియలేదు. ఇప్పుడు రోజొక యుగంలా గడుస్తోంది. ఎక్కడికి వెళ్లాలో.. ఎలా బతకాలో అర్థం కావటం లేదు. ఉద్యోగం వస్తే కుటుంబాన్ని బతికించుకోగలను. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

\- బి రామలక్ష్మి, ప్రకాశం

కూటమి ప్రభుత్వం పైనే ఆశలు



జగన్ ప్రభుత్వం మా బాధలు తెలుసుకోవడానికి కూడా ప్రయత్నం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సమస్య పరిష్కారం కోసం చర్యలు మొదలయ్యాయి. ఆర్థికంగా, సామాజికంగా ఎన్నో ఇబ్బందులు, అవమానాలు భరిస్తున్నాం. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు మాపై కరుణ చూపాలి.

\- మాదాను విజయ్ కుమార్, విజయనగరం

మా బాధలు ఆలకించండి



మా సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లిన తర్వాత ఆయన స్పందించారు. ఆ తర్వాత ఫైల్‌ను జీఏడీకి పంపారు. అక్కడ అధికారులు ఆలస్యం చేస్తున్నారు. రోజులు గడవడం చాలా కష్టంగా ఉంది. ఆరేళ్లుగా అల్లాడి పోతున్నాం. మా బాధలు ఇప్పటికైనా ఆలకించి న్యాయం చేయాలి.

\- ఎస్‌కె షబ్బీర్, గుంటూరు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మళ్లీ సెన్సార్‌బోర్డు పరిశీలనకు 'జననాయగన్'

● చిత్ర నిర్మాణ సంస్థ నిర్ణయం



తమిళగ వెట్రి కళగం(టీవీకే) నేత, సినీ నటుడు విజయ్ నటించిన 'జననాయగన్' చిత్రాన్ని మళ్లీ సెన్సార్ బోర్డు పరిశీలనకు పంపాలని ఆ చిత్ర నిర్మాణ సంస్థ నిర్ణయించింది. ఈ చిత్రం సంక్రాంతి ముందు విడుదల కావాల్సింది. సెన్సార్‌బోర్డు సర్టిఫికెట్ లభించకపోవడంతో విడుదల కాలేదు. ప్రస్తుతం ఆ చిత్రనిర్మాణ సంస్థ, సెన్సార్‌బోర్డు మధ్య చట్టపరమైన వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదాలపై మద్రాసు హైకోర్టు విచారణ జరుపుతోంది. ఈ పరిస్థితుల్లో సెన్సార్‌బోర్డుకు చెందిన అధికారి ఒకరు ప్రైవేటు వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జననాయగన్ చిత్రానికి సంబంధించి సెన్సార్‌బోర్డు విధివిధానాల ప్రకారం తదుపరి చర్యలు పకడ్బందీగా సాగుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ సెన్సార్‌బోర్డును మళ్లీ ఆశ్రయించేందుకు సిద్ధమైంది. ఈ వివాదం త్వరలోనే కొలిక్కివచ్చి 'జననాయగన్' విడుదల కానుందని తెలుస్తోంది. చెన్నై(ఆంధ్రజ్యోతి)

అదిరిపోయేలా పరిచయ గీతం

నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో నాని పరిచయ గీతం 'ఆయా షేర్' పాట చిత్రీకరణను మొదలుపెట్టారు మేకర్స్. ఈ పాట ఆయన కెరీర్‌లో చాలా కాలం గుర్తుండిపోయేలా ఉండేలా ఉండనుందని తెలిపారు. ఇందులోని స్టెప్స్, విజువల్స్ అదిరిపోతాయని చెప్పారు. సుధన్ మాస్టర్ నృత్యరీతులు సమకూరుస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. మోహన్‌బాబు, రాఘవ్ జుయాల్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి.




'ఇళయరాజా' బయోపిక్ ఆగిపోలేదు : ధనుష్ టీమ్ వెల్లడి



ధనుష్ హీరోగా ప్రారంభించిన 'ఇళయరాజా బయోపిక్' మూవీ అర్థాంతరంగా ఆగిపోయిందంటూ సాగుతున్న ప్రచారాన్ని ధనుష్ టీమ్ తోసిపుచ్చింది. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని సోమవారం స్పష్టం చేసింది. ప్రస్తుతం ధనుష్ హీరోగా నటిస్తున్న వర్కింగ్ టైటిల్ 'డి-55' పూర్తయిన తర్వాత ఇళయరాజా బయోపిక్ మూవీ చిత్రీకరణ పనులు పునఃప్రారంభమవుతాయని తెలిపింది. ధనుష్ ప్రధాన పాత్రలో అరుణ్ మాదేశ్వరన్ దర్శకత్వంలో ఈ ప్రాజెక్టును గత యేడాది గ్రాండ్‌గా ప్రకటించిన విషయం తెల్సిందే. ఆ తర్వాత దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌ను హీరోగా పరిచయం చేస్తూ అరుణ్ మాదేశ్వరన్ 'డీసీ'ని ప్రకటించారు. దీంతో 'ఇళయరాజా బయోపిక్' నుంచి అరుణ్ వైదొలగారని, ఆయన స్థానంలో మరో దర్శకుడు బాధ్యతలు చేపట్టనున్నారంటూ ప్రచారం సాగగా, వీటిని ధనుష్ టీమ్ తాజాగా కొట్టిపారేసింది. అరుణ్ చేపట్టిన ప్రాజెక్టు పూర్తికాగానే ఈ చిత్రం పనులు ప్రారంభమవుతాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని స్పష్టం చేసింది. చెన్నై (ఆంధ్రజ్యోతి)

అప్పుడు 'షోలే'.. ఇప్పుడు 'ధురంధర్'





కొత్త చిత్రాలు వస్తున్నా.. బాక్సాఫీసు దగ్గర పోటీ పెరుగుతున్నా 'ధురంధర్' చిత్రం హవా ఇంకా కొనసాగుతూనే ఉంది. రణ్‌వీర్ సింగ్, అక్షయ్ ఖన్నా, సంజయదత్ తదితరులు నటించిన ఈ చిత్రం జోరు తగ్గకుండా రెండు నెలలుగా బాక్సాఫీసు దగ్గర సందడి చేస్తూనే ఉంది. ఓటీటీలో వచ్చిన తర్వాత వసూళ్లు కొంత మేరకు తగ్గాయి కానీ బాక్సాఫీసు దగ్గర ఆ ప్రభావం అలాగే ఉంది. రూ. 280 కోట్లు బడ్జెట్‌తో తయారైన 'ధురంధర్' చిత్రం ఇప్పటికే రూ. 1304.5 కోట్లు వసూలు చేసి టాప్ ఫోర్ గ్రాసర్స్‌లో ఒకటిగా నిలిచింది. ఆరు గల్ఫ్ దేశాల్లో ఈ సినిమాను నిషేధించారు కానీ లేకపోతే మరో రూ వంద కోట్లు అదనంగా వసూలు చేసి ఉండేదేమో! చిత్ర నిర్మాత జ్యోతి దేశ్‌పాండే తమ సినిమా సక్సెస్ పై ఆనందం వ్యక్తం చేస్తూ 'యాభై ఏళ్ల క్రితం వచ్చిన 'షోలే' సినిమాను జనం పదేపదే చూశారు. అందులో నటుల గురించి, డైలాగుల గురించి ఎంతో చెప్పుకున్నారు. మళ్లీ ఇంతకాలానికి 'ధురంధర్' చిత్రానికి అటువంటి ఘనత దక్కింది. రెండు నెలలుగా మా సినిమాను చూసిన వాళ్లే మళ్లీ మళ్లీ చూశారు. ఇటువంటి రికార్డు మరే చిత్రానికీ లేదని చెప్పగలను. ఈ విజయం మాది కాదు.. ప్రేక్షకులది. డబ్బుతో కొనలేని విజయం ఇది' అని అన్నారు.



మార్చి 19న విడుదలయ్యే 'ధురంధర్ 2' చిత్రం మీద జ్యోతి పూర్తి నమ్మకంతో ఉన్నారు. 'ధురంధర్' చిత్రం రెండు భాగాలను ఒకేసారి షూట్ చేశాం. అయితే మొదటి భాగం విజయం సాధించి ఉండకపోతే రెండో భాగం విషయం మరచిపోయేవాళ్లం. కానీ మా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ముందు నుంచీ ఉంది. రెండో భాగం మరింత ఆకట్టుకుంటుందని నా నమ్మకం. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేస్తున్నాం' అని చెప్పారు జ్యోతి పాండే. మార్చి 19న 'ధురంధర్ 2' తెలుగులోనూ విడుదల కానుంది.

అన్నీ మర్చిపోయి కడుపుబ్బా నవ్వుకుంటారు



విష్వక్సేన్

విష్వక్సేన్ కథానాయకుడిగా అనుదీప్ కేవీ తెరకెక్కించిన చిత్రం 'ఫంకీ'. కయాదు లోహర్ కథానాయిక. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయిసౌజన్య నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ నెల 13న చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'యమ యమ్మ' అనే పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా విష్వక్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమాను మీకు అందివ్వాలనే ఉద్దేశంతో చేసిన సినిమా 'ఫంకీ'. కుటుంబమంతా కలసి సినిమాకు రండి. రెండు గంటల పాటూ అన్నీ మర్చిపోయి కడుపుబ్బా నవ్వుకునేలా చేస్తుంది' అని చెప్పారు. దేవ్ పవార్ రచించగా, భీమ్స్ సిసిరోలియో, రోహిణి ఆలపించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.



అలాంటి హై అందరికీ రావాలి

సాయి కృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'హై'. అనన్య శర్మ కథానాయిక. ఇమేజ్ స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ బ్యానర్లపై హరీష్ పెద్ది, ఎస్.కృష్ణ, శేఖర్ దివ్వెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ని విక్టరీ వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ 'సాయి మంచి ప్యాషన్ ఉన్న వ్యక్తి. తప్పకుండా ఆయన ప్రయత్నం విజయవంతం అవుతుంది' అని అన్నారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ 'సాయికి ఈ చిత్రంతో మంచి గుర్తింపు వస్తుంది' అని అన్నారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఒక కొత్త జోనర్‌లో విభిన్నమైన స్క్రీన్‌ప్లేతో తీసిన ఈ సినిమాకు హై అనే టైటిల్ పెట్టారు. అలాంటి హై అందరికీ రావాలి' అని అన్నారు.

ఎన్నో ఆశలతో అమెరికా వెళ్తే..



తరుణ్ భాస్కర్, ఫరియా అబ్దుల్లా జంటగా కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'గాయపడ్డ సింహం. సప్తస్య మీడియా వర్క్స్, పీఓవీ స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేశ్ బన్సల్ నిర్మించారు. పవన్ సాదినేని సమర్పిస్తున్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్ర బృందం టీజర్‌ని విడుదల చేసింది. ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన ఓ యువకుడికి అక్కడ ఎదురైన అనుభవాల నేపథ్యంలో చిత్ర కథ సాగుతుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ 'సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఆద్యంతం నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు. డైరెక్టర్ కశ్యప్ మాట్లాడుతూ 'తరుణ్ భాస్కర్ మొదట సినిమా చేయనన్నారు. కానీ కథ పూర్తిగా విన్నాక ఒప్పుకున్నారు' అని అన్నారు. నిర్మాతలు విజయ్ కృష్ణ, భాను కిరణ్ , ఫరియా అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వస్తున్న మనసంతా నువ్వే



టాలీవుడ్ లవ్ క్లాసిక్స్ చిత్రాల్లో 'మనసంతా నువ్వే' స్థానం ప్రత్యేకం. అప్పట్లో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ సున్నితమైన ప్రేమకథ, మళ్లీ వెండితెరపైన అలరించడానికి సిద్ధమైంది. దివంగత నటుడు ఉదయ్ కిరణ్ హీరోగా, వి.ఎన్. ఆదిత్య దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రాన్ని ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న గ్రాండ్‌గా రీ రిలీజ్ చేయబోతున్నారు. ఎంఎస్ రాజు నిర్మించిన ఈ చిత్రంలో ఉదయ్‌కిరణ్, తనూరాయ్ నటన, రీమాసేన్ అందం ప్రేక్షకులను అలరించాయి. ఈ చిత్రాన్ని నిర్మాత నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి రీ రిలీజ్ చేస్తున్నారు. మళ్లీ ఉదయ్‌కిరణ్ మ్యాజిక్ థియేటర్లలో చూడాలనుకునే ప్రేక్షకులకు ఇదొక అద్భుతమైన అవకాశం అని నిర్మాతలు అన్నారు.



ప్రేక్షకులు ఆదరిస్తున్నారు

అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన 'సుమతీ శతకం' ఇటీవలే విడుదలై విజయవంతంగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో దర్శకుడు ఎంఎమ్ నాయుడు మాట్లాడుతూ 'ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు. నిర్మాత సాయిసుధాకర్ కొమ్మాలపాటి మాట్లాడుతూ 'సుమతీ శతకం' చూసిన అందరూ కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం అని ప్రశంసిస్తున్నారు. ఈ విజయం పట్ల టీమ్ అంతా సంతోషంతో ఉంది' అని చెప్పారు. 'ఈ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ దక్కుతోంది. ఈ సినిమాకు పనిచేసిన వారందరికీ మంచి భవిష్యత్తు ఉండబోతోంది' అని తెలిపారు.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్ కొట్టివేత

మాచర్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిల బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు కొట్టివేసింది. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో గతేడాది మే 24న జరిగిన టీడీపీ నేతలు జెవి శెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు జెవిశెట్టి కోటేశ్వరరావు జంట హత్యల కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఏ6), పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(ఏ7), పిన్నెల్లి వెంకటరెడ్డి(ఏ8)గా ఉన్నారు. వీరిలో వెంకటరెడ్డి గతేడాది డిసెంబరు 1న, మిగిలిన ఇద్దరు డిసెంబరు 11న మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. బెయిల్ కోసం వీరు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం గురజాలలోని పదో అదనపు జిల్లా జడ్జి కోర్టులో వాదనలు జరిగాయి. అనంతరం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ న్యాయాధికారి జి.ప్రియదర్శిని ఆదేశాలు ఇచ్చారు.

నకిలీ మద్యం కేసులో.. సెంథిల్ కుమార్‌కు 19 వరకు రిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుడు సెంథిల్ కుమార్‌కు బెజవాడ కోర్టు ఈనెల 19వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం తయారీ కేంద్రంపై భవానీపురం ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో ఇతను ఏ22గా ఉన్నాడు. ఎక్సైజ్ పోలీసులు సోమవారం విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సెంథిల్ కుమార్‌ను హాజరుపరచగా 19 వరకు రిమాండ్ విధించారు. కాగా, నకిలీ మద్యం తయారీ కేసులో ఏ21గా ఉన్న సుదర్శన్ బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం వాదనలు పూర్తయ్యాయి. దీంతో న్యాయాధికారి జి.లెనిన్‌బాబు తీర్పును 17వ తేదీకి వాయిదా వేశారు.

ఏపీలో రూ.2,279 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.2,279.16 కోట్లు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో సోమవారం టీడీపీ ఎంపీ జీఎం హరీశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ.. గత నెల 28 నాటికి రాష్ట్రంలో సుమారు రూ.2,279.16 కోట్ల నిధులు క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయాయని, ఈ సొమ్మును అసలైన యజమానులకు లేదా వారి వారసులకు చేర్చేందుకు కేంద్రం, ఆర్‌బీఐ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాయన్నారు. 'మీ సొమ్ము-మీ హక్కు' అనే ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏపీలో 158 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 34,455 ఖాతాలకు సంబంధించి రూ.161.69 కోట్లను సెటిల్ చేశామన్నారు. కోనసీమ జిల్లాలో 1,899 ఖాతాలకు చెందిన రూ.5.08 కోట్లను వారసులకు అందజేసినట్లు తెలిపారు.

పీఎం ఉష కింద ఏపీకి రూ.378 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో పీఎం ఉష పథకం (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) కింద ఏపీలో 33 యూనిట్లకు ఆమోదం తెలిపామని రూ.378.71 కోట్ల ఆర్థిక సహాయం అందించామని కేంద్ర సహాయ మంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. లోక్‌సభలో ఎంపీ సీఎం రమేష్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈమేరకు సమాధానమిస్తూ అనకాపల్లి నియోజకవర్గంలో రూసా, పీఎం ఉష కింద 12 యూనిట్లకు రూ.157 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఏపీ నుంచి తెలంగాణకు 408 కోట్లు రావాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లోని హైకోర్టు, రాజ్‌భవన్ వంటి ఉమ్మడి రాజ్యాంగ, చట్టబద్ధ సంస్థల నిర్వహణ కోసం చేసిన ఖర్చుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ. 408.48 కోట్లు రీయింబర్స్‌మెంట్ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరిందని కేంద్రం తెలిపింది. ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

వ్యవ'సాయానికి' ఏఐ

▸▸ వధ్వానీ ఏఐతో వ్యవసాయ శాఖ ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధ అమలుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ, వధ్వానీ ఏఐ(న్యూఢిల్లీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ సమక్షంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, వధ్వానీ ఏఐ డైరెక్టర్ జేపీ త్రిపాఠి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో రైతు కేంద్రీకృత సేవల విస్తరణతోపాటు వ్యవసాయ విస్తరణను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకునేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్లు మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగానికి ఈ ఒప్పందం కీలకమౌతుందన్నారు. ముందస్తు అంచనా విశ్లేషణల ద్వారా పంటల తక్షణ స్థితి, పురుగులు, తెగుళ్లపై హెచ్చరికలు, డేటా ఆధారంగా రైతులకు సలహాలు ఇచ్చేందుకు కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థ పని చేస్తుందని వివరించారు.

ఇంక్రిమెంట్, ప్రమోషన్ చానల్ మంజూరు చేయండి

▸▸ హైకోర్టును ఆశ్రయించిన 'సచివాలయ' ఉద్యోగుల సంఘం

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌తో పాటు ప్రమోషన్ చానల్ మంజూరు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఆర్థిక, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శులు, గ్రామ-వార్డు సచివాలయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వలమల శ్రీనివాసరావు హైకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది కోటా కృష్ణ దీప్తి వాదనలు వినిపించారు.

ప్రజలపై జగన్ ప్రతీకార యాత్రలు

▸▸ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్రశేషు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో ల్యాండ్, శాండ్, వైన్స్, మైన్స్ ఇలా అన్నింటిలో అవినీతికి పాల్పడ్డారు. అది సరిపోలేదని... ఆఖరికి కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ప్రసాదం లడ్డూ కల్తీకి పాల్పడ్డారు' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'తిరుమల లడ్డూను కెమికల్స్ వాడి తయారు చేయడం క్షమించరాని నేరం. దీనిపై దేశ ప్రజలకు, వేంకటేశ్వర స్వామి వారి భక్తులకు వైఎస్ జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి. గంజాయి బ్యాచ్, దొంగలు, రౌడీలు, బూతుల నేతల కోసం పరామర్శ యాత్రల పేరిట ప్రజలపై ప్రతీకార యాత్రలు చేస్తూ జగన్ అమాయకులను బలి తీసుకుంటున్నారు' అని శ్యామ్ విమర్శించారు.

మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

▸▸ నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు 45 రోజులు శిక్షణ: మంత్రి ఫరూక్

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. సోమవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నీట్, ఈఏపీ సెట్‌ల పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించి వైద్య, ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు వీలుగా శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలతో 45రోజులపాటు అందిస్తామన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన ఉంటుందన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ కోసం సీఈడీఎం వెబ్‌సైట్ www.apced-mmwd.org లేదా cedmap2017@gmail.com ఫోన్ నంబర్-0866-2970567, మొబైల్ నంబర్ 7386789966ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

కల్తీ నెయ్యి ఘోర అపచారం

సీఎం చంద్రబాబుకు శ్రీవారి ఆలయ పెద్దజీయర్ లేఖ



తిరుమల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 'కల్తీ జరిగిందని తెలిసీ అదే నెయ్యిని పవిత్ర ప్రసాదంలో కొనసాగించడం ఘోర అపచారమే కాకుండా ధర్మానికి విరుద్ధమైన, అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య' అని తిరుమల శ్రీవారి ఆలయ పెద్దజీయర్ స్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీనెయ్యి అంశంపై ఆయన స్పందిస్తూ.. సోమవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'కలియుగ ప్రత్యక్ష దైవంగా హిందువులు ఆరాధించే వేంకటేశ్వరస్వామికి నిత్యం పవిత్ర భావంతో నైవేద్యంగా సమర్పించే అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు కోట్లాది మంది భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలు. లడ్డూ ప్రసాదాలు తయారు చేసే నెయ్యి కల్తీ అయినట్లు సీబీఐ నిర్ధారించడం మమ్మల్ని తీవ్ర దిగ్భ్రాంతికి, మనోవేదనకు గురిచేసేంది. భక్తులు పవిత్ర హృదయంతో స్వీకరించే లడ్డూప్రసాదానికి సంబంధించి ఇలాంటి అవకతవకలు చోటు చేసుకోవడం సనాతన హిందూ ధర్మాన్ని అనుసరించే వారి మనోభావాలను తీవ్రంగా గాయపరిచింది. శ్రీవారికి పరమభక్తుడైన మీరు భవిష్యత్‌లో ఇలాంటి అపచారాలకు అవకాశం లేకుండా పటిష్ఠమైన వ్యవస్థను నెలకొల్పుతారని విశ్వసిస్తున్నాం. ధర్మాన్ని పరిరక్షించే శక్తిని, ఆలయాల పవిత్రతను కాపాడే దృఢ సంకల్పాన్ని, మన సంప్రదాయాలను నిలబెట్టే స్ఫూర్తిని వేంకటేశ్వరస్వామి మీకు కల్పించాలి' అంటూ ఆయన సీఎంకు లేఖ పంపారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించాలి

- గత ప్రభుత్వంలో తిరుమలలో కుట్రలు, కుతంత్రాలే
- వైసీపీ నేతలు తప్పుచేసి కాలకేయుల్లా మాట్లాడుతున్నారు
- సాధుసంతుల సమన్వయకర్త అట్లూరి నారాయణ రావు
- అలిపిరిలో హిందూ ధార్మిక సంఘాల నిరసన
- వైసీపీని ప్రజలు స్వచ్ఛందంగా బహిష్కరించాలని పిలుపు



అలిపిరి గరుడ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు

తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన దోషులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి వెంటనే శిక్షించాలని సాధుసంతుల సమన్వయకర్త అట్లూరి నారాయణ రావు డిమాండ్ చేశారు. తిరుపతిలోని అలిపిరి గరుడ సర్కిల్ వద్ద సోమవారం హిందూ ధార్మిక సంఘాలు నిరసన ప్రదర్శన చేపట్టాయి. స్వామి వారి పేరిట 1001 టెంకాయిలు కొట్టి వేడుకున్నారు. ఈ సందర్భంగా అట్లూరి మాట్లాడారు. 'శ్రీవారి లడ్డూ ఇంట్లో ఉంటే వారం రోజులపాటు పరిమళం తగ్గేది కాదు. అదే లడ్డూ వైసీపీ హయాంలో రుచి చూసిన వారికి స్పష్టంగా అర్థమైవుంటుంది. తిరుమల నుంచి తిరుపతికి వచ్చేసరికే లడ్డూ విరిగిపోయేది. వైసీపీ నేతలు చేసిన తప్పును ఒప్పుకోకుండా బాహుబలి సినిమాలో కాలకేయులు మాట్లాడినట్టు మాట్లాడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమలలో కుట్రలు, కుతంత్రాలే జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి క్షేత్ర ప్రాబల్యాన్ని తగ్గించడానికి వైసీపీ ప్రభుత్వం పనిచేసింది. వేంటేశ్వర స్వామి భక్తులు, ప్రజలు వైసీపీని స్వచ్ఛందంగా బహిష్కరించాలి. కల్తీ నెయ్యి శ్రీవారి ప్రసాదాలు తయారుచేసి హిందువుల ఆరోగ్యంతో చెలగాటమాడటం దారుణం. ప్రమాదకర రసాయనాలు కలిపిన విషయం సిట్ నివేదికలో బయటపడిన తర్వాత కూడా వైసీపీ ప్రభుత్వం లడ్డూలో కల్తీ జరగలేదని చెప్పడం వెనుక పెద్దల కుట్రలు దాగివున్నాయి. వేంకటేశ్వర స్వామికి, భక్తులకు వైసీపీ నేతలు క్షమాపణలు చెప్పాలి. వైవీ సుబ్బారెడ్డి పీఏ చినఅప్పన్న అకౌంట్‌లోకి రూ.24 కోట్లు ఎలా వచ్చాయనే విషయమై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. తిరుమల, తిరుపతి క్షేత్రాలతో పాటు టీటీడీపై దుష్ప్రచారం చేసే వారిపై తక్షణమే పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయాలి. కల్తీనెయ్యి వ్యవహారంపై త్వరలోనే రాష్ట్రపతిని కలుస్తాం' అని చెప్పారు. అనంతరం శివకామేశ్వరి పీఠం శివానంద స్వామి, తుమ్మ ఓంకార్, రాజేశ్వరానంద స్వామి, కాలభైరవస్వామి మాట్లాడారు. 'గత ప్రభుత్వానికి మానం, అభిమానం ఉంటే చేసిన తప్పును భేషరతుగా ఒప్పుకోవాలి. వైసీపీ నేతలు కల్తీచేసి కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తొలుత కల్తీ జరగలేదన్నాడు. తాజాగా కల్తీ జరిగిందని ఒప్పుకొన్నాడు. ఆయన పీఏ అప్పన్న గత ప్రభుత్వంలో తిరుమలలో చక్రం తిప్పాడు. లడ్డూల ద్వారా రూ.250కోట్లు కమీషన్ల రూపంలో లావాదేవీలు జరిగాయి' అన్నారు. ఈ కార్యక్రమంలో అంజలి మాత, ఓంశ్రీ మాత తదితరులు పాల్గొన్నారు.

'లడ్డూ జీహాద్' జరిగిందేమో!



- కల్తీపై అప్పటి పాలకవర్గం క్షమాపణ చెప్పాలి
- సిట్ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): లడ్డూ కల్తీపై అప్పటి టీటీడీ పాలకవర్గం నైతిక బాధ్యత వహించి, హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. లడ్డూ కల్తీపై ప్రపంచవ్యాప్తంగా హిందువులందరూ ఆందోళన చెందుతున్నారని, దీనిపై రాజకీయాలు చేయడం తక్షణమే మానుకోవాలని, లడ్డూ పవిత్రతను కాపాడాలని కోరారు. సోమవారం విశాఖ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో శ్రీవారి లడ్డూలో నాణ్యత లేదని, కల్తీ జరిగిందని కూటమి నాయకులు మాట్లాడినా తాము పట్టించుకోలేదని తెలిపారు. కానీ ప్రస్తుతం సిట్ నివేదిక చూసి హిందువుల గుండెలు పగిలాయన్నారు. లవ్ జీహాద్ తరహాలో లడ్డూ జీహాద్ జరిగిందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. రసాయనాలు కలిసిన లడ్డూ తిని అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని, హిందువుల శక్తిని తగ్గించే కుట్ర జరుగుతోందన్న భావన కలుగుతోందని పేర్కొన్నారు. తప్పు చేసినవారు వేంకటేశ్వరస్వామి శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. ఏడు కొండలను రెండు కొండలు అన్న రాజశేఖర్‌రెడ్డికి ఎంతటి శిక్ష పడిందో అందరూ చూశారన్నారు. ఇప్పటికైనా లడ్డూ వివాదానికి ముగింపు పలకాలని కోరారు.

బేరసారాలన్నీ ఢిల్లీలోనే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధులు కూడా చిన్నప్పన్నను ఢిల్లీలోనే కలవడం గమనార్హం. ఎలా చూసినా చిన్నప్పన్న ఢిల్లీ నుంచే టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టుల వ్యవహారంలో జోక్యం చేసుకున్నట్టు సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన సీబీఐ సిట్ గుర్తించింది. ఇంతకూ ప్రీమియర్ డెయిరీ యజమాని ఢిల్లీలో చిన్నప్పన్నను కలిసిన ఎంపీ నివాస్ ఎవరిది? ఎవరి అండా లేకుండా చిన్నప్పన్న టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టు వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఎలా సాధ్యం? అన్న ప్రశ్నలు కీలకంగా మారాయి. నెయ్యి నాణ్యతపై ఫిర్యాదు వచ్చిందని, విచారించాలని ప్రొక్యూర్‌మెంట్ జీఎంను ఆదేశించిన అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆ తర్వాత, మిన్నకుండిపోవడం, తన పీఏ చిన్నప్పన్న కిలోకు రూ. 25 కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారంటూ భోలేబాబా డెయిరీ యజమాని నేరుగా ఫిర్యాదు చేసినా వైవీ సుబ్బారెడ్డి స్పందించకపోవడం ఈ సందర్భంగా గమనార్హం. ఈ అంశాలపై సిట్ దృష్టి సారించకపోవడం ప్రశ్నార్థకంగా మారుతోంది.

8.57 లక్షల కిలోల నెయ్యి - రూ.50 లక్షల కమీషన్

టీటీడీ నెయ్యి సరఫరాకు టెండర్లు పిలిచిన సందర్భంలో 2022 మే నెలలో, ఆ టెండరు కోసం ప్రయత్నిస్తున్న ప్రీమియర్ డెయిరీ ఎండీ గుప్తాకు అప్పటి సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న నుంచి ఫోన్ కాల్ వెళ్లింది. నెయ్యి సరఫరా టెండర్ల గురించి చర్చించడానికి తనను ఢిల్లీలో కలవాలని చెప్పారు. దీంతో గుప్తా న్యూఢిల్లీలోని నార్త్ ఎవెన్యూ ఎంపీ నివాస్‌లో చిన్నప్పన్నను కలిశారు. నెయ్యి సరఫరా టెండర్లు ఖరారు చేయిస్తే తనకు కిలోకు రూ.7 కమీషన్ ఇవ్వాలని చిన్నప్పన్న డిమాండ్ చేశారు. చిన్నప్పన్న ఒత్తిడికి తోడు టీటీడీతో తమ వ్యాపారం సజావుగా నడవడానికి చిన్నప్పన్న డిమాండ్ చేసిన మేరకు కమీషన్ ఇవ్వడానికి జగ్‌మోహన్ అంగీకరించారు. దీంతో ప్రీమియర్ డెయిరీకే టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కింది. టీటీడీకి 2022, 2023 ల్లో 8.57 లక్షల కిలోల నెయ్యి గుప్తా సరఫరా చేశారు. చిన్నప్పన్నకు కమీషన్ మొత్తాన్ని ఢిల్లీలోనే చెల్లించారు. ఈ కమీషన్ నగదు కోసం జగ్‌మోహన్‌కు చిన్నప్పన్న అనేకసార్లు కాల్స్ చేసినట్టు సిట్ గుర్తించింది. వాట్సాప్ కాల్స్‌తో పాటు సాధారణ కాల్స్ చేసినట్టు నిర్ధారించుకుంది. చిన్నప్పన్నకు కమీషన్ నగదు అందజేయడానికి జగ్‌మోహన్ తన డెయిరీలో పనిచేసే ఉద్యోగులు అమన్ గుప్తా, విజయ్ గుప్తాలను అప్పట్లో ఢిల్లీలోనే ఉంచారు. వారిద్దరూ అక్కడే మకాం వేసి పలు దఫాలుగా రూ. 50 లక్షలు చిన్నప్పన్నకు అందజేశారు.

అడ్డం తిరిగిన 'కమీషన్' కథ

టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీల వివరాలను టీటీడీ మార్కెటింగ్ జీఎం సుబ్రమణ్యం నుంచి తీసుకున్న చిన్నప్పన్న ఆ డెయిరీలలో ఒకటైన భోలేబాబా డెయిరీకి కమీషన్ ఏజెంటుగా పనిచేస్తున్న పీపీ శ్రీనివాసన్‌ను సంప్రదించారు. భోలేబాబా డెయిరీ నుంచి కమీషన్ ఇవ్వాల్సిందిగా ఫోన్‌లో అడిగారు. దాంతో తనకు సంబంధం లేదని చెప్పిన శ్రీనివాసన్, ఆ డెయిరీ ఆథరైజ్డ్ సిగ్నేటరీ అయిన కైలాశ్ చంద్ మాంగ్లాకు తెలియజేస్తానని సమాధానమిచ్చారు. అలాగే మాంగ్లాకు కాల్ చేసి చిన్నప్పన్నతో మాట్లాడాలంటూ ఆయన నంబరు కూడా ఇచ్చారు. 2022 మే 15న మాంగ్లా చిన్నప్పన్నను కాంటాక్ట్ చేసి, ఢిల్లీలో పొమిల్ జైన్‌తో పాటు చిన్నప్పన్నను కలిశారు. ఆ సందర్భంగా టీటీడీకి సరఫరా చేసే నెయ్యిలో కిలోకు రూ.25 చొప్పున కమీషన్ ఇవ్వాలని చిన్నప్పన్న వారిని డిమాండ్ చేశాడు. అయితే పొమిల్ జైన్ ఇవ్వడానికి ఒప్పుకోలేదు. ఈ విషయం పీపీ శ్రీనివాసన్, కైలాశ్ చంద్ మాంగ్లా కోర్టులో వాంగ్మూలమిచ్చారు. అంతకు మునుపు సిట్ విచారణలోనూ వీరిద్దరూ ఇదే విషయం చెప్పారు.

చుక్క చుక్కలో కల్తీ!

అయినా నాణ్యమైన నెయ్యిగా టీటీడీకి సరఫరా

▸▸ వైష్ణవీ డెయిరీ సీఈఓ అపూర్వచావ్డా కల్తీ లీలలు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 'భోలేబాబా పంపించేది కల్తీ నెయ్యి అని తెలుసు. దాన్నే అతి స్వచ్ఛమైన ఆగ్‌మార్క్ నెయ్యిగా చెబుతూ టీటీడీకి సరఫరా చేయాలి. అందరినీ మేనేజ్ చేయాలి. నెయ్యిలో చుక్క చుక్క కల్తీ ఉన్నా...అతి స్వచ్ఛమైనదిగా చెబుతూ ఇటు ల్యాబ్‌ల నుంచి అటు టీటీడీ నుంచి సర్టిఫికెట్ రావాలి. ఇందుకోసం ఏం చేయడానికైనా రెడీగా ఉండాలి'....ఇదీ వైష్ణవీ డెయిరీ సీఈఓ అపూర్వ చావ్డా (ఏ9) తీరు. తన ఉద్యోగులకు, ఇంకా టీటీడీలో నమ్మిన బంట్లకు ఆయన ఇచ్చిన ఆదేశాలివీ. ఇదంతా ఓ పద్ధతిగా సాగిపోయేలా నాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పీఏగా పనిచేసిన చిన్నప్పన్న చక్కటి మార్గాలేశారు. దీంతో 2020 నుంచి 2023 వరకు టీటీడీకి వైష్ణవీ డెయిరీ తరఫున సరఫరా చేసిన ఆవు నెయ్యి కల్తీదని తెలిసినా, అదే అసలు సిసలైన స్వచ్ఛమైన ఆవు నెయ్యి అని ఇటు ల్యాబ్‌లను, అటు టీటీడీ అధికారులను అపూర్వ చావ్డా మేనేజ్ చేయగలిగారు. ఇందుకు టీటీడీ అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించారు. దీంతో చావ్డా చేసిన కల్తీ పనులు రాచమార్గంలో సాగిపోయాయి. ఫలితంగా చిన్నప్పన్న ఖాతాలో కోట్లాది రూపాయలు వచ్చిపడ్డాయి. అపూర్వా చావ్డాకు హవాలా మార్గంలో 19.86 కోట్లు చేరాయి. టీటీడీ డెయిరీ నిపుణుడు మద్ది విజయభాస్కర్‌రెడ్డికి 75 లక్షలు, కమిషన్ ఏజెంటుకు 31 లక్షలు ముట్టాయి. ఇదంతా కల్తీని స్వచ్ఛమైనదిగా చూపించడం కోసం చేసిన కష్టఫలితమేనని సీబీఐ సిట్ తేల్చింది. కల్తీ నెయ్యి కేసులో చావ్డా ఏ9గా ఉన్నారు.

మేనేజ్ చేశారిలా.. చిన్నప్పన్న ఆదేశం మేరకే కేజీ నెయ్యికి రూ.25 కమీషన్ ఇవ్వనందుకు భోలే బాబా డెయిరీ కాంట్రాక్టును అర్ధాంతరంగా నిలిపివేయించిన విషయాన్ని సీబీఐ సిట్ వెలుగులోకి తీసుకొచ్చింది. 2020లో నెయ్యి కొనుగోలు టెండర్లు పిలిచినప్పుడు నేరుగా భోలేబాబా టెండర్‌లో పాల్గొనలేకపోవడంతో అది వైష్ణవీ డెయిరీ, ఏఆర్ డెయిరీ, మాల్‌గంగా డెయిరీలను రంగంలోకి దించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భోలేబాబా నుంచి తనకు ట్యాంకర్ల ద్వారా వచ్చే నెయ్యి ఫక్తు రసాయనాలు, ఇతర ఆయిల్స్‌తో కల్తీచేసి తయారు చేసిందేననేది అపూర్వ చావ్డాకు పూర్తిగా తెలుసు. ఒకసారి కల్తీనెయ్యితో టీటీడీకి వెళ్లిన ట్యాంకర్లు తిరిగి వెనక్కి రాకుండా ఉండేందుకు, అందులో కల్తీ సరుకు ఉందని గుర్తించకుండా ఉండేందుకు చావ్డా మేనేజ్‌మెంట్ పనులు చేశారని సిట్ చెబుతోంది. కేసు విచారణలో భాగంగా సిట్ వైష్ణవీ డెయిరీ ఉద్యోగులు వెంకటాచలపతి, సుధాకర్, సమీర్ తదితరుల ఫోన్‌లను పరిశీలించింది. వారు అపూర్వ చావ్డాతో జరిపిన ఫోన్ సంభాషణల కాల్‌రికార్డ్సు ఈ పరిశోధనలో బయటపడ్డాయి. "మీరేం చేస్తారో తెలియదు. ఎన్ఏబీఎల్ ల్యాబ్ రిపోర్టు అనుకూలంగా రావాలి. ఆ తొమ్మిది ట్యాంకర్ల నెయ్యి టీటీడీ తీసుకొనేలా రిపోర్టు అనుకూలంగా ఉండాలి. ఏం జరిగినా, ఎంత ఖర్చయినా పర్వాలేదు. కానీ పనవ్వాలి. ఖచ్చితంగా అనుకూలమైన ల్యాబ్ రిపోర్టు తీసుకోండి" అని అపూర్వ చావ్డా తన ఉద్యోగులతో మాట్లాడారు. నిందితుల ఫోన్‌లను సీబీఐ సిట్ విశ్లేషించినప్పుడు బయటకొచ్చిన వాటిల్లో ఇదే కీలకమైన అంశం. భారత ఆహారభద్రతా, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వద్ద వైష్ణవీ డెయిరీ 2017 ఫిబ్రవరి 21న లైసెన్స్ (10017042002926) తీసుకుంది. ఇది ఆవు నెయ్యి తయారీ కోసం, పాల సేకరణ కోసం తీసుకున్నది కాదు. ఐస్‌క్రీమ్‌ల తయారీ, ఇడ్లీ, దోశల పిండి తయారీ, వేరుశనగ పల్లీచిక్కీ తయారీ వంటి వాటికోసం తీసుకున్నారు. దానిని చూపించే టీటీడీ నెయ్యి టెండర్లలో వైష్ణవి పాల్గొంది. ఇవన్నీ పక్కా డాక్యుమెంట్లు, కాల్‌డేటాతో బయటపడ్డాయి.

ఎవరి కోసం చిన్నప్పన్న జోక్యం?

జగ్‌మోహన్ గుప్తాకు, చిన్నప్పన్నకు మధ్య బేరసారాలు జరిగిన ఆ ఎంపీ నివాస్ ఎవరిదన్నది కీలకంగా మారింది. ఆ భవనం ప్రైవేటుదా లేక ప్రభుత్వానిదా? ఎంపీలకు కేటాయించే అధికారిక క్వార్టరా? ఒకవేళ ఎంపీలకు కేటాయించే క్వార్టరే అయితే దాన్ని ఎవరికి కేటాయించారు? అప్పట్లో అందులో ఎవరు నివాసమున్నారు వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆ అంశాన్ని సిట్ దర్యాప్తు చేసిందా లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఎవరి అండా లేకుండా టీటీడీ నెయ్యి కాంట్రాక్టుల్లో జోక్యం చేసుకోవడం చిన్నప్పన్నకు ఎలా సాధ్యమైందన్నది మరో ప్రశ్న. టీటీడీలో సిఫారసు లేనిదే రూ.300 దర్శన టికెట్ కూడా దొరకడం కష్టం. అలాంటిది ఏటా రూ. 250 కోట్ల విలువైన నెయ్యి సరఫరా కాంట్రాక్టు వ్యవహారంలో చిన్నప్పన్న జోక్యం చేసుకోవడం ఎలా సాధ్యమైంది? రాజకీయంగా బలమైన వ్యక్తుల అండదండలు లేనిదే చిన్నప్పన్న టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎం వంటి అధికారిని ఎలా ప్రభావితం చేయగలిగారు? డెయిరీల యజమానులను ఢిల్లీకి పిలిపించుకుని మరీ లంచాలు ఎలా అడగగలిగారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదు. అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పీఏ కావడం వల్లే ఇవన్నీ సాధ్యపడ్డాయన్నది చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు. వైవీ సుబ్బారెడ్డి ఒంగోలు ఎంపీగా ఉన్నపుడు 2014 నుంచీ 2018 వరకూ చిన్నప్పన్న పీఏగా ఉన్నారు. తర్వాత వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్ అయ్యాక 2019 నుంచి 2023 వరకూ పీఏగా పనిచేశారు. అదే సమయంలో 2019 నుంచీ 2024 జూన్ 1 వరకూ వైవీ సుబ్బారెడ్డి సిఫారసుతోనే ఢిల్లీ ఏపీ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఆఫీసర్, లైజనింగ్ ఆఫీసర్ హోదాలో నియమితులై కొనసాగారు. ఈ నేపథ్యం లేకుంటే టీటీడీ వ్యవహారాల్లో చిన్నప్పన్న జోక్యాన్ని ఎవరూ ఖాతరు చేసే పరిస్థితి ఉండదు.

జైలులో ఉన్నది పది నెలలేగా

(మొదటి పేజీ తరువాయి)

సర్వోన్నత న్యాయస్థానం విముఖత వ్యక్తం చేసింది. మద్యం కుంభకోణం కేసులో సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. దాన్ని సవాలు చేస్తూ కసిరెడ్డి వేసిన పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వీ.అంజరియాలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపిస్తూ.. కసిరెడ్డి 10 నెలలుగా జైలులోనే ఉన్నారని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇదే కేసులో ఏ6, ఏ34 తదితరులకు ఇప్పటికే బెయిల్ లభించిందన్నారు. ఒక వ్యక్తిని నేరం రుజువు కాకుండానే 10 నెలలపాటు జైలులోనే ఉంచడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఏ7కు బంధువు అనే ఒక్క కారణంతో బెయిల్ నిరాకరించడం సరికాదన్నారు. స్పందించిన ధర్మాసనం..'వారికి బెయిల్ లభించిందని మీకు ఇవ్వలేం. కావాలంటే వారికిచ్చిన బెయిల్ రద్దు చేయమని మీరు కోరవచ్చు, కానీ మీ కేసు భిన్నమైనది' అని స్పష్టం చేసింది.

రూ.732 కోట్లు చిన్న మొత్తమా?.. నాగముత్తు వాదనలపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రూ.732 కోట్లు చిన్న మొత్తమా? అని ప్రశ్నించింది. '10 నెలలే కదా జైలులో ఉన్నది. రూ.732 కోట్ల కుంభకోణంలో 10 నెలలు జైలులో ఉంటే సరిపోతుందని మీరు భావిస్తున్నారా?. మద్యం కుంభకోణం జరిగిందని చెబుతున్న సమయంలో మీరు అధికారంలో ఉన్న వ్యక్తి. మీపై వచ్చిన ఆరోపణలకు, మీరు చాలా కాలంపాటు నిర్వహించిన పదవికి ప్రత్యక్ష సంబంధం ఉంది. మీరు సామాన్యమైన వ్యక్తి కాదు. మీరు భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని దర్యాప్తులో తేలింది. ఆ డబ్బు మీ ఖాతాల్లో లేదా తెలిసిన వనరుల్లో కనిపించకపోవచ్చు, కానీ, కుంభకోణంలో మీ పాత్ర స్పష్టంగా ఉంది. ఈ వ్యవహారంలో మీరు ప్రధాన కుట్రదారుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మిమ్మల్ని ఇతర నిందితులతో పోల్చలేం. నిధులు మళ్లించినట్లుగా చెబుతున్న షెల్ కంపెనీ మీ ప్రత్యక్ష నియంత్రణలోనే ఉంది. కాబట్టి మీరు ఇతర నిందితుల కంటే భిన్నమైన స్థితిలో ఉన్నారు. మద్యం పాలసీని ప్రభావితం చేయడంలోనూ, కొన్ని బ్రాండ్లకు లబ్ధి చేకూర్చడంలోనూ మీ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది' అని పేర్కొంది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదిస్తూ.. నిందితుడు అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి అని, బయటకు వస్తే సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని చెప్పారు. దీంతో.. వేరే నిందితులతో సమానంగా రాజ్ కసిరెడ్డిని చూడలేమని, కావున బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టులో తమ వాదనలు సరిగా వినలేదని, సుప్రీంకోర్టులో తమ వాదనలు పూర్తిగా వినాలని నాగముత్తు అభ్యర్థించగా.. ఆ వాదనలను ఇప్పుడే వినిపించాలని సీజేఐ అన్నారు. శుక్రవారానికి వాయిదా వేయాలని, ఆ రోజు సమగ్రంగా వాదనలు వినిపిస్తామని నాగముత్తు తెలిపారు. దీంతో అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసి ఉండవచ్చని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమకు సమగ్ర వాదనలు వినిపించేందుకు అవకాశం కల్పించాలని నాగముత్తు మరోసారి అభ్యర్థించగా, పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

లడ్డూ కల్తీ నిందితులను జైలుకు పంపాలి

▸▸ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్ హిందువుల మనోభావాలతో ఆడుకున్నారు: రాజాసింగ్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): హిందువులు భక్తితో కొలిచే తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీకి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ తండ్రి రాజశేఖర్ రెడ్డి తెలుగురాష్ట్రాల్లో హిందువులను మత మార్పిడి చేశారని ఆరోపించారు. తిరుమల కొండలపై చర్చి నిర్మించాలని రాజశేఖర్‌రెడ్డి ప్రయత్నించారని, సర్వే కూడా చేయించారని, భగవంతుడి ఆగ్రహం కారణంగా అదే అడవుల్లో హెలికాప్టర్ ప్రమాదంతో దుర్మరణం చెందాడన్నారు. రాజశేఖర్ రెడ్డి తరహాలోనే జగన్ కూడా హిందువులను మోసం చేశాడన్నారు. తిరుమల లడ్డూకు వినియోగించే నెయ్యి కల్తీ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా హిందువుల మనో భావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబును, కేంద్రహోం మంత్రి అమిత్‌షాను కోరారు.



శాంతిభద్రతలపై ఎస్పీలతో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, సీఎస్, డీజీపీ, మంత్రులు అనిత, అచ్చెన్న

కుల చిచ్చుకు కుట్రలు!

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతలపై డీజీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. రాజకీయ నిరసనలతో కులాలు, మతాల మధ్య చిచ్చు రగిల్చే ప్రయత్నాలు చేస్తున్నారని.. అటువంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి, వర్చువల్‌గా సమీక్షలో పాల్గొన్న జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లకు ఆదేశాలిచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణలో టెక్నాలజీకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాల సంఖ్య పెంపు, డ్రోన్ల పర్యవేక్షణ ద్వారా ఎంతో మార్పు తెచ్చినందుకు పోలీసు శాఖను అభినందించారు. కొన్ని జిల్లాలు ప్రశాంతంగా ఉన్నాయని.. మిగతా జిల్లాల్లో తీవ్ర నేరాల కట్టడికి మరింత మెరుగైన పనితీరు కనబరచాలని ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్లు (16ఏళ్ల లోపువారు) సోషల్ మీడియా వినియోగించకుండా నియంత్రించే చట్టం తీసుకు రాబోతున్నామని చెప్పారు. హత్యలు తగ్గినా ఆత్మహత్యలు పెరగడం.. గంజాయి సాగు తగ్గినా వినియోగం తగ్గకపోవడం.. మహిళలపై నేరాలు తగ్గినా ఆత్మహత్యలు తగ్గకపోవడం.. రోడ్లు బాగున్నా రోడ్డు ప్రమాదాలు అదుపులోకి రాకపోవడం లాంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆత్మహత్య చేసుకునే వారిలో మహిళలు, వ్యవసాయ కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు కూడా ఉన్నారని.. కారణాలు విశ్లేషించి కౌన్సెలింగ్ చేపట్టాలని ఆదేశించారు. పోలీసింగ్‌లో సాధించిన విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

నేరాల కట్టడికి ఏఐ4ఏపీ: డీజీపీ

హత్యలు, దాడులు, గంజాయి సాగు, మహిళలపై నేరాలు తగ్గాయని.. శిక్షల శాతం, దొంగలపాలైన సొమ్ము రికవరీ పెరిగిందని డీజీపీ తెలిపారు. ఆత్మహత్యలు పెరిగాయన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు, డ్రోన్లు మంచి ఫలితాలు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏపీ పోలీసింగ్ కృత్రిమ మేధ (ఏఐ) వైపు అడుగులు వేస్తోందన్నారు. మూడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఏఐ4ఏపీ ప్రారంభించి దేశంలోనే మొదటి అడుగు వేశామని చెప్పారు. 'గతంలో గంజాయి అంటే ఏపీ పేరు వినిపించేది.. ఇప్పుడు కట్టడిలో మార్గదర్శకంగా నిలుస్తోంది.. ఇతర రాష్ట్రాలు ఏపీ తరహాలో ముందుకెళ్లాలి' అని నిరుడు పలు రాష్ట్రాలతో ఏర్పాటుచేసిన సమావేశాల్లో కేంద్రం పేర్కొన్నట్లు 'ఈగల్' విభాగం ఐజీ ఆకే రవికృష్ణ చెప్పారు. ఇందుకు సీఎం అభినందించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం తగ్గించేందుకు ప్రతి 15 రోజులకోసారి అవగాహన ర్యాలీలు చేపట్టాలని సూచించారు. వాటి బారిన పడినవారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించాలన్నారు. ఇక నెలకోసారి సమీక్ష జరుపుతానని చెప్పారు. మహిళలకు ఏ క్షణంలో ఆపద వచ్చినా శక్తి బృందాలు అత్యంత వేగంగా స్పందిస్తున్నాయని.. మహిళలపై నేరాల తగ్గుదలకు అదొక ప్రధాన కారణమని మహిళా రక్షణ విభాగం ఐజీ రాజకుమారి వివరించారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచండి

ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారికి పది సార్లు హెచ్చరికలు పంపుతున్నామని, అప్పటివరకూ చలాన్లు విధించడం లేదని ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తెలిపారు. పది ఉల్లంఘనల తర్వాత కూడా నామమాత్రంగానే చలాన్లు విధించాలని, దానికంటే ముందు ప్రజల్లో అవగాహన మరింత పెంచాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం అవగాహన కల్పించడం అంతంతమాత్రంగానే ఉందన్నారు.

కేంద్ర నిధులు మురిగిపోతే

అధికారులదే బాధ్యత

- వాటిని తక్షణమే ఖర్చుచేయాలి
- పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం



మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి హాజరైన ఉన్నతాధికారులు

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలన్నీ కేంద్ర పథకాల ద్వారా వచ్చిన నిధుల్ని తక్షణం ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అవి మురిగిపోతే అధికారులనే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. మంత్రులు, అధికారులు టెక్నాలజీని అందిపుచ్చుకోవడం లేదని ఆక్షేపించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో ముఖాముఖి సమావేశం జరిగింది. ఇందులో కలెక్టర్లు కూడా వర్చువల్‌గా పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ.. 'రాష్ట్ర ఖజానాకు నష్టం రాకూడదు. పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలి. అలాగని వ్యాపారులను వేధించి వసూలు చేయొద్దు' అని చెప్పారు. ఆన్‌లైన్ సేవలు, వాట్సాప్ గవర్నెన్స్ వినియోగం, ప్రచారంలో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. 'టెక్నాలజీని ప్రజలు వాడరు. మనమూ వాడడం లేదు. ఇప్పటికీ కొందరు మంత్రులు, హెచ్‌వోడీలు టెక్నాలజీని భూతంలా చూస్తున్నారు. ఈ విషయంలో వెనక్కి వెళ్లేది లేదు. ఇకపై శాఖల వారీగా కూడా నివేదికలు కోరతాం' అని తేల్చిచెప్పారు. కొన్ని శాఖలు చాలా పాతకాలం విధానాలనే పాటిస్తున్నాయన్నారు. 'మనమిత్ర' వినియోగంలో దేవదాయ శాఖ పనితీరుపై పెదవి విరిచారు. ఆ శాఖకు మళ్లీ చెప్పనని.. తీరు మారాలని హెచ్చరించారు. ఇప్పటికీ 91% సేవలు మాన్యువల్‌గానే ఉన్నాయని, టికెట్లు కూడా ఆన్‌లైన్‌లో పెట్టలేకపోతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గతం కంటే ఇప్పుడు మాన్యువల్ సేవల వినియోగం పెరిగిన శాఖల నుంచి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. కళ్లు మూస్తే అందరూ కలిసి దీనిని ఫెయిల్ చేస్తారని కటువుగా వ్యాఖ్యానించారు. మార్చి 31 డెడ్‌లైన్‌గా పెట్టుకుని అన్ని శాఖలూ ఆన్‌లైన్‌లోకి మారాలన్నారు. ఏఐ వినియోగంలో సమస్యలు పరిష్కరించేవారికి ప్రైజ్ మనీ ఇస్తే బాగుంటుందని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సూచించగా సీఎం అంగీకరించారు. వెంటనే నిధులివ్వాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి మట్టాలను వెల్లడించే రిజర్వాయర్ సెన్సస్ అమలుపై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. దీని అమలులో ఎందుకు ఆలస్యం జరుగుతోందని ప్రశ్నించారు. వెంటనే ఆ కాంట్రాక్టరును తన వద్దకు తీసుకురావాలని.. ఒకవేళ రాకపోతే పోలీసులను పంపించి తీసుకొస్తామని హెచ్చరించారు. ఇష్టముంటే చేయాలని లేదంటే.. వదిలేసి వెళ్లిపోవాలన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు కేవైసీ..

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై కలెక్టర్లు చొరవ చూపాలి. 1,04,727 పీడీ ఖాతాల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల విలువ రూ.148 కోట్లు. ఈ పీడీ ఖాతాలన్నిటికీ కేవైసీ సమర్పించాల్సి ఉండగా రూ.34 కోట్ల డిపాజిట్లకు చెందిన 7,742 ఖాతాలకు మాత్రమే కేవైసీ చేయించారు. సంస్కరణల ప్రాతిపదికన సాస్కీ కింద వచ్చే ప్రాజెక్టుల నిధులు త్వరితగతిన వచ్చేలా చూడాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రానికి రూ.26,021 కోట్లు వచ్చే అవకాశముంది. ఈ నిధులను ఎప్పటికప్పుడు ఖర్చు చేసి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాలి. గత ప్రభుత్వం ఆర్థిక విషయాల్లో దుర్మార్గంగా వ్యవహరించింది. 14 శాతం వడ్డీకి రుణాలు తెచ్చి అప్పుల భారం మోపింది. వాటిని 9 శాతానికి తగ్గించడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నాం. కానీ కొన్ని బ్యాంకులు అంగీకరించడం లేదు. మన ఆర్థిక పరిస్థితి ఇలా ఉంటే.. మీరేమో (అధికారులు) కేంద్ర నిధులు వాడరు.. పైగా మాకు సలహాలిస్తారు. జీరామ్‌జీ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, పురపాలక విభాగాలన్నీ సమర్థంగా పనిచేయాలి. అటవీ శాఖ ఎర్రచందనం విక్రయించి ఆదాయం సంపాదించాలి. పరిశ్రమలకు అనుమతులు సులభతరం చేయాలి. ఒక రైస్ మిల్లు పెట్టాలంటే 39 కార్యాలయాల్లో అనుమతులు తీసుకోవాలంటే ఎలా?

నిబద్ధతతో అమలుచేయాలి..

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వాటిని నిబద్ధతతో క్షేత్ర స్థాయిలో అమలుచేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా, కోస్తాను ఆక్వా హబ్‌గా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.10,000 కోట్లను 48 గంటల్లో చెల్లించేశాం. సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటివరకూ రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. విశాఖలో గూగుల్, ఇతర సంస్థలు కూడా డేటా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయి. రోడ్ల మరమ్మతుల కోసం రూ.1,000 కోట్లు ఖర్చు చేశాం. మరో రూ.3,000 కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. 9.88 శాతం వృద్ధిరేటు సాధించాం. త్వరలో రెండంకెల వృద్ధిరేటు సాధిస్తాం. పోలవరం ప్రాజెక్టును 2027 పుష్కరాల నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పూర్తి సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో పడింది. పాత చట్టాలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేవు. వాటిని పూర్తిగా తొలగిద్దాం. 2-3 రోజుల్లో అన్ని శాఖల్లో ఉన్న పాత చట్టాలను బయటకు తీయాలి. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే పాత చట్టాలను తొలగించడం లేదా సవరణ చేసే ప్రక్రియ పూర్తి కావాలి.

తాడేపల్లి హెలిప్యాడ్ కోసం అధికార దుర్వినియోగం

తాడేపల్లి ప్యాలెస్ వద్ద హెలిప్యాడ్ కోసం ఓ ప్రైవేటు భూమిని అమ్మాలంటూ యజమానిని ఒత్తిడి చేయగా ఆయన నిరాకరించారు. దీంతో ఆ భూమిని 22ఏలో పెట్టేసి అధికార దుర్వినియోగం చేశారు. ఇది ఒక్క తాడేపల్లిలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా జరిగింది. భూవివాదాలు లేకుండా పకడ్బందీగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం. క్యూఆర్ కోడ్‌తో సహా ఇతర భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందిస్తున్నాం.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి: ఉపముఖ్యమంత్రి

రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పల్లెపండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రులు, కార్యదర్శులకు గుర్తు చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా 28,000 కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయని, రూ.10,000 కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. అటవీ శాఖ ద్వారా నగర వనాలతో పాటు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్టు వెల్లడించారు. నిధుల కొరత ఉన్నప్పటికీ నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను చేరుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు.

సింగిల్ విండో విధానంలో రాజధానికి ఇసుక

- ఎవరూ అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణం కోసం తరలించే ఇసుకను ఎవ్వరూ ఆపకుండా, అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ దిశగా గనులశాఖ తక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఈ అంశం చర్చకొచ్చింది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఇతర జిల్లాల నుంచి రాజధాని నిర్మాణం కోసం వస్తోన్న ఇసుకను అడ్డుకుంటున్నారన్న ఫిర్యాదులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాజధాని పనులకోసం వచ్చే ఇసుకను ఎవ్వరూ అడ్డుకోవద్దని ఇంతకు ముందే చెప్పాం. కలెక్టర్లకు ఆదేశాలిచ్చాం. అయినా ఈ సమస్య మళ్లీ మళ్లీ వస్తోంది? లోపం ఎక్కడుంది? ఈ విషయంలో కలెక్టర్లు, గనుల శాఖ కఠినమైన చర్యలు తీసుకోవాలి' అని సీఎం స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణ పనులకోసం వచ్చే ఇసుక కోసం సింగిల్ విండో విధానం అమలు చేయాలని గనులశాఖ ముఖ్యకార్యదర్శిని ముకేశ్‌కుమార్ మీనాకు సూచించారు. రాజధాని కోసం వచ్చే ఇసుకను అడ్డుకుంటే కఠినంగా వ్యవహరించాలని ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు కలెక్టర్లకు సూచించారు.

అసెంబ్లీకి ఒక్కరోజు వైసీపీ

- రేపు గవర్నర్ ప్రసంగానికి హాజరు



అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి హాజరు కావాలని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి నిర్ణయించారు. ఆ రోజు మాజీ సీఎం హోదాలో జగన్ వాహనాన్ని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతిస్తారా అంటూ శాసనసభ వర్గాలను వైసీపీ నేతలు ఆరా తీసినట్టు తెలిసింది. ఇందుకు శాసనసభ వర్గాలు కూడా సుముఖతను వ్యక్తం చేసినట్టు సమాచారం. 2024 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, గవర్నర్ ప్రసంగ కార్యక్రమాల కోసం అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు వచ్చారు. ఆ తర్వాత నుంచి శాసనసభా సమావేశాలను బాయ్‌కాట్ చేస్తూ వస్తున్నారు. అయితే, కేంద్రానికి సానుకూల సంకేతాలు పంపించేందుకుగాను ప్రతిసారీ గవర్నర్ ప్రసంగానికి మాత్రం హాజరవుతున్నారు. గవర్నర్ ప్రసంగం రోజును శాసనసభ పని దినంగా గుర్తించరు. అందువల్ల, గవర్నర్‌కు గౌరవం ఇచ్చేలా ఈ కార్యక్రమానికి హాజరైతే, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలూ ఎదురు కాబోవని జగన్ భావిస్తున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతానికి గవర్నర్‌తో సఖ్యతను జగన్ కోరుకుంటున్నారని చెబుతున్నారు. అందువల్ల బుధవారం నాటి గవర్నర్ ప్రసంగానికి వైసీపీ ఉభయసభల సభ్యులూ హాజరవుతారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గవర్నర్ ప్రసంగం తర్వాత మళ్లీ పాత విధానమే జగన్ కొనసాగిస్తారని అంటున్నాయి.

విద్యుత్తు చార్జీల భారం తగ్గాలి

- ట్రూ డౌన్ ఫలితాలు ప్రజలకే దక్కాలి
- ఆర్టీసీలో 1,000 ఈవీ బస్సుల కొనుగోలు
- మంత్రులు, కార్యదర్శులకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్తు చార్జీల భారాన్ని గణనీయంగా తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విద్యుత్తు కొనుగోలు భారాన్ని కూడా యూనిట్ రూ.3.90 లకు తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ట్రూడౌన్ ఫలితాలు ప్రజలకే అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. "నెట్ జీరో ఎమిషన్ కాన్సెప్టుతో విద్యుత్ ఉత్పాదన జరగాలి. ఒక మీటరు వరకు భూగర్భ జలాలను పెంచడం ద్వారా దాదాపు రూ.4 వేల కోట్లు ఆదా అవుతుంది. పీఎం కుసుమ్, సూర్యఘర్ పథకాల కింద సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులు వేగంగా చేపట్టాలి. కుప్పంలో ఇటీవల 5వేల సైకిలుకు ఈ-సైకిళ్లు పంపిణీ చేశాం. ఆర్టీసీలో కనీసం వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. స్వయం సహాయక సంఘాలకు 'స్వయం' అనే పేరుతో బ్రాండ్‌ను రూపొందించాం. ఈ బ్రాండ్ ద్వారా తయారు చేసిన ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. అరకు కాఫీ తరహాలోనే కోకో పంటలకు కూడా మంచి బ్రాండింగ్ రావాలి. సీమను ఉద్యాన రంగంలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు ప్రైవేట్ పెట్టుబడులనూ ఆకర్షించాలి. రాష్ట్రవ్యాప్తంగా 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. దీనిలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. మరోవైపు పట్టణాలు, నగర ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ చేపట్టాలి. నిధులను పీసీబీ ద్వారా సమకూర్చుకోవాలి. తీర ప్రాంతంలో కోత నివారణకు ఉపముఖ్యమంత్రి చేపట్టిన ప్రాజెక్టు అభినందనీయం' అని చంద్రబాబు అన్నారు.

విద్యుత్తు 'వ్యయాన్ని' గణనీయంగా తగ్గిస్తాం: సీఎస్

విద్యుత్తు రంగంపై ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రజంటేషన్ ఇచ్చారు. 'నీతి ఆయోగ్ రూపొందించిన ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ ట్రాన్సిషన్ బ్లూప్రింట్ (2025-35) ప్రకారం రాష్ట్రం శుద్ధ ఇంధన(క్లీన్ ఎనర్జీ) ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు దృఢంగా అడుగులు వేస్తోంది. అదే సమయంలో 2030 నాటికి యూనిట్ విద్యుత్తు కొనుగోలు వ్యయం రూ.4.20కి, 2035 నాటికి రూ.3.90కి తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకుంది. పర్యావరణ అనుకూల, తక్కువ వ్యయంతో కూడిన విద్యుత్తు సరఫరాను సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. నెట్ జీరో ఎమిషన్స్ లక్ష్యం దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోంది. ప్రభుత్వ భవనాలపై 150 మెగావాట్ల వరకు సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసే కార్యక్రమం కొనసాగుతోంది' అని విజయానంద్ పేర్కొన్నారు. విద్యుత్తు శాఖ అమలు చేస్తున్న ప్రధాన కార్యక్రమాలైన పీఎం కుసుమ్, సూర్యఘర్ కార్యక్రమాల అమలును ఆయన వివరించారు.

నీటి ఎద్దడి రాకూడదు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు మాట్లాడితే చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని చెప్పారు. పీ-4 రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమమన్నారు. మార్గదర్శులు, బంగారు మిత్రలను నియమించుకోవాలన్నారు. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాల రీషెడ్యూల్ చేస్తున్నామని చెప్పారు. జీతాల చెల్లింపులను గాడిలో పెట్టామన్నారు. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమపువ్వు ఉత్పత్తికి అవకాశాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు కశ్మీర్‌లో మాత్రమే కుంకుమపువ్వు ఉత్పత్తి జరుగుతోందన్నారు. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు సమీపంలో కోకో సిటీ కూడా ఏర్పాటవుతోందన్నారు. కాఫీ సాగు పెంచడంతో పాటు అరకు కాఫీ బ్రాండ్ ప్రమోట్ చేస్తున్నామన్నారు.

నీటి నిల్వలు పెరగాలి

"రాష్ట్రంలో 38,608 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వద్ద నీటి నిల్వలకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలి. చెరువులు, కాల్వలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలి. డీసిల్టింగ్, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్‌లను తవ్వాలి. భూగర్భ నీటి నిల్వలు పెరిగితే పర్యావరణ పరంగా మంచిది. విద్యుత్ కూడా ఆదా అవుతుంది. నీటి బ్యాంకు తరహాలో భూగర్భజలాలు వినియోగం జరగాలి. పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. బోర్ల నుంచి కలుషిత నీరు రావడానికి వీల్లేకుండా చూడాలి. ఆశ్రమ బాలుర హాస్టళ్లలో కలుషిత నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. ఇలాంటి సంఘటనలు జరిగితే దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ మంత్రులదే బాధ్యత. త్వరలో వేసవి రాబోతోంది. నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటి నుంచే వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. తాగునీటికి ఇబ్బంది రాకుండా చూసుకోవడంతో పాటు పశువుల దాణాకూ ఇబ్బంది రాకూడదు. పంచాయతీరాజ్ రోడ్లు, నీటిసంరక్షణ చర్యలు, గోకుల షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్లు చేపట్టాలి. జీ రామ్‌జీ పనులపై కార్యాచరణ సిద్ధం చేయండి" అని సీఎం ఆదేశించారు.

హెల్త్ స్ర్కీనింగ్

"సంజీవని ద్వారా జూలై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్ర్కీనింగ్ చేయాలి. 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థులకు స్ర్కీనింగ్ చేయాలి. 12వ తరగతి వరకు ఉన్న 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేయాలి. కేర్ అండ్ గ్రో ద్వారా మాతా శిశు ఆరోగ్యం, పెరుగుదలను నమోదు చేయాలి. పౌష్టికాహారంతో పాటు అవసరమైన సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. అవిశ, మునగ, రకరకాల ఆకుకూరల్లో పౌష్టికాహారం లభిస్తుంది. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలలో పౌష్టికాహారాన్ని అందించేలా కార్యాచరణ ఉండాలి. వీలుంటే అన్న క్యాంటీన్లలో కూడా పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి. ఇక నార్మల్ డెలివరీలు పెరిగేలా చూడాలి. సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. వచ్చే ఏడాది ఎయిడ్స్ ఫ్రీ ఏపీగా డిక్లేర్ చేస్తాం. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్రమైన ఓ కార్డు జారీ చేస్తాం. మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి" అని చంద్రబాబు చెప్పారు.



మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, సీఎస్ విజయానంద్, మంత్రులు అనిత, అచ్చెన్న, లోకేశ్, అనగాని, నిమ్మల, నాదెండ్ల తదితరులు

ఒత్తిడి లేని విద్యాబోధన లక్ష్యం

"పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. పరీక్షలు అంటే.. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండేలా ఈ కార్యాచరణలో భాగం చేయాలి. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడానికి వీల్లేదు. ఒత్తిడి లేని విద్యా విధానంతోనే కొత్త ఆలోచనలొస్తాయి. ఇన్నోవేషన్లకు ఆస్కారముంటుంది. విద్యా వ్యవస్థలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వయోజన విద్యలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలి. లేటరల్ ఎంట్రీ ఉండేలా యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో చర్యలు చేపట్టాలి. ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ వంటి వారు ఉన్నత విద్యను అభ్యసించి సర్టిఫికెట్లు పొందేలా కార్యాచరణ ఉండాలి. కేంద్రం అమలు చేస్తున్న కర్మయోగి పథకంలో ఏపీకి చెందిన వారే అగ్రస్థానంలో ఉన్నారు. నైపుణ్య కల్పనలో భాగంగా ఐటీఐలు, కళాశాలల్లో కాన్వకేషన్లు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా స్కిల్లింగ్‌తో పాటు ఉద్యోగాలు ఏ మేరకు వస్తున్నాయనే అంశాన్ని పర్యవేక్షించాలి. నైపుణ్యాభివృద్ధి రంగాన్ని మరింత బలోపేతం చేయాలి" అని చంద్రబాబు సూచించారు.

నదుల అనుసంధానంతో రాష్ట్రానికి పుష్కలంగా జలాలు: సీఎం

- జల భద్రతపై జలవనరుల శాఖ ప్రజంటేషన్

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానంతో రాష్ట్రానికి పుష్కలంగా జలాలు అందించేలా కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని జల వనరుల శాఖ, జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచించారు. సోమవారం మంత్రులు, కార్యదర్శులతో జరిగిన సమీక్షలో 'జల భద్రత'పై ప్రత్యేక చర్చ చేపట్టారు. ఈ చర్చలో మంత్రి నిమ్మల రామానాయుడు, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆ శాఖ 'జల భద్రత'పై ప్రజంటేషన్ ఇచ్చింది. కేంద్ర జల సంఘానికి పంపిన పోలవరం-బనకచర్ల పీఎఫ్‌ఆర్‌కు ఈ నెలాఖరులోగా ఆమోదం పొందాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నామన్న జలవనరుల శాఖ... ఆ ప్రాజెక్టుకు వివిధ అనుమతులు పొందడానికి పెట్టుకున్న లక్ష్యాలనూ వివరించింది. '72 శాతం పూర్తిచేసిన వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాది జూన్ నాటికే పూర్తిచేయాలని భావిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు పనులు 86% దాకా పూర్తయినందున.. మిగిలిన 14% పనులను వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తిచేయాలని నిర్ణయించాం. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు నీరందించే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 87శాతం పూర్తయ్యాయి. అలాగే ఉత్తరాంధ్రలోని 11ప్రాజెక్టులను, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువలో మిగిలిన 400.50 కిలోమీటర్ల పనులను ఇప్పటికే చేపట్టాం. కల్యాణి డ్యామ్ వరకూ కృష్ణా జలాలను తరలించాలని నిర్ణయించాం. వంశధార-నాగావళి అనుసంధాన పథకం, నాగావళి-చంపావతి అనుసంధానం, పోలవరం-ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాల పూర్తికి ప్రణాళికను రూపొందించాం. మైనర్ ఇరిగేషన్ చెరువులన్నీ నింపేలా కార్యాచరణను సిద్ధం చేశాం' అని జల వనరుల శాఖ పేర్కొంది.



ఢిల్లీ విమానాశ్రయం లాంజ్‌లో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, కూటమి ఎంపీలతో సమావేశమైన సీఎం చంద్రబాబు

నేడు అమిత్‌షాతో సీఎం భేటీ

- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్, చౌహాన్, వైష్ణవ్‌లతోనూ ముఖ్యమంత్రి సమావేశం
- ఢిల్లీ చేరిన చంద్రబాబు
- విమానాశ్రయం లాంజ్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన టెండూల్కర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, కూటమి ఎంపీలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో ఆయన వారితో సమావేశమై చర్చించారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, కేంద్రం నుంచి రావలసిన నిధులు, తాజా రాజకీయ పరిణామాలపై వారికి దిశానిర్దేశం చేశారు. కాగా.. చంద్రబాబు ఢిల్లీ విమానాశ్రయంలో ఉన్నారని తెలుసుకుని.. క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ ఆయన్ను లాంజ్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారు ఆత్మీయంగా పలుకరించుకోవడం అక్కడ అందరినీ ఆకర్షించింది. ఏపీలో చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను టెండూల్కర్ ప్రశంసించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎం 1-జన్‌పథ్‌లోని తన అధికారిక నివాసానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మరో నలుగురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు నిర్వహించనున్నారు. తొలుత జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, తర్వాత అమిత్‌షా, అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లతో సమావేశమవుతారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, వివిధ పథకాలు, కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై చర్చిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆయన అమరావతికి తిరుగుప్రయాణమవుతారు.

ఏపీఎంసీ ఎన్నికల్లో 55 % పోలింగ్

- ఓటు వేసిన 30,773 మంది వైద్యులు.. నేడు ఫలితాల వెల్లండి

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏపీఎంసీ ఎన్నికల్లో 30,773 మంది వైద్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికలాధికారి చక్రధర్‌బాబు తెలిపారు. ఏపీఎంసీ కార్యవర్గ సభ్యుల ఎన్నికకు సోమవారం ఓటింగ్ నిర్వహించామని ఒక ప్రకటనలో తెలిపారు. 56 వేల మంది వైద్యులు ఓటు హక్కు కలిగి ఉండగా, 30,773 మంది (55 శాతం) వినియోగించుకున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటలకు ముగియాల్సి ఉందని, సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో రాత్రి 8 గంటల వరకూ ఓటింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. 20 ఏళ్ల విరామం తర్వాత జరిగిన ఎన్నికల్లో ఈ స్థాయిలో వైద్యులు ఓటు వేయడం మంచి పరిణామన్నారు. తెలంగాణలో 36 శాతం, మహారాష్ట్రలో 21, కర్ణాటకలో 30, తమిళనాడులో 25 శాతం మాత్రమే ఓటింగ్ నమోదయిందని, ఏపీలో అత్యధికంగా 55 శాతం నమోదయ్యిందని రిజిస్ట్రార్ ఐ.రమేష్ తెలిపారు. ఎన్నికల ఫలితాలను మంగళవారం ప్రకటిస్తామని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.